

STAY UPDATED IN REAL-TIME WITH OUR WHATSAPP CHANNEL



GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/53323

# సమయజ్యోతి

ప్రతీ అక్షరం - ప్రజలకోసం

తెలుగు దిన పత్రిక

CELEBRATING 12TH YEAR ANNIVERSARY

సంపుటి : 12 సంచిక : 218 పేజీలు : 12 ఆదిలాబాద్ వెల రూ : 01 మంగళవారం 18 నవంబర్ 2025 ఎడిటర్ : ఫైసల్ ఖాన్







# మరో ఘోర విషాదం

మంటలు చెలరేగడంతో

## 46 మంది మృత్యువాత

- సౌదీ అరేబియాలో ఘోర బస్సు ప్రమాదం
- డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొన్న టూరిస్ట్ బస్సు
- బతికి బయటపడ్డ ఒకే ఒక్కడు
- మృతలంతా హైదరాబాద్ పాతబస్తీ వాసులు
- మక్కాకు వెళుతుండగా ప్రమాదం

**హైదరాబాద్,నవంబర్17(సమయజ్యోతి):**

సౌదీ అరేబియాలో ఘోర విషాద ఘటన చోటుచేసుకుంది. మదీనాకు సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 45 మంది హైదరాబాదీలు మృతిచెందారు. యాత్రికులతో వెళ్తోన్న బస్సు.. డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. సౌదీ అరేబియాలో సోమవారం తెల్లవారుజామున ఈ ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మదీనాకు సమీపంగా భారీ రోడ్డు ప్రమాదం సంభవించింది. మక్కా నుంచి మదీనా వెళుతున్న యాత్రికుల బస్సు డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టడంతో మంటలు చెలరేగి పెద్ద దుర్ఘటన చోటుచేసుకుంది. ఈమంటల్లో హైదరాబాద్‌కు చెందిన 45 మంది యాత్రికులు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం.

02

# హసీనాకు ఉరిశిక్ష



అల్లర్లలో కాల్పులకు ఆదేశించారన్న అభియోగం

ఢాకా ట్రిబ్యునల్ కోర్టు సంచలన తీర్పు

**ఢాకా,నవంబర్ 17(సమయజ్యోతి):**

ఢాకా అల్లర్లకు కారణమంటూ బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు అక్కడి కోరటు ఉరిశిక్ష విధించింది. దశాబ్దాల పాటు ఆ దేశ రాజకీయ చరిత్రను తానై నడిపించిన ఆమెను 'ఉక్కు మహిళ'గా వ్యవహరిస్తుంటారు. కానీ, తన హయాంలో ఏర్పడ్డ ట్రిబ్యునలే.. ఇప్పుడు ఆమెకు మరణశిక్ష విధించింది. ఇటీవలి అల్లర్ల తరవాత ఆమె భారత్‌లో ఆశ్రయం పొంది ప్రవాస జీవితం గడుపుతున్నారు. ఆమె ప్రభుత్వం అసమ్మతిని అణచివేసిందని, మీడియాపై ఆంక్షలు విధించిందని, ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేసిందని, భద్రతా శక్తుల అధికారాలను పెంచిందనే ఆరోపణలు వచ్చాయి. 2024లో స్వాతంత్య పోరాట వీరుల పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో కోటాకు వ్యతిరేకంగా మొదలైన విద్యార్థి నిరసనలు చివరికి దేశవ్యాప్త తిరుగుబాటుగా మారాయి. ఈ నిరసనలే హసీనా పాలనను అంతం చేశాయి. ఆమె ప్రభుత్వం చేపట్టిన భద్రతా చర్యల వల్ల హింస పెరిగింది.

02

## బిజెపి గెలిస్తే ఇవిఎంల ట్యాంపర్

మీరు గెలిస్తే ప్రజాస్వామ్యబద్ధమా

జూబ్లీహిల్ ఓటమితో కుంగిపోయేది లేదు

కాంగ్రెస్ విమర్శలపై మండిపడ్డ ఈటెల రాజేందర్

**హైదరాబాద్,నవంబర్ 17(సమయజ్యోతి):**

ఉప ఎన్నికల్లో అధికార పార్టీ గెలవడం సహజమే అని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. గెలిచినా, ఓడినా.. అధికారం ఉన్నా, లేకపోయినా దశాబ్దాలుగా కాషాయ జండా పట్టుకుని ప్రజల కోసం పనిచేస్తున్న పార్టీ భారతీయ జనతా పార్టీ అన్నారు. గెలిస్తే బీజేపీ వాళ్ళు ఈవీఎంలను ఏదో చేశారని అంటున్నారు.

ఏనుమాముల వ్యవసాయ మార్కెట్

## బోసిపోయింది.

పత్తి కొనుగోళ్లపై ప్రతిష్టంభన

ఎనుమాముల మార్కెట్‌లో నిలిచిన కొనుగోళ్లు

సిసిఐ తీరుపై మండిపడ్డ బిఆర్ఎస్ నేతలు

కేంద్ర,రాష్ట్రాల్రది మొద్దు నిద్ర అంటూ కెటిఆర్ విమర్శలు

**వరంగల్,నవంబర్17(సమయజ్యోతి):**



వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లపై తీవ్ర గందరగోళం నెలకొంది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీసీఐ తీరుపై రైతులు, జిన్నింగ్ మిల్లర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీసీఐ కొత్త కొర్రీలతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు, వ్యాపారులు తెలిపారు. ఈ క్రమంలో నేటి నుంచి జిన్నింగ్ మిల్లుల బంద్‌కు వ్యాపారులు పిలుపునిచ్చారు. బంద్ పిలుపు నేపథ్యంలో రైతులు పత్తిని మార్కెట్‌కు తీసుకురాని పరిస్థితి. దీంతో ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ బోసిపోయింది. పత్తి కొనుగోళ్లపై ఉమ్మడి వరంగల్ జిల్లా రైతుల్లో ఆందోళన నెలకొంది. తీసిన పత్తిని అమ్ముకోలేక అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. పత్తి రైతుల బాధలపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు స్పందిస్తూ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# డిసెంబర్ 1 నుంచి 9 వరకు ప్రజాపాలన వారోత్సవాలు



- డిసెంబర్ రెండోవారంలో స్థానిక ఎన్నికలు
- ప్రజాపాలన వారోత్సవాల అనంతరం నోటిఫికేషన్
- కేబినేట్‌లో మంత్రులతో చర్చించిన సిఎం రేవంత్
- ప్రజాపాలన వారోత్సవాల్లో గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రచారం

02

**హైదరాబాద్,నవంబర్17(సమయజ్యోతి):**

స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజాపాలన వారోత్సవాల తర్వాత ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. డిసెంబర్ 1 నుంచి 9 వరకు ప్రజాపాలన వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఆ తర్వాత ఎప్పుడైనా ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. మరోవైపు సౌదీ అరేబియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని కేబినెట్ నిర్ణయించింది. మంత్రి అజారుద్దీన్, ఎంఐఎం ఎమ్మెల్యే, మైనార్టీ విభాగానికి చెందిన ఓ అధికారితో కూడిన ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని వెంటనే సౌదీకి పంపించాలని సూచించింది. చనిపోయిన వారి మృతదేహాలకు మత సంప్రదాయం ప్రకారం.. అక్కడే అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించింది.



# సింగరేణి ఉద్యోగుల కోసం పోరాటం

డిపెండెంట్ ఉద్యోగాలను కాపాడుకోవాలి

డిసెంబర్ 13న సిఎండి కార్యాలయ ముట్టడి

ఖమ్మం జాగృతి బాటలో కవిత వెల్లడి

**ఖమ్మం,నవంబర్ 17(సమయజ్యోతి):**

డిపెండెంట్ ఉద్యోగాలు కాపాడుకోలేని స్థితిలో ఇప్పుడు ఉన్నామని జాగృతి అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యలు చేశారు. డిసెంబర్ 13న సింగరేణి సీఎండీ కార్యాలయాన్ని ముట్టడి చేయబోతున్నామని ఖమ్మం జిల్లాలో జాగృతి బాటలో కవిత ప్రకటించారు. సింగరేణి ఉద్యోగం ఒక కుటుంబానికి ఇన్సూరెన్స్ లాంటిదని... డిపెండెంట్ ఉద్యోగాల కోసం పోరాటం చేస్తామన్నారు. సోమవారం సత్తుపల్లి జేవీఆర్ ఓసీ సింగరేణిలో కార్మికులతో కవిత మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రెండేళ్లుగా మెడికల్ బోర్డ్ కోసం కోట్లాడుతున్నామన్నారు.

02

# ఐ బొమ్మ రవితో సినీ పరిశ్రమకు తీరని నష్టం



- రవి హార్డ్ డిస్క్‌లో 21వేలకు పైగా సినిమాలు
- బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసేలా పైరసీ
- పైరసీ ద్వారా 20కోట్లు సంపాదించిన రవి
- 3 కోట్లు అకౌంట్‌లో ఫ్రీజ్ చేశామన్న సిపి సజ్జన్నారు
- కమిషనర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన సినీ పెద్దలు

**హైదరాబాద్,నవంబర్17(సమయజ్యోతి):**

పైరసీతో సినీ పరిశ్రమకు భారీ నష్టం కలిగిందని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ అన్నారు. పైరసీని అరికట్టే క్రమంలో ఐ బొమ్మ రవిని అరెస్ట్ చేశామన్నారు. ఐ బొమ్మ రవిపై మూడు పైరసీ కేసులున్నాయని తెలిపారు. రవి.. వెబ్ సైట్ డిజైన్, డెవలపింగ్‌లో ఆరితేరాడని, సీక్రెట్ కెమెరాలతో కొత్త సినిమాలను పైరసీ చేస్తాడని తెలిపారు. దమ్ముంటే పట్టుకోండి అంటూ పోలీసులకు ఛాలెంజ్ చేసిన ఐ బొమ్మ రవి ప్రస్తుతం జైల్లో ఊచలు లెక్కపెడుతున్నాడు. రవి అరెస్ట్‌పై సీపీ సజ్జనార్ సినీ ప్రముఖులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పైరసీపై సంచలన విషయాలు బయటపెట్టారు. ఐ బొమ్మ రవి హార్డ్ డిస్క్ లలో దాదాపు 21 వేలకు పైగా సినిమాలు ఉన్నాయని తెలిపారు. పైరసీ ద్వారా రవి రూ. 20 కోట్లు సంపాదించాడని, అందులో రూ. 3 కోట్లు ఫ్రీజ్ చేశామని చెప్పారు. రవికి ఇంటర్నేషనల్ లింక్స్ ఉన్నాయని, ఈ కేసు ఛేధించేందుకు జాతీయ స్థాయి సంస్థల సహకారం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఐ బొమ్మ రవి దగ్గర 50 లక్షల మంది సమాచారం ఉందని వెల్లడించారు. డేటా కలెక్షన్ కోసం ఐ బొమ్మ రవి మాస్టర్ మైండ్ ఉపయోగించాడని సీపీ వివరించారు.ఒక సైట్‌ను బ్లాక్ చేస్తే.. మరో సైట్‌ను డెవలప్ చేస్తాడని వెల్లడించారు. రవి సైట్ ఓపెన్ చేయగానే బెట్టింగ్ యాప్స్ అట్రాక్ట్ చేస్తాయని, బెట్టింగ్ యాప్స్‌తో జనం వేల కోట్లు నష్టపోయారని వ్యాఖ్యానించారు. కస్టడీకి ఇస్తే ఐ బొమ్మ రవి నుంచి పూర్తి వివరాలు రాబడుతామని, ఆయన నెట్‌వర్క్‌లో ఉన్న మిగతా వారిని కూడా అరెస్ట్ చేస్తామని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. ఇదిలావుంటే సోమవారం హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్‌తో సినీ పెద్దలు భేటీ అయ్యారు. అగ్ర కథానాయకులు చిరంజీవి, నాగార్జునలతో పాటు దర్శకుడు రాజమౌళి, నిర్మాత దిల్‌రాజు, దగ్గుబాటి సురేశ్ ఈ భేటీలో పాల్గొన్నారు.

02

మొదటిపేజీ తరువాయి

# ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ బోసిపోయింది.

## పత్తి కొనుగోళ్లపై ప్రతిష్టంభన

## ఎనుమాముల మార్కెట్‌లో నిలిచిన కొనుగోళ్లు

## సిసిఐ తీరుపై మండిపడ్డ బిఆర్ఎస్ నేతలు

## కేంద్ర,రాష్ట్రాలది మొద్దు నిద్ర అంటూ కెటిఆర్ విమర్శలు

వరంగల్,నవంబర్17(సమయజ్యోతి):

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లపై తీవ్ర గందరగోళం నెలకొంది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీసీఐ తీరుపై రైతులు, జిన్నింగ్ మిల్లర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీసీఐ కొత్త కొర్రీలతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు, వ్యాపారులు తెలిపారు. ఈ క్రమంలో నేటి నుంచి జిన్నింగ్ మిల్లుల బంద్‌కు వ్యాపారులు పిలుపునిచ్చారు. బంద్ పిలుపు నేపథ్యంలో రైతులు పత్తిని మార్కెట్‌కు తీసుకురాని పరిస్థితి. దీంతో ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ బోసిపోయింది. పత్తి కొనుగోళ్లపై ఉమ్మడి వరంగల్ జిల్లా రైతుల్లో ఆందోళన నెలకొంది. తీసిన పత్తిని అమ్ముకోలేక అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. పత్తి రైతుల బాధలపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు స్పందిస్తూ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతుంటే ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు ఏం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రశ్నించారు. మద్దతు ధర రాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులు ఇబ్బందులు పడుతుంటే... మంత్రులు, ఎమ్మెల్యేలు జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో ఉన్నారని ఫైర్ అయ్యారు. రైతుల కు మద్దతు ధర కోసం బీఆర్ఎస్ నిరసనకు దిగుతుందని వెల్లడించారు. కాంగ్రెస్ నేతలు బ్లాక్ మెయిల్ చేసి జూబ్లీహిల్స్ ఎన్నికల్లో గెలుపొందారని.. నీళ్లు బంద్ చేస్తాం, పెన్షన్లు బంద్ పెడతామని బెదిరించారని మరో బీఆర్ఎస్ నేత రాజయ్య ఆరోపించారు. ఈ ప్రభుత్వానికి రైతుల ఉసురు తగులుతుందని వ్యాఖ్యలు చేశారు. పత్తి రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారని అన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు పెన్షన్ రాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దొంగే దొంగా అన్నట్టుగా రేవంత్ పాలన ఉందనిమండిపడ్డారు. పత్తి కొనుగోళ్లపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టించి పత్తిని పండించిన తెలంగాణ రైతన్నలు, నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల మార్కెట్ యార్డుల్లో పడిగాపులు పడుతున్నారని చెప్పారు. కళ్ల ముందే పండించిన పత్తి ఈ చలికాలపు తేమకు పాడవుతోంటే ఆదుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలేమో మొద్దు నిద్ర నటిస్తున్నాయని మండిపడ్డారు. నెల రోజుల్లో 28 లక్షల టన్నుల కొనుగోలు లక్ష్యం కాగా కేవలం 1.12 లక్షల టన్నుల పత్తి కొనుగోలు చేశారంటేనే రాష్ట్రంలో నెలకొన్న పత్తి కొనుగోళ్ల సంక్షోభానికి అద్దం పడుతోందని ధ్వజమెత్తారు. తేమశాతం, కపాస్ మొబైల్ యాప్ రిజిస్ట్రేషన్, మిల్లుల గ్రేడింగ్ అంటూ కుంటి సాకులతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పత్తి కొనుగోలు నిరాకరిస్తుంటే, దానికి జిన్నింగ్ మిల్లుల అవినీతి తోడై రైతన్న నడ్డి విరుస్తున్నాయని చెప్పారు. మద్దతు ధర దొరకక, మధ్య దళారులకు తెగనమ్ముకుని రైతులు నష్టాల పాలవుతున్నారని తెలిపారు. రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు, కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు వెంటనే పత్తి కొనుగోలుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు

మొదటిపేజీ తరువాయి

# బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఉరిశిక్ష

## అల్లర్లలో కాల్పులకు ఆదేశించారన్న అభియోగం

## ఢాకా ట్రైబ్యునల్ కోర్టు సంచలన తీర్పు

ఢాకా,నవంబర్ 17(సమయజ్యోతి):

ఢాకా అల్లర్లకు కారణమంటూ బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు అక్కడి కోరటు ఉరిశిక్ష విధించింది. దశాబ్దాల పాటు ఆ దేశ రాజకీయ చరిత్రను తానై నడిపించిన ఆమెను 'ఉక్కు మహిళ'గా వ్యవహరిస్తుంటారు. కానీ, తన హయాంలో ఏర్పడ్డ ట్రైబ్యునలే.. ఇప్పుడు ఆమెకు మరణశిక్ష విధించింది. ఇటీవలి అల్లర్ల తరవాత ఆమె భారత్‌లో ఆశ్రయం పొంది ప్రవాస జీవితం గడుపుతున్నారు. ఆమె ప్రభుత్వం అసమ్మతిని అణచివేసిందని, మీడియాపై ఆంక్షలు విధించిందని, ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేసిందని, భద్రతా శక్తుల అధికారాలను పెంచిందనే ఆరోపణలు వచ్చాయి. 2024లో స్వాతంత్ర్య పోరాట వీరుల పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో కోటాకు వ్యతిరేకంగా మొదలైన విద్యార్థి నిరసనలు చివరికి దేశవ్యాప్త తిరుగుబాటుగా మారాయి. ఈ నిరసనలే హసీనా పాలనను అంతం చేశాయి. ఆమె ప్రభుత్వం చేపట్టిన భద్రతా చర్యల వల్ల హింస పెరిగింది. ఇది జులై తిరుగుబాటుగా మారింది. ఈ అల్లర్లలో 1,400 మంది వరకు మరణించారని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కార్యాలయం నివేదించింది. ఆందోళనల కారణంగా హసీనా అధికారం నుంచి వైదొలగి భారత్‌లో ఆశ్రయం పొందాల్సి వచ్చింది. అనంతరం బంగ్లాలో మహ్మద్ యూనస్ నేతృత్వంలో ఏర్పడ్డ మధ్యంతర ప్రభుత్వం 'అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్'ను పునరుద్ధరించింది. యుద్ధ నేరాలకు పాల్పడిన వారిని విచారించేందుకు ఆమే ఒకప్పుడు దీన్ని ఏర్పాటు చేసింది. ఇప్పుడు అదే ట్రైబ్యునల్ 2024 నాటి అల్లర్ల విషయంలో హసీనాపై మానవత్వానికి వ్యతిరేకంగా చేసిన నేరాల ఆరోపణలు మోపింది. నెలల తరబడి విచారణ జరిపి సోమవారం మరణశిక్ష విధించింది. తన ఎదుగుదలకు తోడ్పడిన దేశమే ఇప్పుడు తన పతనాన్ని శాసించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు హసీనా. భారత ఆశ్రయంలో ఉంటూ సరిహద్దు ఆవల ఉన్న బంగ్లాదేశ్ భవిష్యత్తుపై మథనపడుతున్నారు. తనకు విధించిన మరణ శిక్షను ఖండించారు. తీర్పు మోసపూరితమన్నారు. అక్కడి ప్రభుత్వమే కుట్రపూరితంగా తనకు శిక్ష పడేలా చేసిందని ఆవేదన చెందారు. తనను తాను నిరూపించుకోవడానికి కోర్టు అవకాశం ఇవ్వలేదని వాపోయారు. నాటి తూర్పు పాకిస్థాన్‌లోని తుంగిపారాలో 1947 సెప్టెంబరు 28న షేక్ హసీనా జన్మించారు. తండ్రి షేక్ ముజిబుర్ రెహమాన్ ఆ దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలకంగా వ్యవహరించి జాతిపితగా నిలిచిపోయారు. ఢాకా విశ్వవిద్యాలయం నుంచి బెంగాలీ సాహిత్యంలో హసీనా మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. ఆ సమయంలోనే విద్యార్థి రాజకీయాల్లో చురుగ్గా పాల్గొన్నారు. 1968లో అణు శాస్త్రవేత్త ఎం.ఎ.వాజెద్ మియాను వివాహం చేసుకున్నారు. రాజకీయాలకు భిన్నంగా ఆయన విద్యావేత్తగా నిరాడంబర జీవితం గడిపారు. 2009లో ఆయన మరణించే



వరకు ఆమెకు తోడుగా ఉన్నారు. వారికి సజీబ్ వాజెద్ జాయ్ అనే కొడుకు, సైమా వాజెద్ పుతుల్ అనే కూతురు ఉన్నారు. 1975 ఆగస్టులో జరిగిన సైనిక తిరుగుబాటు హసీనా జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. ఆ ఘర్షణల్లో ఆమె తండ్రి, తల్లి, ముగ్గురు సోదరులు ఇంకా కుటుంబ సభ్యులు హత్యకు గురయ్యారు. ఆ సమయంలో విదేశాల్లో ఉండటం వల్ల హసీనా, ఆమె చిన్న చెల్లెలు రెహానా మాత్రమే బతికి బయటపడ్డారు. నాటి భారత ప్రధాని ఇందిరా గాంధీ ఆమెకు ఆశ్రయం ఇచ్చారు. ఆరు సంవత్సరాల తర్వాత 1981 మేలో బంగ్లాదేశ్‌కు హసీనా తిరిగొచ్చారు. దేశానికి రాకముందే ఆమెను అవామీ లీగ్ పార్టీ తమ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకుంది. దేశానికి తిరిగి వచ్చే సరికే హసీనా ప్రధాన ప్రత్యర్థి ఖలీదా జియా ఆమె కోసం వేచి చూస్తున్నారు. హత్యకు గురైన అధ్యక్షుడు జియావుర్ రెహమాన్ భార్యే ఈ ఖలీదా. వీరిద్దరే తమదైన సిద్ధాంతాలు, పోరాటాలతో మూడు దశాబ్దాల పాటు బంగ్లాదేశ్ రాజకీయ చరిత్రను రచించారు. హసీనా మొదటిసారి 1996లో ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. 2001లో అధికారం కోల్పోయారు. 2008లో భారీ విజయం సాధించి సుదీర్ఘ పాలన మొదలుపెట్టారు. 2014, 2018 ఎన్నికల్లోనూ అవామీ లీగ్ పార్టీయే గెలిచింది. దీంతో ప్రపంచంలోనే ఎక్కువ కాలం పాలించిన మహిళా నేతల్లో ఒకరిగా చరిత్ర సృష్టించారు. ఆమె పాలనలో బంగ్లాదేశ్ చాలా వేగంగా ఆర్థిక వృద్ధిని సాధించింది. పద్మా వంతెన వంటి ముఖ్యమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు పూర్తయ్యాయి. పేదరిక నిర్మూలనలో దేశం పురోగమించింది. బంగ్లాదేశ్ ప్రపంచ వస్త్ర పరిశ్రమకు కేంద్రంగా మారింది. ఈ ప్రశంసలతో పాటే విమర్శలు కూడా ఎదుర్కొన్నారు.

# బిజెపి గెలిస్తే ఇవిఎంల ట్యాంపర్

మరి జూబ్లీహిల్స్ ఎన్నికలో ఈవీఎం మేనేజ్ చేశారా?, దొంగ ఓట్లు నమోదు చేయించారా?. తెలంగాణలో, కర్ణాటకలో కూడా మీరే గెలిచారు, మరి అక్కడ కూడా అలానే చేశారా?. మీరు గెలిస్తే ఒక న్యాయం.. మేము గెలిస్తే ఓట్ చోరీ అని అంటారా?. ఏం చేస్తావో ప్రజలకు చెప్పి ఓట్లు అడగాలి, ఇలాంటి ఆరోపణలు కాదు. బరిగీసి కొట్లాడే తత్వం లేనప్పుడు పార్టీ ముందుకు పోయే అవకాశం లేదు. అధికార పార్టీ హంగుల వల్ల ఉపఎన్నికల్లో గెలుస్తుంది. పార్టీ అంటే నాయకులు అందరూ బాధ్యత తీసుకుంటారు. కిషన్ రెడ్డి గారినో, ఇంకొకరినో బాధ్యులు చెయ్యలేం. జూబ్లీహిల్స్ లో ఎమ్మెల్యే చనిపోయిన వెంటనే బీజేపీ తిరిగి ఉంటే ఫలితం వేరుగా ఉండేదన్నారు. వేలాది మంది బీజేపీ కారకర్తలు, వందల మంది నాయకుల భవిష్యత్తు కోసం మాట్లాడుతున్నా.. సీఎం, మంత్రులు, కొంతమంది అవగాహన లేని నాయకులు మాట్లాడుతున్న మాటలు వింటున్నా అని ఎంపీ ఈటల చెప్పారు. జూబ్లీహిల్స్ ఎన్నిక ఫలితంపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. బీజేపీ కార్యకర్తల్లారా.. జూబ్లీహిల్స్ ఎన్నిక ఓడిపోగానే కుంగిపోవద్దని, భవిష్యత్తు మనదే అని అన్నారు. తెలంగాణలో డివిజన్ పాలిటిక్స్‌తో అధికారం లోకి రాలేమని.. కులం, మతం పునాది మీద రాజకీయాలు శాశ్వతంగా నడవవన్నారు. 'నారాయణఖేడ్, పాలేరు హుజూర్నగర్, నాగార్జున సాగర్, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ అన్నిటిలో అధికార పార్టీ గెలిచింది. కేసీఆర్ అహంకారం అణచడానికి దుబ్బాకలో బీజేపీని గెలిపించారు. అన్యాయానికి న్యాయానికి.. ఆత్మగౌరవానికి అహంకారానికి.. ధర్మానికి అధర్మానికి జరిగిన హుజురాబాద్ ఎన్నికల్లో ధర్మం గెలిచింది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరూ ఆ ఎన్నిక కోసం ఎదురుచూశారు. స్వయంగా కేసీఆర్ వచ్చి దళితబంధు ప్రకటించినా గెలవలేకపోయారు. తెలంగాణ వచ్చిన తరువాత 9 ఉప ఎన్నికలు జరిగితే.. 7 సార్లు అధికార పార్టీనే గెలిచింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన రెండు ఎన్నికల్లో గెలిచింది. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో అధికార పార్టీ అనేక ప్రలోభాలు పెట్టి మరీ గెలిచారు. కేసీఆర్ ఎన్ని చేశారో వీరు కూడా అవే చేశారు. కాంగ్రెస్ పార్టీకి హుజురాబాద్ లో వచ్చిన ఓట్లు 3016. దుబ్బాకలో, మునుగోడు డిపాజిట్ కోల్పోయింది. మరి డిపాజిటు కోల్పోయిన పార్టీ మొన్న ఎలా అధికారంలోకి వచ్చింది. ఒక్క బై ఎలక్షన్ ఓడిపోగానే బీజేపీ పని అయిపోతుందా?. రాజకీయ పరిజ్ఞానం ఉన్న వారు ఎవరూ అలా మాట్లాడరు' అని ఎంపీ ఈటల అన్నారు. 'బీహార్ ఎన్నికలు ఒక ప్రభంజనం. ఒళ్ళు వంచి పని చేస్తే విజయం మనదే. కార్యకర్తలు, నాయకులు సోషల్ మీడియాలో వచ్చే పోస్టులు చూసి బాధపడకండి. భవిష్యత్తు మనదే. జూబ్లీహిల్స్ ఎన్నిక ఫలితం అందరం బాధ్యత తీసుకుంటున్నాం.ప్రజలకు సేవ చేయడం వల్లనే దేశ వ్యాప్తంగా బీజేపీకి ప్రజలు ఓట్లు వేస్తున్నారు.ఒకాయన అధికారం పోతుందని, ఇంకొకరు సానుభూతితో పోటీ పడ్డారు. నా వ్యక్తిగత అభిప్రాయం.. తెలంగాణలో డివిజన్ పాలిటిక్స్ తో అధికారంలోకి రాలేము. బీహార్లో మాకు ఇన్ని సీట్లు వచ్చాయి అంటే అందరి మద్దతు ఉంది. ట్రిపుల్ తలాక్ లాంటివి పని చేసాయి. మా సర్ సంగ్ చాలక్ ఒక గొప్ప మాట చెప్పారు.. ఒక జాతిని విస్మరించి దేశాన్ని నిర్మాణం చేయలేమని చెప్పారు. మోడీ గారు ప్రధాని కాగానే ఒక మెసేజ్ ఇచ్చారు. ప్రజలకు ఇప్పటి వరకు ఏం చేసావు, ఇక ముందు ఏం చేస్తావు అని చెప్పి ప్రజలను ఓట్లు అడగాలి' అని ఎంపీ ఈటల చెప్పారు.

మొదటిపేజీ తరువాయి

# ఐ బొమ్మ రవితో సినీ పరిశ్రమకు తీరని నష్టం

ఇటీవల పైరసీ వెబ్‌సైట్ ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవిని హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సినీపెద్దలు సజ్జనార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సజ్జనార్ మీడియాతో మాట్లాడారు. పైరసీతో సినీ రంగానికి చాలా నష్టం జరిగిందని తెలిపారు. దీన్ని కట్టడి చేయడంలో భాగంగా ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవిని అరెస్టు చేసినట్లు తెలిపారు. అతడిపై ఐటీ యాక్ట్, కాపీ రైట్ యాక్ట్ కింద మరో 4 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. పైరసీకి సంబంధించి అంతకు ముందు ప్రశాంత్, శివరాజ్‌ను కూడా అరెస్టు చేశాం. ఇమ్మడి రవి సమాజానికి చాలా నష్టం చేకూర్చాడు. పైరసీ ద్వారా నష్టం చేయడమే కాకుండా బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్నాడు. దీంతో చాలా మంది చనిపోయారు. ఒక వెబ్‌సైట్‌ను బ్లాక్ చేస్తే కొత్త సైట్‌ను తయారు చేశాడు. ఇలా65 మిర్రర్ వెబ్‌సైట్లు నిర్వహించాడు. 21 వేల సినిమాలు అతడి హార్డ్ డిస్క్‌లో ఉన్నాయి. 1972లో విడుదలైన గాడ్‌ఫాదర్ నుంచి మొన్న వచ్చిన ఓజీ వరకు అందులో ఉన్నాయి. రూ.20 కోట్లు పైరసీ ద్వారా సంపాదించాడు. అందులో రూ.3 కోట్లు సీజ్ చేశాం. 50 లక్షల మంది సబ్‌స్క్రైబర్ల డేటా రవి వద్ద ఉంది. ఇంత డేటా అతడి వద్ద ఉండటం ప్రమాదకరం. దీన్ని సైబర్ నేరగాళ్లు వాడుకునే అవకాశం ఉందని సజ్జనార్ వెల్లడించారు.

మొదటిపేజీ తరువాయి

# మరో ఘోర విషాదం

హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తెలిపిన వివరాల ప్రకారం 54 మంది యాత్రికుల బృందం నవంబర్ 9 న హైదరాబాద్ నుంచి జెడ్డాకు బయలు దేరింది. నవంబర్ 23 వరకు టూర్‌ను ప్లాన్ చేశారు. వారిలో నలుగురు ముందుగానే కారులో మదీనాకు వెళ్లగా, మరో నలుగురు మక్కాలోనే నిలిచిపోయారు. మిగిలిన 46 మంది బస్సులో ప్రయాణం కొనసాగించారు. మదీనా నుండి సుమారు 25 కిలోమీటర్ల దూరంలో బస్సు చమురు ట్యాంకర్‌ను ఢీకొట్టడంతో ఒక్కసారిగా అగ్నిప్రమాదం చెలరేగిందని తెలిపారు. డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనగానే మంటలు చెలరేగి బస్సు మొత్తం వ్యాపించాయి. ప్రమాద సమయంలో యాత్రికులంతా నిద్రలో ఉండటంతో మృతుల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ప్రమాదంలో అబ్దుల్ షోయబ్ అనే యాత్రికుడు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డాడు. అతను ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మరణించిన వారిలో మల్లేపల్లి, బజార్‌ఘాట్, ఆసిఫ్‌నగర్ ప్రాంతాల వారూ ఉన్నట్లు తెలుస్తోంది. భారత కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 1.30 గంటల సమయంలో ఈ ఘోర ప్రమాదం జరిగింది. యాత్రికులంతా నిద్రలో ఉండడం వల్ల మరణాలు అధికంగా నమోద య్యాయని అధికారులు భావిస్తున్నారు. ప్రమాద స్థలంలో రక్షణ చర్యలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో సౌదీ అరేబియాలోని జెడ్డా భారత దౌత్య కార్యాలయం ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. 24 ఏళ్ల మొహమ్మద్ అబ్దుల్ షోయబ్ డ్రైవర్ పక్కన కూర్చోవడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. షోయబ్ హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి. గాయాల పాలైన షోయబ్‌ను హాస్పిటల్‌లో చేర్చారు. అయితే అతడి ఆరోగ్య పరిస్థితిపై పూర్తి సమాచారం బయటకు రాలేదు . ప్రమాదంలో షోయబ్ కుటుంబ సభ్యులందరూ చనిపోయినట్టు తెలుస్తోంది.

మొదటిపేజీ తరువాయి

# డిసెంబర్ 1 నుంచి 9 వరకు ప్రజాపాలన వారోత్సవాలు

## డిసెంబర్ రెండోవారంలో స్థానిక ఎన్నికలు

## ప్రజాపాలన వారోత్సవాల అనంతరం నోటిఫికేషన్

## కేబినేట్‌లో మంత్రులతో చర్చించిన సిఎం రేవంత్

## ప్రజాపాలన వారోత్సవాల్లో గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రచారం

హైదరాబాద్,నవంబర్17(సమయజ్యోతి):

స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజాపాలన వారోత్సవాల తర్వాత ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. డిసెంబర్ 1 నుంచి 9 వరకు ప్రజాపాలన వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఆ తర్వాత ఎప్పుడైనా ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. మరోవైపు సౌదీ అరేబియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని కేబినెట్ నిర్ణయించింది. మంత్రి అజారుద్దీన్, ఎంఐఎం ఎమ్మెల్యే, మైనార్టీ విభాగానికి చెందిన ఓ అధికారితో కూడిన ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని వెంటనే సౌదీకి పంపించాలని సూచించింది. చనిపోయిన వారి మృతదేహాలకు మత సంప్రదాయం ప్రకారం.. అక్కడే అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించింది. బిసి రిజర్వేషన్ల వ్యవహారంతో ఆగిపోయిన స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. డిసెంబర్ రెండో వారంలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ఉంటుందని పేర్కొంది. ప్రజాపాలన వారోత్సవాల తర్వాతే లోకల్ బాడీ ఎలక్షన్స్ ఉంటాయని మంత్రివర్గ భేటీ స్పష్టం చేసింది. డిసెంబర్ 1 నుంచి 9 వరకు తెలంగాణ ప్రజాపాలన వారోత్సవాలు జరగనున్నాయి. వారోత్సవాల సమయంలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేబినెట్ నిర్ణయించింది. స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా సర్పంచ్ సహా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే ముందుగా సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సర్పంచ్ ఎన్నికల తరవాతే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించాలని మంత్రివర్గ భేటీలో చర్చించినట్లు సమాచారం. జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితంనే లోకల్ బాడీ ఎలక్షన్‌లలో పునరావృతం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోంది. ఇక తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల పదవీకాలం ముగిసి 20 నెలలు పూర్తయ్యాయి. ఇటీవల బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం తీవ్ర వివాదాస్పదమైంది. దీనిపై హైకోర్టు, సుప్రీం కోర్టు వ్యతిరేకంగా తీర్పు నిచ్చాయి. రిజర్వేషన్లు 50శాతం దాటరాదన్న నిబంధనలను పాటించాలని సూచించాయి. మొత్తానికి డిసెంబర్‌లో ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల కానుంది. సిఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం నాడు రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అనేక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై చర్చించినట్లు సమాచారం.ఇప్పటికే ఎన్నికల నిర్వహణ ఆలస్యమైన నేపథ్యంలో ఇక ఆలస్యం చేయొద్దని.. వీలైనంత తర్వగా లోకల్ బాడీ ఎలక్షన్స్ నిర్వహించాలని నిర్ణయించింది మంత్రివర్గం. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు అవుతున్న నేపథ్యంలో తమ ప్రభుత్వం ప్రజల కోసం ఏం చేసిందనే విషయాన్ని ప్రజాపాలన వారోత్సవాల్లో వివరించాలని మంత్రివర్గం తీర్మానించింది. గ్రామ స్థాయిలో ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రచారం చేసి.. లోక్‌బాడీ ఎన్నికల్లో జయకేతనం ఎగురవేయాలని నిర్ణయించింది. ప్రజాపాలన వారోత్సవాలతో గ్రామ స్థాయి కేడర్‌లో మరింత ఉత్సాహం నింపి స్థానిక ఎన్నికల్లో విజయ ఢంకా మోగించాలని భావిస్తున్నారు.

# సింగరేణి ఉద్యోగుల కోసం పోరాటం



సింగరేణి గని కార్మికులకు ఇన్‌కమ్ ట్యాక్స్ కట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని.. 'మీకోసం పోరాటం చేసే మాకు అండగా ఉండాలి అని కోరుతున్నాం' అని కవిత అన్నారు. కొత్త బొగ్గు బ్లాక్‌లు సింగరేణికి అందించాలని డిమాండ్ చేశారు. కేంద్రం బొగ్గు బ్లాక్‌లను ప్రైవేట్ వ్యక్తులకు వేలం వేయడాన్ని ఒప్పుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం సింగరేణికి అక్షరాలా రూ.40 వేల కోట్ల అప్పు ఉందని తెలిపారు. సింగరేణి కార్మికుల కోసం మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం చేయాలని కోరుతున్నామన్నారు. ఆసుపత్రి నిర్మాణం చేసే లోపు కార్పోరేట్ హాస్పిటల్స్‌లో వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులు పెర్మినెంట్ అయ్యేలా ప్రయత్నం చేస్తామని తెలిపారు. బొగ్గు బావిలోకి దిగే ముందు మైసమ్మకు మొక్కుకుని జాగ్రత్తగా ఉండాలని కవిత సూచించారు.

# తేమ శాతాన్ని పరిశీలించిన ఏఓ

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ మండల కేంద్రంలోని సహకార ధాన్యం కొనుగోలు కేంద్రంలో సోమవారము ఏవో లావణ్య,సీఈవో వేణు ఏఈఓ రేష్మ, ఇన్చార్జి మహేందర్, తో కలిసి వరి ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు.



# నూతన వధూవరులను ఆశీర్వదించిన పాత్రికేయులు

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ మండల ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి కుమార్తె వివాహానికి పాత్రికేయులు హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు.





# కోలా సహశ్రితకు నివాళులు

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి హైదరాబాద్

బజార్ హత్నూర్ సమయ జ్యోతి విలేకరి కుమార్తె కోలా సహశ్రిత అనారోగ్యంతో మృతి చెందగా సోమవారము సమయ జ్యోతి విలేకరులు, సిబ్బంది అశ్రు నివాళులు అర్పించి, సంతాపాన్ని తెలిపారు.

# ప్రజావాణి అర్జీలు సకాలంలో పరిష్కరించాలి

## ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

ప్రజావాణికి వచ్చే అర్జీలు సకాలంలో పరిష్కరించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుంచి ఇంచార్జి కలెక్టర్ సోమవారం149 దరఖాస్తులు స్వీకరించారు. రెవెన్యూ 43, హౌసింగ్ శాఖకు 35, డీఆర్డీఏకు 12, ఎస్డీసీకి 11, విద్య శాఖ, సంక్షేమ అధికారికి 7చొప్పున, మున్సిపల్ కమిషనర్ సిరిసిల్ల, జిల్లా వైద్యాధికారి, ఉపాధి కల్పన కార్యాలయం, జిల్లా పంచాయతీ అధికారి, నీటి పారుదల శాఖకు నాలుగు చొప్పున, జిల్లా వ్యవసాయ అధికారి కి 3, లీడ్ బ్యాంక్ మేనేజర్, సెస్ కార్యాలయానికి రెండు చొప్పున, డీసీఎస్ఓ, మైనింగ్ శాఖ, మైనార్టీ సంక్షేమ అధికారి, ఈఈ పీఆర్, ఆర్ టీ సీ సిరిసిల్ల, ఎంపీడీఓ కోనరావుపేట, ఎస్పీ కార్యాలయానికి ఒకటి చొప్పున వచ్చాయి. అన్ని దరఖాస్తులు ఆన్లైన్లో పూర్తిగా పరిష్కరించాలని పెండింగ్ పెట్టవద్దని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు బాధ్యులు తప్పనిసరిగా ప్రజావాణికి హాజరుకావాలని స్పష్టం చేశారు. నూతన వైద్యశాలలు, అంగన్వాడిలు, పాఠశాలల భవనాలకు మిషన్ భగీరథ నీటి, విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని, ఆధార్ కార్డ్ తీసుకునేందుకు ఇబ్బంది పడుతున్న విద్యాలయాల విద్యార్థులకు త్వరితగతిన బర్త్ సర్టిఫికెట్ జారీ చేయాలని రెవెన్యూ, మున్సిపల్ అధికారులను ఆదేశించారు.



కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, డీఆర్డీఓ శేషాద్రి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత పాల్గొన్నారు.

# ప్రజావాణికి 101 ఫిర్యాదులు

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి నిజామాబాద్, నవంబర్ 17 :

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 101 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, జిల్లా పరిషత్ సీఈఓ సాయాగౌడ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ సందీప్, డీపీఓ శ్రీనివాస్, హౌసింగ్ పీ.డీ పవన్ కుమార్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కాగా, మహిళా, శిశు, వయో వృద్ధుల, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రూపొందించిన గోడ ప్రతులను ఈ సందర్భంగా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి రసూల్ బీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఆటో మొబైల్ స్టోర్ ను ప్రారంభించిన సీఐ శ్రీధర్

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ మండల కేంద్రం లోని వన్నెల్ బి చౌరస్తాలో సోమవారము కాంగ్రెస్ నాయకులు షేక్ షేరు ఆటో మొబైల్ స్టోర్ ను ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఐ శ్రీధర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ ఫయాజ్ అలీ, సయ్యద్ రియాజ్ అలీ, సయ్యద్ రియాజుద్దీన్, మొహమ్మద్ యునుస్, కుందరపు శీను, కాసిం, పెసరి వివేక్ విక్కీ, పాల్గొన్నారు.



# తల్లిదండ్రులు, వృద్ధాప్య సిటిజన్లు న్యాయ సాయం కోసం సంప్రదించాలి

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం మండేపల్లి గ్రామంలోని వృద్ధాశ్రమంలో సోమవారము న్యాయ సేవాధికర సంస్థ అధ్యక్షురాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.పుష్పలత సీనియర్ సివిల్ జడ్జి/కార్యదర్శి, డిఎల్ఎస్ఏ పి.లక్ష్మణాచారి సమన్వయంతో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ టి.పర్శరాములు ఆధ్వర్యంలో తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల నిర్వహణ, సంక్షేమ చట్టం, 2007 పైన అవగాహన సదస్సు నిర్వహించారు. దేశంలోని తల్లిదండ్రులు, వృద్ధాప్య సిటిజన్ల హక్కులను రక్షించడానికి ఈ చట్టం రూపొందించబడిందని అన్నారు. సమస్యలు ఉన్నవారు తమను సంప్రదించాలని వారికి ఉచిత న్యాయమైన అందజేస్తామని పేర్కొన్నారు. వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు, బిస్కెట్లు అందజేశారు. ఈ సదస్సులో లోక్ అదాలత్ సభ్యులు/న్యాయవాదులు ఆడెపు వేణు, గుర్రం ఆంజనేయులు, వృద్ధాశ్రమ కో ఆర్డినేటర్ మమత, సిబ్బంది పాల్గొన్నారు.




# పురస్కారాలు అందుకున్న చిన్నారి నాట్య మయూరీలు

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

శివమ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాదు రవీంద్ర భారతిలో సోమవారము జరిగిన నాట్య మయూరి నృత్య కళా ప్రదర్శన నాట్య గురువు గుజరాతీ స్వాతి విద్యార్థులు నిజామాబాద్, బాల్కొండ, ముప్కాల్ నాట్య ప్రదర్శనలో పాల్గొని చిన్నారులు బి.సాత్విక, జె.సహస్ర, పి. నిత్య శ్రీ ఆకట్టుకోగా, వారికి నిర్వాహకులు, ఎంపీ కృష్ణయ్య చేతుల మీదుగా అవార్డులు అందజేశారు.







# పద్మశాలి కులస్తులను ప్రభుత్వాలు గుర్తించాలి

## బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అదెల్లి రవీందర్

సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం

ప్రభుత్వాలు రాజకీయ పార్టీలు పద్మశాలి కులస్తులను గుర్తించాల్సిన అవసరం ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అదెల్లి రవీందర్ డిమాండ్ చేశారు బీరంగూడ పద్మశాలి భవన్ లో కార్తీకవన భోజనాల కార్యక్రమం మండల అధ్యక్షులు యాదగిరి పట్టణ అధ్యక్షులు దుర్గయ్య ఆధ్వర్యంలో జరిగింది ఇట్టి కార్యక్రమం లో ముఖ్య అతిథిగా హాజరై రవీందర్ ప్రసంగించారు ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పద్మశాలి కులస్తులను రాజకీయంగా ఎదగకుండా రాజకీయ పార్టీలు అవకాశం ఇవ్వడంలేదని టైగర్ నరేంద్ర మరణం తర్వాత రాజకీయాల్లో పద్మశాలి కులస్తుల ప్రాధాన్యత తగ్గించారాని ఆవేదన వ్యక్తం చేశారు పద్మశాలి కుల బంధువులు ఒక్కటై రాజ్యధికారం సాధించుకుంటే తప్ప గుర్తింపు రాదని కావున పద్మశాలి కులస్తులు రాజకీయంగా ఎదిగేందుకు కృషి చేయాలనీ తెలిపారు మండల



అధ్యక్షులు యాగగిరి మాట్లాడుతూ భవన నిర్మాణం మరియు పద్మశాలి సమాజం అభివృద్ధి కోసం పద్మశాలి సంఘము పనిచేస్తుందని తెలిపారు ఈ కార్యక్రమంలో మండల పద్మశాలి మరియు పట్టణ పద్మశాలి సంఘము నాయకులు మండల అధ్యక్షులు యాదగిరి చెన్న మోహన్ పట్టణ అధ్యక్షులు దుర్గయ్య మహందర్ లింగయ్య ఎల్లప్ప వేముల మల్లేష్ సురేష్ జనార్దన్ అలె వెంకట్ జోగినాథ్ గంగాధర్ యువజన నాయకులు రాజేష్ మహిళా నాయకులు పెద్ద సంఖ్యలో పద్మశాలి కులస్తులు పాల్గొన్నారు

## సంపాదకీయం

# గెలుపుతో సమస్యలు విస్మరించరాదు !

తెలంగాణలో కేవలం కెసిఆర్, కెటిఆర్ అహంకారం వల్లనే ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేసారు. అదికూడా బండి సంజయ్‌ను బిజెపి అధ్యక్షుడిగా తొలగించడంతో బిజెపి వైపు ఉన్న సానుకూల పవనాలు రేవంత్ వైపు చూపించారు. ఇది రెండేళ్ల క్రితం నాటి ఎన్నికల ముందు పరిస్థితి. ఇందులో ఎలాంటి అనుమానాలకు తావు లేదు. ఎందుకంటే బండిని తొలగిచగానే బిజెపి, బిఆర్ఎస్ కుమ్మక్కయ్యయాని క్షేత్రస్థాయిలో కూడా ప్రజలు చర్చించుకుని ముక్కున వేలేసుకున్నారు. అందుకే అటు బిజెపిని, ఇటు బిఆర్ఎస్‌ను దెబ్బకొట్టి కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారు. రెండేళ్లు కావస్తోంది. ఈ రెండేళ్లలో రెండు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. మొన్నటి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కూడా ప్రజలు రేవంత్‌ను నమ్మి గెలిపించారు. ఇది కూడా కేవలం రేవంత్ వ్యూహం వల్లనే అని చెప్పక తప్పదు. అయితే అన్నింటికిమించి ఆరు గ్యారెంటీ లను ప్రస్తావిస్తూ..అన్ని హామీలను నెరవేర్చామని కాంగ్రెస్ పదేపదే ప్రకటిస్తోంది. క్షేత్రస్థాయిలో ఉన్న అనేక సమస్యలను అసలు పరిష్కారం దిశగా చూడడం లేదు. ధరణి పోయి భూమాత వచ్చినా సమస్యలు అలాగే ఉన్నాయి. అనేక భూ సమస్యలు పరిష్కారం కావడం లేదని వార్తలు ప్రచురితం అవుతున్నా పట్టించు కోవడం లేదు. దేవాదాయ శాఖ భూములు వేలాది ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయి. వాటి గురించి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకే తెలియదు. అసలు దేవాదాయ శాఖలో ఏం జరుగుతుందో ఆమె తెలుసుకునే ప్రయత్నం కూడా చేయడం లేదు. అటవీ భూములు పరిస్థితి అలాగే ఉంది. రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లు దెబ్బతిన్నాయి. హైదరాబాద్‌లో రోడ్ల అధ్వానంనం గురించి మంత్రి కోమటిరెడ్డికి కూడా పట్టింపు లేదు. అంతెందుకు వరంగల్ హైవేలో రోడ్డను బాగు చేద్దామన్న సోయి లేదు. లంచం ఇవ్వనిదే ఉద్యోగులు ఏ పనీ చేయడం లేదు. ఉద్యోగులను గట్టిగా అదిలించ లేకపోతున్నారు. ఒకరిద్దరు ఎసిబికి చిక్కుతున్నా అది ప్రభావం చూపడం లేదు. గ్రామాల్లో తెల్లరేషన్ కార్డు విధానం తీవ్రంగా దుర్వినియోగం అవుతోంది. రేషన్ బియ్యం కొత్త వ్యాపార దందాకు తెరతీసింది. దీనిపై పౌరసరఫరాలశాఖ మంత్రికే తెలియడం లేదు. ఏం జరుగుతుందో తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. ఇవి మచ్చుకు తీసుకుని చర్చిస్తున్న అంశాలు మాత్రమే. ఫీజు రియంబర్స్‌మెంట్ దోపిడీ, ఆరోగ్యశ్రీ దోపిడీలు చెప్పాల్సిన పనిలేదు. ఇవన్నీ కూడా సిఎంగా రేవంత్ రెడ్డిపైనే ప్రభావం చూపుతాయి. మంచి జరిగితే ఎలాగైతే పేరు వస్తుందో చెడు జరిగినా సిఎంగా రేవంత్‌పైనే ప్రభావం చూపుతాయి. ఎంతసేపు ఉప ఎన్నికల్లో గెలిచమనో, బిసి రిజర్వేషన్లను అమలు చేశామనో లేఓ అమలు చేయబోతున్నామనో చెబితే సమస్యలను పరిష్కరించి నట్లు కాదు. చిన్న సమస్యను కూడా సీరియస్‌గా తీసుకని పరిష్కరించాలి. ఇల్లు అలకగానే పండగ కాదన్నట్లు ఒక ఉప ఎన్నికను సర్వశక్తులూ ఒడ్డి గెలిచనంత మాత్రాన అంతా అనుకూలంగా ఉందని భావిస్తే భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతానికి రేవంత్‌రెడ్డి పైచేయి సాధించారు. అందులో అనుమానం లేదు. అలాగని ప్రజాభిమానాన్ని చూరగొనడానికి ఆయన ఇంకా ప్రయత్నించాలి. ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వసనీయత పెంచేలా ఆయన వెంటనే చర్యలు తీసుకోవాలి. పార్టీలో క్రమశిక్షణ నెలకొల్పడంతో పాటు, మంత్రులను పనిచేసేలా అదిలించాలి. రెండేళ్ల వార్షికోత్సవం జరుపుకోవడానికి ముందు ఈ రెండేళ్ల పాలనలో మంచి చెడులను సమీక్షించుకోవాలి. మధ్య తరగతి, ఆపై వర్గాల ప్రజల్లో ప్రభుత్వం పట్ల వ్యతిరేకత ఉంది. హైదరాబాద్ నగర్ సమస్యలపై దృష్టి పెట్టడం ద్వారా ప్రజల మనసు గెలుచుకోవాలి. ఉప ఎన్నిక అంటే పార్టీ యంత్రాంగం అంతా మోహరిస్తుంది. సాధారణ ఎన్నికల్లో అలా చేయడం సాధ్యం కాదు. వనరులు కూడా అంతంత మాత్రంగానే ఉంటాయి. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రభుత్వంపై కొంత వ్యతిరేకత వస్తోంది. సాధారణ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల వ్యవధి ఉన్నందున ఈ పరిస్థితిని అధిగ మించడానికి అవకాశం ఉంది. హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్ గెలవడంతో ఇక అంతా మంచి చేశామని, ప్రజలు తమవెంటే ఉన్నారని, కెసిఆర్ పని అయిపోయిందని అంటే ప్రజలు సహించరు. ముఖ్యమంత్రిగా రాష్ట్రంలోని మిగతా నియోజకవర్గాల ప్రజల మనోగతం తెలుసుకోవాలి. ప్రజల్లో ఏయే అంశాలపై అసంతృప్తి ఉందో తెలుసుకునే ప్రయత్నం చేయాలి. ఇప్పుడు పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ తన స్థానం పటిష్ఠం అయినందున ప్రజలకు సంబంధించిన సామాన్య సమస్యలపై దృష్టి సారించాలి. అయితే కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద రేవంత్‌రెడ్డి పరపతి పడిపోతోందని ప్రచారం చేసిన వారికి జూబ్లీఅహిల్ విజయంతో సమాధానం చెప్పారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందన్న ప్రచారం గత కొంత కాలంగా జోరుగా జరుగుతోంది. ఈ పరిస్థితులలో ఈ విజయం కాంగ్రెస్ పార్టీకి లాభించడం ఎలా ఉన్నా రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠ పెరగడానికి మాత్రం దోహదం చేసిందనే చెప్పాలి. ఇదే సమయంలో ఇటు ప్రభుత్వంలో, అటు పార్టీలో రేవంత్ పట్టు సాధించాలి. బిహార్ ఫలితాల తర్వాత కాంగ్రెస్ పరిస్థితి మరింత దారుణంగా మారింది. బిహార్ ఫలితాల తర్వాత కాంగ్రెస్ అధిష్ఠానం పైనే ఆ పార్టీ నాయకులు, శ్రేణులకు నమ్మకం పోయే పరిస్థితి ఏర్పడింది. ఈ రెండేళ్లుగా తనను ఎవరు ఎన్ని విధాలుగా విమర్శించినా, హేళన చేసినా రేవంత్‌రెడ్డి ఓపికతో వెళుతున్నారు. అవకాశం కోసం ఎదురుచూస్తూ వచ్చారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక రూపంలో ఆయనకు ఆ అవకాశం వచ్చింది. ఆత్మవిశ్వాసంతో,పదునైన వ్యూహ రచనతో విజయాన్ని అందుకున్నారు. అయితే జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితంతో రాష్ట్ర రాజకీయాలలో గానీ, ప్రజల జీవితాలలో గానీ మార్పులు రావు. జూబ్లీహిల్స్‌లో ఓడిపోయి ఉంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూలిపోక పోయినా, వ్యతిరేకత మాత్రం విపరీతంగా పెరిగేది. రేవంత్‌రెడ్డి నాయకత్వానికి ఇప్పుడు వచ్చిన ప్రమాదం లేదు. అయితే ఆయన ఎంతగా క్షేత్రస్థాయిలోకి వెళ్లగలిగితే అంతగా ప్రజల్లో స్థానం సాధిస్తారు. లేకుంటే ఈ మూడేళ్లలోనే గడ్డు పరిస్థితులు ఎదుర్కోక తప్పదు.

# మెదక్ లో ప్రభుత్వ వైద్య విద్యా రంగానికి మరొక గొప్ప మైలురాయి

## మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు





**మెదక్ జిల్లా సమయజ్యోతి నవంబర్ 17**

మెదక్ పట్టణంలోని పిల్లికొట్యాల శివారులో ప్రభుత్వ వైద్య కళాశాలకి శంకుస్థాపన భూమి సర్వే నెంబర్ 890లో, 20 ఎకరాల విస్తీర్ణభూమిలో, రాష్ట్ర ప్రభుత్వం రూ.180 కోట్ల అంచనా వ్యయంతో అత్యాధునిక సౌకర్యాలతో, నూతన ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే రోహిత్ రావు శంకుస్థాపన జరిపారువైద్యరంగ అభివృద్ధికి ఇది ఓ చిరస్మరణీయ ఘట్టమని, జిల్లా విద్యార్థులకు మెడికల్ సీట్లు అందుబాటులోకి రావడం, వైద్య సేవలు మరింత అందుబాటులోకి రావడం వల్ల స్థానిక ప్రజలకు, విద్యార్థులకు సహాయపడుతుందని ఎమ్మెల్యే తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్ రావు మాట్లాడుతూ: "ప్రభుత్వ ప్రాధినిధ్యంతో, సమగ్ర వైద్యసదుపాయాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నూతన వైద్య కళాశాలతో జిల్లా అభివృద్ధి మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రాథమిక వైద్యంతో పాటు అత్యంత ప్రధానమైన వైద్య విద్యను అందించేలా మెడికల్ కళాశాలను రూపొందిస్తున్నామన్నారూ . ప్రతిభావంతులకు మెడికల్ విద్యను అందించే లక్ష్యంతో ప్రభుత్వ%శీ% ముందడుగు వేస్తుందన్నారు.నూతనంగా నిర్మించనున్న వైద్య కళాశాల భవనాలు, అనుబంధ హాస్పిటల్ ఆధునాతన వైద్య సదుపాయాలతో నిర్మాణాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ నితిన్ కాబ్రా, సూపర్డెంట్ సునీత, డి సి హెచ్ ఎస్ శివ దయాల్, ఎంసీఏ హెచ్ ఓ డి రాజశ్రీ, వివిధ,ప్రొఫెసర్లు, ప్రజా ప్రతినిధులు, ఆరోగ్య శాఖా అధికారులు పాల్గొన్నారు.

# అన్ని రంగాల కార్మికులకు సంక్షేమ పథకాలు అందజేయాలి

**అడవిదేవులపల్లి నవంబర్ : 17 సమయజ్యోతి**




ఈరోజు అడవిదేవులపల్లి మండలంలో ఎస్కే లతీఫ్ సైదులు గారి అధ్యక్షాన మండల సిఐటియు జనరల్ బాడీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా సిఐటియు రాష్ట్ర నాయకులు డబ్బికార్ మల్లేష్ గారు రైతు సంఘం జిల్లా నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు సిఐటియు జిల్లా నాయకులు మల్లు గౌతమ్ రెడ్డి గారు హాజరై ఈ సందర్భంగా వారు




మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అనేక రంగాల కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో పనిచేసే హమాలీ వర్కర్లకు వెల్ఫేర్ బోర్డు అమలు అయ్యే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు. అదేవిధంగా వెల్ఫేర్ బోర్డు నుంచి భవన నిర్మాణ కార్మికులకు రావాల్సిన పెండింగ్ క్లెయిమ్స్ కు ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి ఆ కార్మికులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలన్నారు. కార్మికులందరికీ కూడా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ విధానాల్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 12 గంటల పని విధానాన్ని కూడా రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అడవిదేవులపల్లి సిఐటియు మండల కన్వీనర్ గా శివనేని రాంబాబు గారిని ఏకగ్రీవ ఎన్నుకోవడం జరిగింది వారితోపాటు 16 మంది కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం జిల్లా నాయకులు తిరుపతి రామ్మూర్తి గారు జిల్లా సిఐటియు నాయకులు దయానంద్ గారు, జటంగి సైదులు అంజయ్య, నాగేశ్వరరావు, కళావతి, భాగ్యమ్మ, శోభ, హనుమంతు,శివ,రవి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ పోలీసుల కృషి అభినందనీయం

## సజ్జన్నార్‌ను కలిసి అభినిందంచిన నాగార్జున

**హైదరాబాద్,నవంబర్17(సమయజ్యోతి):**



పైరసీని అరికట్టేందుకు తెలంగాణ పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమని ప్రముఖ సినీనటుడు నాగార్జున అన్నారు. హైదరాబాద్ సీపీ సజ్జనార్‌తో సినీ ప్రముఖుల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. డిజిటల్ అరెస్ట్ గురించి నాగార్జున మాట్లాడుతూ తమ కుటుంబంలోనూ ఒకరిని సుమారు రెండు రోజులుపాటు నిర్బంధించారని తెలిపారు. పోలీసులకు సమాచారం ఇచ్చేలోపు వారు తప్పించుకున్నారన్నారు. తెలంగాణ పోలీసులకు అభినందనలు. ఐబొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మడి రవిని అరెస్ట్ చేసిన తర్వాత చెన్నై నుంచి నా స్నేహితుడు ఫోన్ చేసి ఇక్కడ మేం చేయలేనిది అక్కడ మీరు చేశారన్నాడు. కేవలం రూ.20కోట్ల కోసం నిందితులు ఇదంతా చేయడం లేదు. పైరసీ వెనుక అంతర్జాతీయ ముఠా ఉంది. 50లక్షల మంది సబ్‌స్క్రైబర్ల డేటా వారికి చేరింది. ఇది బిగ్ ట్రాప్. ఉచితంగా సినిమాలు చూపించాలనేది వారి ఉద్దేశం కాదు. దీనిలో రూ.వేల కోట్లు దోచేసే పెద్ద ప్లాన్ ఉంటుంది. సినిమాలు ఫ్రీగా చూస్తున్నామని అనుకోవద్దు.. దాని వెనుక ఉన్న పెద్ద మోసాన్ని గమనించాలని నాగార్జున అన్నారు. తెలంగాణ పోలీసులు సినీ పరిశ్రమకు చెందిన వారి పరిస్థితి మరికొంత మెరుగుపడేలా చేశారని నిర్మాత సురేశ్‌బాబు అన్నారు. పైరసీ సినిమాలు చూడొద్దని.. ఏదీ ఉచితంగా రాదని చెప్పారు. మన డేటా వారి వద్ద ఉండటంతో ఎన్నో నేరాలకు పాల్పడతారన్నారు. ఉచితంగా సినిమా చూడటం వల్ల ఇవన్నీ జరుగుతాయని సురేశ్‌బాబు అన్నారు.

## వేములవాడ ఆసుపత్రి సేవలు, నాణ్యతప్రమాణాలను పరిశీలించిన ప్రజా ఆరోగ్య వైద్య బృందం

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

వేములవాడ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ టీం రాధిక, శ్రీకాంత్ లు సందర్శించారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, పరికరాలు, పరిశుభ్రత తో పాటు డాక్టర్ల అందుబాటు తదితర వివరాలను సూపరిండెంట్ డా. పెంచలయ్య తో కలిసి ఆసుపత్రి మొత్తం కలియదిరిగి, పరిశీలించారు. తెలుసుకున్నారు. అందుతున్న సేవలు పరిశుభ్రతను ప్రశంసించారు. ఇందులో వీరితో పాటు డాక్టర్లు సుభాషిణి, తిరుపతి, రవీందర్ మరియు ప్రణతిలు ఇతర నర్సింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన కేటీఆర్

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

మాజీమంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ సోమవారము ఇటీవల వివాహం జరిగిన రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం మోహినికుంట వాస్తవ్యులు పోతుగల్ సహకార సంఘము వైస్ చైర్మన్ మెరుగు రాజేశం గౌడ్ కొడుకు కోడలు (నూతన దంపతులు)ను ఆశీర్వదించి, వివాహ శుభాకాంక్షలు తెలిపారు.



## జిల్లాలో ఆన్లైన్ నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి. అదనపు కలెక్టర్ సోమ రాజేశ్వర్

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :



జిల్లాలో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ సోమ రాజేశ్వర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన ఆన్‌లైన్ ఎంట్రీలు,ప్రత్యేక కార్యక్రమం 5.0, ఎఫ్ఆర్ఎస్ తదితర విద్యా సంబంధిత అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, అవసరమైన అర్హతల నమోదు,ప్రత్యేక కార్యక్రమం 5.0 పురోగతి,పాఠశాల స్థాయి డేటా అప్ డేట్లు త్వరగా పూర్తిచేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఎంట్రీలను వెంటనే ముగించాలనే దిశగా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అన్ని పాఠశాలలు నిర్ణీత గడువులో పనులు పూర్తి చేసి,సమన్వయంతో చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఎంఈఓలు,కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు,ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సెక్టోరల్ అధికారులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు

### శాస్త్రోక్తంగా ధ్వజారోహణంతో ప్రారంభం

తిరుచానూరు,నవంబర్17(సమయజ్యోతి):

తిరుపతి జిల్లా తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తిక బ్రహ్మోత్సవాలు సోమవారం శాస్త్రోక్తంగా ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవ, సహస్ర నామార్చన, నిత్య అర్చన చేశారు. అనంతరం నాలుగుమాడ వీధుల్లో తిరుచ్చి ఉత్సవం జరిపి, ధ్వజ స్తంభ తిరుమంజనం నిర్వహించారు. అనంతరం బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ గజపటాన్ని ఆరోహణం చేశారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ సింఘాల్ మీడియాతో మాట్లాడుతూ..ధ్వజారోహణంతో అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయని చెప్పారు. ప్రతి భక్తుడికి వాహన సేవ దర్శనం కల్పిస్తామన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులందరికీ మూలమూర్తి దర్శనం చేయించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. బ్రహ్మోత్సవాల్లో గజ వాహన సేవ, పంచమి తీర్థంకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని, అందుకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. తితిదే ఈవో అనిల్ కుమార్ సింఘాల్, జేఈవో వి.వీరబ్రహ్మం, సీవీఎస్వో కే.వి. మురళీకృష్ణ, డిప్యూటీ ఈవో హరింద్రనాథ్, కంకణ భట్టార్ పి.శ్రీనివాసాచార్యులు, అర్చకులు బాబు స్వామి, అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఈవో శ్రీ శుక్రవారపు తోటలో ఉద్యాన విభాగం ఏర్పాటు చేసిన పుష్పప్రదర్శన, శిల్ప కళాశాల ఏర్పాటు చేసిన శిల్పకళా ప్రదర్శన, ఆయుర్వేద ప్రదర్శనను ప్రారంభించారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించిన జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్

సమయజ్యోతి న్యూస్, నిర్మల్ బ్యూరో, నవంబర్

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొని, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. %బా%ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను అదనపు కలెక్టర్ కు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం, అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా అదనపు కలెక్టర్, అధికారులు ప్రతిజ్ఞ చేశారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, జెడ్పీ సీఈవో గోవింద్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణికి 82 అర్జీలు, అర్జీలను స్వీకరించిన అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి,రాజేశ్వర్

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :

జిల్లా కేంద్రం ఆదిలాబాద్ లోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్యామల దేవి,రాజేశ్వర్ ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీపై వెంటనే స్పందించి,సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అదనపు కలెక్టర్లు సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సమీక్షించి,సంబంధిత శాఖలతో సమన్వయం చేసి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళు ,,పెన్షన్లు,ఉపాధి,భూభారతి సహా వివిధ విభాగాలకు చెందిన మొత్తం 82 దరఖాస్తులు అందాయని,వాటిని శాఖల వారీగా త్వరితగతిన పరిశీలించి పురోగతి వివరాలు దరఖాస్తుదారులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ సలోని ఛాబ్రా, డిప్యూటీ కలెక్టర్ వంశీ కృష్ణ,వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## నిర్మల్ పట్టణంలో ఘనంగా యూనిటీ మార్చ్,




సమయజ్యోతి న్యూస్, నిర్మల్ బ్యూరో, నవంబర్ 17.

సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలను పురస్కరించుకొని నిర్మల్ పట్టణంలో సోమవారం సాయంత్రం యూనిటీ మార్చ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడెం నగేష్, నిర్మల్, ముధోల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పవార్ రామారావు పటేల్ లతో కలిసి పాల్గొన్నారు. ముందుగా పట్టణంలోని బస్టాండ్ సమీపంలో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు ర్యాలీ ప్రారంభించారు. అంబేద్కర్ విగ్రహం నుంచి ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు ఈ ర్యాలీ సాగింది. మార్గమధ్యంలోని వివేక్ చౌక్ లో గల స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ర్యాలీ అనంతరం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సామూహికంగా జాతీయ గేయాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ మాట్లాడుతూ, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలను పురస్కరించుకొని యూనిటీ మార్చ్ కార్యక్రమం నిర్వహించుకోవడం సంతోషకరమైన విషయం అని అన్నారు. స్వాతంత్రం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని వివరించారు. అనేక రాజ్యాలుగా ఉన్న మన దేశాన్ని మొత్తం ఏకం చేశారని వివరించారు. నిజాం రాజ్యాన్ని కూడా హైదరాబాదులో స్వతంత్ర భారతదేశంలో వీలీనం చేసిన గొప్ప వ్యక్తి సర్దార్ పటేల్ అని తెలిపారు. నిర్మల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, స్వాతంత్రం తర్వాత కూడా నిజాం పాలనలో ఉన్న హైదరాబాద్ రాష్ట్రాన్ని భారత దేశంలో కలపడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చోరువ మరువలేని తెలియజేశారు. దేశ ఐక్యత కోసం ప్రతిక్షణం పరితపించిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని చెప్పారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ను స్ఫూర్తిగా తీసుకొని దేశ ఐక్యతలో ప్రతి ఒక్కరు తోడ్పాటును అందించాలని ఎమ్మెల్యే సూచించారు. ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ ఐక్యత స్ఫూర్తిని కొనసాగించాల్సిన బాధ్యత నేటితరం యువతపై ఉందని అన్నారు. ప్రతి ఒక్కరూ దేశ సమైక్యత సమగ్రత కొరకు పాటుపడాలని చెప్పారు. స్వాతంత్రం అనంతరం తన చాతుర్యంతో రాజ్యాలన్నింటినీ ఏకం చేసి, దృఢమైన భారతదేశాన్ని రూపొందించాలని అన్నారు. అంతకుముందు జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ, భారత స్వాతంత్ర సంగ్రామంలో ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ గొప్ప పోరాటం చేశారని అన్నారు. స్వాతంత్రం తొలినాళ్లలో అనేక స్వతంత్ర రాజ్యాలను ఏకం చేసి సంపూర్ణ భారతదేశాన్ని స్థాపన చేశారని కొనియాడారు. భారత తొలి ఉప ప్రధానిగా, తొలి కేంద్ర హెూం శాఖ మంత్రిగా దేశానికి ఎంతో సేవ చేశారని వివరించారు. దాదాపు 600 వరకు చిన్న, పెద్ద స్వతంత్ర రాజ్యాలను భారతదేశంలో వీలీనం చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, జిల్లా యూత్ ఆఫీసర్ శైలి బెల్లాల్, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు, పాల్గొన్నారు.

## నిబంధనలు పక్కనపెట్టి తడిసిన పత్తి,సోయా కొనాలి.

### - మాజీమంత్రి జోగు రామన్న

### - ఈనెల 18న కేటీఆర్ జిల్లాపర్యటన

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :

తేమ శాతం,డ్యామేజ్ నిబంధనలను పక్కనపెట్టి,తడిసిన పత్తి,సోయా పంటను కూడా రైతుల నుంచి కొనుగోలు చేయాలని మాజీ మంత్రి,బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న సోమవారం డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ మార్కెట్ యార్డ్ లో పార్టీ శ్రేణులతో కలిసి కొనుగోళ్లను పరిశీలించిన ఆయన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల రైతుల నష్టపోతున్నారని వారి సమస్యలను తెలుసుకునేందుకు ఈనెల 18న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జిల్లాకు వస్తున్నారని, మార్కెట్ యార్డ్,సిసిఐ కార్యాలయాన్ని సందర్శించనున్నట్లు తెలిపారు.



## బెల్లూరి అయ్యప్ప సేవా సంఘం కార్యవర్గాన్ని సన్మానించిన ఎమ్మెల్యే పాయల్ శంకర్

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :

ఆదిలాబాద్ పట్టణ సమీపంలోని బెల్లూరి అయ్యప్ప సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం రోజు ఎమ్మెల్యే పాయల్ శంకర్ అభినందించారు. ఆదివారం రాత్రి వరకు జరిగిన ఎన్నికల్లో చాందా గణేష్ ప్యానెల్ విజయం సాధించగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నూతనంగా ఎన్నుకున్న అధ్యక్ష,కార్యదర్శులతో పాటు నూతన కార్యవర్గానికి శాలువాలు కప్పి సన్మానించారు. సేవా సామాజిక దృక్పథ%శీ% తో పాటు ఆధ్యాత్మిక భక్తి కార్యక్రమాల్లో అయ్యప్ప సేవా సంఘం ముందు వరుసలో నిలుస్తుందని అన్నారు. సంఘానికి తన వంతు చేయూతని కూడా అందిస్తానని తెలిపారు.



# ఎన్నికల ముందు చేనేత కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలి

## సిపిఎం పార్టీ కార్యదర్శి జాన్ వేస్లీ.

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.**



రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వేస్లీ డిమాండ్ చేశారు.ప్రభుత్వ బ్యాంకుల్లో నేతన్నలకు వడ్డీ లేని రుణాలు అందించాలని అన్నారు.11 రకాల చేనేత రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలి తెలంగాణ రాష్ట్రంలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అన్నిటిని తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.. అమరచింత మండల కేంద్రంలో చేనేత కార్మికుల స్థితిగతులపై నేతన్నల సమస్యలను తెలుసుకోవడం కోసం ఇంటింటి దగ్గరికి వెళ్లి సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పరిశీలన చేశారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. చేనేత కార్మికుల రుణమాఫీ ప్రకటించి ఏడాదిన్నర గడిచిపోయిన ఇంకా కార్మికులకు రుణమాఫీ కాలేదని ఆయన ఆందోళన చెందారు. ప్రభుత్వం 48 కోట్ల నిధులను మంజూరు చేసి రుణమాఫీని అమలు చేయాలని ప్రభుత్వానికి ఆయన డిమాండ్ చేశారు. అర్హులైన చేనేత కార్మికులకు వేస్తున్న జియో ట్యాగ్ నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని ఆయన కోరారు. జియో ట్యాగ్ ఉన్న నేతన్నలకు త్రిఫ్ట్ ఫండ్ పథకం అమలు చేయాలని కోరారు. చేనేత సహకార సంఘాలలో పేరుకుపోయిన వస్త్ర నిల్వలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి సూచించారు. ఉపాధి కల్పనా కోసం ప్రభుత్వ రంగ సంస్థలకు ఏకరూప దుస్తులను చేనేత మగ్గాలపై నేసిన వాటిని సరఫరా చేయాలని జాన్ వెస్లీ ప్రభుత్వానికి కోరారు. చేనేత కార్మికులకు నష్టదాయం కలిగించే డూప్లికేట్ ప్రింటింగ్ చేనేత వస్త్రాలను అరికట్టించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో రేషన్ షాపుల ద్వారా జనతా వస్త్రాలను అందించినట్లుగా చేనేత వస్త్రాలైన చీర, ధోవతి, లుంగీలను వినియోగదారులకు అందించాలని కోరారు. చేనేత కార్మికులకు పెట్టుబడి సాయం కింద వడ్డీ లేని కొత్త రుణాలను ఐదు లక్షలు రూపాయలు అందించేటట్లు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి ఆయన కోరారు. చేనేత కార్మికులకు ఆరోగ్య భీమా పథకాన్ని అమలయేటట్లు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వానికి ఆయన డిమాండ్ చేశారు. 11 రకాల వస్త్రాలను రిజర్వేషన్ చట్టాన్ని తప్పకుండా అమలు అయ్యేటట్లు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. చేనేత కార్మికులకు ఇందిరమ్మ పథకం ద్వారా ప్రతి కార్మికునికి ఇంటితోపాటు వర్క్ షెడ్యూలను నిర్మించేటట్లు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తక్షణమే అమలు అయ్యేటట్లు ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జిఎస్. గోపి, జిల్లా కమిటీ సభ్యులు బి. వెంకటేష్, ఆర్ ఎన్. రమేష్, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు టి. రాఘవేంద్ర, నాయకులు శ్యాంసుందర్, బుచ్చన్న, చేనేత కార్మికులు దామోదర్, శంకర్, రాములు, శేషు, కురుమన్న, నరసింహ, మహమూద్, అంజి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# పీఎం జన్మన్ యోజన పథకం కింద హాస్టల్ నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎంపీ నగేష్,ఎమ్మెల్యే పాయల్ శంకర్

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

ఆదివాసీ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు.ఆదిలాబాద్ రూరల్ మండలం పోతాగూడ గ్రామంలోని ప్రభుత్వ గిరిజన సాటిలైట్ సెంటర్ లో ప్రధానమంత్రి జన్ మన్ యోజన పథకం కింద రూ. 2.75 కోట్ల తో నూతనంగా నిర్మించే హాస్టల్ భవన నిర్మాణానికి ఎంపీ గోడం నగేష్ తో కలిసి ఎమ్మెల్యే సోమవారం భూమి పూజ చేశారు.ముందుగా పాఠశాలకు వచ్చిన ఎంపీ,ఎమ్మెల్యే లకు విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగుతున్న పీఎం జన్మన్ యోజన పథకం ద్వారా పలు గిరిజన గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు.ప్రధానంగా ప్రభుత్వ విద్య విధానం బలోపేతానికి కేంద్రం కృషి చేస్తుందన్నారు.కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు దయాకర్,పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# నూతన ఎస్ బిఐ బ్రాంచ్ ప్రారంభం....

## పూజలో పాల్గొన్న బ్రాంచ్ మేనేజర్ విజయ్ కుమార్

**సమయజ్యోతి న్యూస్ కృష్ణ.... నారాయణపేట జిల్లా**

మండల కేంద్రంలోని రైతు వేదిక భవనం పక్కన గల జయప్రకాష్ అయ్యా నూతన భవనంలో సోమవారం ఉదయం 11 గంటలకు ఎస్బిఐ నూతన బ్రాంచ్ ను మేనేజర్ విజయ్ కుమార్ సన్నాహక పూజలు నిర్వహించి ప్రారంభం చేశారు. ఈ ప్రారంభంలో ఖాతాదారులు నూతన అకౌంట్లో ఓపెన్ చేశారు. బ్రాంచ్ మేనేజర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఖాతాదారులకు కొన్ని సేవలు ఈరోజు నుంచే మొదలవుతాయి మరికొన్ని సేవలు త్వరలోనే ప్రారంభిస్తామని అన్నారు. ఈ సన్నాహక ప్రారంభంలో స్థానికులు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



# లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి.

## - ఆదివాసి సంఘాల డిమాండ్

### 23న ఉట్నూర్ లో భారీ బహిరంగ సభ పోస్టర్ విడుదల

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

రాజ్యాంగ విరుద్ధంగా ఎస్టీ జాబితాలో కొనసాగుతున్న లంబాడాలను తొలగించాలని తుడుం దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గణేష్ డిమాండ్ చేశారు.ఈనెల 23న ఉట్నూర్ లోని ఎంపీడీవో గ్రౌండ్స్ లో ఆదివాసి సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ధర్మ యుద్ధ భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.ఆదిలాబాద్లోని ప్రెస్ క్లబ్లో సోమవారం బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరించారు.ఆదివాసులకు అందవలసిన ఫలాలను వలస లంబాడాలు అనుభవిస్తున్నారని,ఆదివాసులు భారీ సంఖ్యలో పాల్గొని ధర్మ యుద్ధం సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో కుంర శ్రీనివాస్ ఆదివాసి సంక్షేమ పరిషత్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ,వెట్టి మనోజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి,సలాం వరుణ్ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి,ఆత్రం గణపతి డివిజన్ అధ్యక్షులు,మెస్రం కేశవ్ మండల అధ్యక్షులు,గేడం మనోర్ ఏబీఎం జాతియ ఉపాధ్యక్షులు,గేడం విష్ణు జిల్లా యువజన అధ్యక్షులు,పంద్రం గంభీర్ మండల ప్రధాన కార్యదర్శి,మడావి నాగోరావ్ భీంపూర్ మండల ఉపాధ్యక్షులు,గేడం గణేష్ యువజన అధ్యక్షులు కొమరం భీం కాలనీ,సిడాం అత్మరామ్ సంస్కృతిక కార్యదర్శి మావల,కుంర గోవింద రావు,పుసునాక నాగోరావ్,వెట్టి బోజ్జు,మడావి రాము తదితరులు పాల్గొన్నారు.




# కపాస్ కిసాన్ తో రైతులకు తీవ్ర ఇబ్బందులు..

## బిఆర్ఎస్ పార్టీ నాయకుడు మ్యాకల భీమ్

**సమయజ్యోతి న్యూస్ కృష్ణ.... నారాయణ పేట జిల్లా**



రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కపాస్ కిసాన్ తో రైతులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని కృష్ణ మండలం బిఆర్ఎస్ పార్టీ నాయకులు మ్యకల్ భీమ్ ఆరోపించారు స్లాట్ బుకింగ్ లు సరైన సమయానికి కావడం లేదని ఒకవేళ బుక్ అయినా ఎకరానికి 7 క్వింటలు మాత్రమే కొనుగోలు చేయడం ద్వారా రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటురాని అన్నారు కపాస్ కిసాన్ లో స్లాట్ బుకింగ్ నిరంతరం కొనసాగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.రైతులకు సరైన అవగాహన లేకపోవడం వల్ల స్లాట్ బుకింగ్ చేసుకోవడంలో ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. అటు పత్తి జిన్నింగ్ మిల్లులు సమ్మె చేస్తున్న సందర్భంగా రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతుల దగ్గర ఉన్న పత్తిని వెంటనే కొనుగోలు చెయ్యాలని కోరారు.

# వ్యవసాయ సబ్సిడీ యంత్రాలకు దరఖాస్తు చేసుకోండి

## మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎండి.రహమతుల్లా

**మక్తల్ నవంబర్ 17సమయజ్యోతి...**

ఆత్మకూరు మండలానికి రైతులు వ్యవసాయానికి వినియోగించుకునే సబ్సిడీ యంత్రాలు మంజూరు కావడం జరిగింది. అందుకు వ్యవసాయ సబ్సిడీ యంత్రాల కోసం రైతులందరూ దరఖాస్తు చేసుకొని సబ్సిడీ యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎండి రహమతుల్లా పేర్కొన్నారు. వ్యవసాయ సబ్సిడీ యంత్రాలు ఎస్సీ ఎస్టీలకు 50%, బీసీలకు 45% వస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మార్కెట్ వ్యవసాయ అధికారి పాల్గొన్నారు.



# సౌదీ అరేబియాలోని మక్కా-మదీనా హైవేపై బస్సు ప్రమాదం విషాదకరం..

## బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం: మొహమ్మద్ షబ్బీర్ అలీ

**సమయజ్యోతి న్యూస్ హైదరాబాద్ బ్యూరో**

సౌదీ అరేబియాలో జరిగిన రోడ్డు ప్రమాదం పట్ల ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ గారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. హైదరాబాదు నాంపల్లి హజ్ హౌస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్, మైనారిటీల సంక్షేమ మంత్రి మొహమ్మద్ అజార్ ఉద్దీన్, పీఎంఆర్ఈఐఎస్ అధ్యక్షుడు ఫహీమ్ ఖురేషి, తెలంగాణ వక్ఫ్ బోర్డు చైర్మన్, టీజీ ఎంఎఫ్సీ చైర్మన్ అండ్ మైనారిటీ సంక్షేమ కార్యదర్శి బి.షఫియుల్లా విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ భరించలేని క్లిష్ట సమయంలో మరణించిన వారి ఆత్మలకు మా హృదయపూర్వక ప్రార్థనలు, వారి కుటుంబాలకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తోందని, ప్రత్యేక హెల్ప్ లైన్ ఏర్పాటు చేసిందని తెలిపారు. సహాయం కోసం, బాధిత కుటుంబాలు జిఏడి ఎన్నారై హెల్ప్‌లైన్: 7997959754 ను సంప్రదించవచ్చు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందించి వారి కుటుంబాలకు అండగా ఉంటామన్నారు.



# తెలంగాణవ్యాప్తంగా చలితీవ్రత

## చలిగాలులకు తోడు పొగమంచు

**హైదరాబాద్,నవంబర్ 17(సమయజ్యోతి):**

తెలంగాణవ్యాప్తంగా చలితీవ్రత పెరిగింది. ఎముకలు కొరికే చలికి జనం తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఉదయం వేళల్లో భారీగా పొగమంచు కురుస్తున్నది. దానికి తోడు చలిగాలులు వీస్తుండడంతో జనం అల్లాడుతున్నారు. ఈ క్రమంలో వాతావరణశాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. రాగల రెండురోజులు తెలంగాణలో అక్కడక్కడ కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే నాలుగు నుంచి ఐదు డిగ్రీల వరకు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది. సోమవారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ చలిగాలులు వీస్తాయని హెచ్చరించింది. మంగళవారం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో శీతలగాలులు వీచే ఛాన్స్ ఉందని హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. ఆ తర్వాత రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని చెప్పించింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24 గంటల్లో పలుచోట్ల ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి. ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో అత్యల్పంగా 7.4 డిగ్రీ సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదైందని వాతావరణశాఖ తెలిపింది. రాగల రెండు రోజులు చలి తీవ్రత మరింత పెరుగుతుందని వాతావరణశాఖ హెచ్చరించింది. అదే సమయంలో హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. సోమవారం ఉదయం ఈ సీజన్‌లోనే ఉష్ణోగ్రతలు కనిష్టానికి పడిపోయాయని వాతావరణశాఖ తెలిపింది. హైదరాబాద్ యూనివర్సిటీ పరిధిలో 8.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైందని పేర్కొంది. రాజేంద్రనగర్‌లో 10, కంటోన్మెంట్‌లో 11.2, మారేడ్‌పల్లిలో 11.5, కుత్బుల్లాపూర్‌లో 12, గచ్చిబౌలిలో 12 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయని.. సోమవారం రాత్రి సైతం చలి కొనసాగే అవకాశం ఉందని తెలిపింది. మంగళవారం ఉదయం సైతం ఇలాంటి పరిస్థితులే ఏర్పడే అవకాశాలున్నాయని హెచ్చరించింది.

# కల్లుగీత కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా ప్రసాద్ గౌడ్ ఎన్నిక .

**(అందోలు మండల్) నవంబర్ 17 సోమవారం సమయజ్యోతి:-**



సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని అంబెద్కర్ భవనం లో జరిగిన కల్లుగీత కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా మూడవ మహాసభలలో అందోలు మండలం తలెల్మే గ్రామానికి చెందిన లింగన్నగారి ప్రసాద్ గౌడ్ ను రాష్ట్ర కమిటీ సమక్షంలో రెండవసారి జిల్లా కార్యదర్శిగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగ ప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి జిల్లా కమిటీలో చోటు కల్పించినందుకు జిల్లా నాయకులకు రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.నేను ఈ జిల్లాలోని గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గౌడ కులస్తుల సంక్షేమం కోసం పోరాడుతానని , నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా శాయశక్తుల కృషి చేస్తానని ఆయన తెలిపారు.నవంబర్ 28వ తేదీన సూర్యాపేటలో జరిగే రాష్ట్ర మహాసభలను జిల్లాలోని గౌడ సోదరులు కల్లుగీత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# బిజెపి, బిఆర్ఎస్ తీరుపై ప్రజల్లో ఆగ్రహం

## ఉప ఎన్నిక ఫలితమే ఇందుకు నిదర్శనం

## కేంద్రమంత్రులు బండి, కిషన్ రెడ్డిలు ఆత్మపరిశీలన చేసుకోవాలి

## కెటిఆర్ అతిగా ఊహించుకోవడం వల్లనే దెబ్బ





హైదరాబాద్,నవంబర్17(సమయజ్యోతి):

రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని భావిస్తున్న భారతీయ జనతా పార్టీ జూబ్లీహిల్స్‌లో డిపాజిట్ కోల్పోవడం పరిశీలిస్తే ఆశ్చర్యం కలిగిస్తోంది. గత ఎన్నికల్లో వచ్చిన ఓట్లలో ఐదు శాతం వరకు తగ్గిపోవడం ఏమిటి? బీజేపీ ఈ దుస్థితికి అంతర్గత కలహాలు ప్రధాన కారణమని భావించ వచ్చు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రాష్ట్రానికి సంబంధించిన సమస్యలపై పెద్దగా స్పందించడం లేదు. సిఎం రేవంత్ నేరుగా ప్రస్తావించిన సమస్యలపైనా ఎదురుదాడితో పక్కదోవ పట్టిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో రాష్ట్ర సమస్యలను పెద్దగా పట్టించుకోవడం లేదు. పక్కరాష్ట్రం ఎపిలో బిజెపి నుంచి కేంద్ర మంత్రులు వచ్చి వాలుతున్నారు. చంద్రబాబు ఏది కోరితే అది చేసి పెడుతున్నారు. విజినరీ బాబు అంటున్నారు. విశాఖ ఉక్కు, అమరావతి, తుఫాన్ సాయం, పంటల కొనుగోళ్లు, మిర్చి రైతుల సమస్యలు ఇలా ఒక్కటేంటి..ఏది అడిగిన కాదనకుండా కేంద్రం ఎస్ సమాధానంతో సిద్దంగా ఉంది. తెలంగాణలో ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా ఒక్కపనీ కావడం లేదు. పనులన్నవి ప్రజలకు సంబంధించినవి. కాంగ్రెస్ అధికారంలో ఉన్నంత మాత్రాన ప్రజల సమస్యలు పరిష్కరించకుండా ఉండడం దారుణం కాక మరోటి కాదు. ఇకపోతే కేంద్రమంత్రులుగా కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు కాంగ్రెస్‌ను తిడుతూ కూర్చోవడం తప్ప ఒక్కటంటే ఒక్కటి ప్రజలు గుర్తించే పనులు చేయడం లేదు. జూ÷-బలీహిల్‌లో అందుకే బిజెపి అడ్రస్ లేకుండా పోయింది. కేంద్రమంత్రిగా ఇది కిషన్ రెడ్డి సిగ్గుపడాల్సిన విషయం. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి జూబ్లీహిల్స్‌లో వచ్చిన ఓట్లు 35 శాతం మాత్రమే. అప్పుడు బీఆర్ఎస్‌కు దాదాపు 44 శాతం ఓట్లు వచ్చాయి. అంటే, కాంగ్రెస్ కంటే దాదాపు 9 శాతం అధికం. గత ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి 14 శాతం పైగా ఓట్లు వచ్చాయి. ఇప్పుడు 9 శాతంలోపే. ఈసారి బీజేపీ డిపాజిట్ కూడా కోల్పోయింది. 2023 ఎన్నికలతో పోల్చితే కాంగ్రెస్ పార్టీకి దాదాపు పదహారుశాతం ఓట్లు పెరిగాయి. అప్పటితో పోలిస్తే బీఆర్ఎస్, బీజేపీలకు కలిపి 11 శాతం ఓట్లు తగ్గాయి. ఇవన్నీ కాంగ్రెస్‌కు బదిలీ అయ్యాయని భావించాలి. గత ఎన్నికల్లో మజ్లిస్ పోటీ చేయగా, ఇప్పుడు ఆ పార్టీ కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించింది. దీంతో మరో ఐదుశాతం ఓట్లు కాంగ్రెస్ కు కలసి వచ్చాయి. అధికారంలో ఉన్న పార్టీలకు ఉప ఎన్నికల్లో కొన్ని అనుకూలతలు ఉంటాయి. వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్నప్పటికీ కాంగ్రెస్ పార్టీకి 51 శాతం ఓట్లు లభించడం విశేషమే అని అంగీకరించాలి. ఉప ఎన్నికల్లో అధికార పార్టీకి ఐదు శాతం వరకు అనుకూలతల వల్ల లబ్ది చేకూరుతుంది. కాంగ్రెస్‌కు 16 శాతం వరకు పెరిగినందున ఆ విజయాన్ని గుర్తించవలసిందే. బిహార్ ఎన్నికల్లో అంచనాలకు మించి స్వీప్ చేసిన బీజేపీకి తెలంగాణలో ఈ పరిస్థితి ఎందుకు ఏర్పడిందో ఆ పార్టీ అధిష్ఠానం ఆలోచించుకోవాలి. ఉత్తరాదిన తిరుగులేని శక్తిగా ఎదిగిన బీజేపీ దక్షిణాదిలో ఎందుకు ఆపసోపాలు పడుతోందో ఆలోచించుకోవాలి. ఇక్కడ జనం నాడిని ఎందుకు అందుకోలేకపోతున్నారో ఆత్మపరిశీలన చేసుకోవాలి. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా తామే అధికారంలోకి వస్తామన్న అతి విశ్వాసంతో ఉన్న బీఆర్ఎస్‌కు జూబ్లీహిల్స్ ఫలితం గుణపాఠం కావాలి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ నాయకులు, ముఖ్యంగా కేటీఆర్ తక్కువగా అంచనా వేశారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రిని కేటీఆర్ తరచుగా కించపరుస్తూ రెచ్చగొట్టారు. రాజకీయంగా ఉండాల్సిన వైరాన్ని వ్యక్తిగత వైరంగా మార్చారు. రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గుర్తించడానికి కూడా బిఆర్ఎస్ నేతలు అంగీకరించడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అంతులేని వ్యతిరేకత నిజమే అయితే జూబ్లీహిల్స్‌లో 51 శాతం ఓట్లు రావడం ఎలా సాధ్యం అని బీఆర్ఎస్ నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఓటమి తరవాత కేసీఆర్ కుటుంబం ఇంకా నేల మీదకు దిగి రాలేదని గ్రహించాలి. కేసీఆర్ ఫామ్‌హౌజ్‌కే పరిమితం కావడంతో పార్టీలో అంతా తానే అన్నట్టుగా గత రెండేళ్లుగా కేటీఆర్ వ్యవహరిస్తున్నారు. అయినా ప్రజల అభిమానాన్ని మాత్రం ఆయన చూరగొనలేక పోతున్నారు. కేటీఆర్‌లో ఇంకా అహంభావం ఛాయలు పోలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. 2023 ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత జరిగిన ఏ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ గెలవలేదు. పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క సీటు కూడా రాలేదు. కొన్నిచోట్ల పోటీ కూడా చేయలేదు. ఇప్పుడు జూబ్లీహిల్స్ ఎన్నిక. కర్మ మనల్ని వెంటాడుతుందని కేటీఆర్ సొంత చెల్లి కవిత తాజాగా వ్యాఖ్యానించారు. గతంలో అహంభావంతో వ్యవహరించినందునే ఇప్పటి దుస్థితి అని తెలుసుకోకుండా ఇప్పటికీ త్వరలోనే అధికారంలోకి వస్తాం, మీ సంగతి తేలుస్తాం అని ప్రగల్భాలు పుకుతున్నారు. గత ఎన్నికల్లో జూబ్లీహిల్స్‌లో 16 వేల ఓట్ల మెజారిటీతో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ గెలవడానికి ఆంధ్రా మూలాలు ఉన్న ఓటర్లు కూడా కారణం. భారతీయ జనతా పార్టీతో పొత్తు పెట్టుకోవడానికి బీఆర్ఎస్ సిద్ధపడిందని కేసీఆర్ కుమార్తె కవిత బహిరంగంగా చెప్పిన తర్వాత ముస్లింలు బీఆర్ఎస్‌కు దూరమయ్యారని అనుకోవాలి. సిఎం రేవంత్ అన్నట్లుగా యూట్యూబ్ చానళ్లు పెట్టించి, వాటిల్లో అనుకూలంగా ప్రచారం చేయించుకుంటూ అదే నిజమని కేటీఆర్ భ్రమల్లో బతుకుతున్నారు. ప్రస్తుత ఉప ఎన్నిక సందర్భంగా కూడా బీఆర్ఎస్ అనుకూల సోషల్ మీడియా వేదికలు ఊదరగొట్టాయి. అయినా ప్రయోజనం కలగలేదు. మీడియా అయినా, సోషల్ మీడియా అయినా రాజకీయ పార్టీలకు కొంత నష్టం చేయగలవే గానీ, ఎన్నికల్లో ఏదో ఒక పార్టీని గెలిపించలేవు. కేటీఆర్ ఇదే వైఖరితో ఉంటే భవిష్యత్తులో కూడా ఫలితాలు ఇంతకు భిన్నంగా ఉంటాయని భావించలేం. కేసీఆర్ క్రియాశీలంగా వ్యవహరించలేకపోతే బీఆర్ఎస్ పరిస్థితి మరింతగా దిగజారడం ఖాయం.

# సౌదీ ప్రమాద బస్సు ఘటనపై రేవంత్ దిగ్భ్రాంతి

## వెంటనే వివరాలు సేకరించాలని సీఎస్‌కు ఆదేశం

## కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడి

హైదరాబాద్,నవంబర్17(సమయజ్యోతి):

సౌదీ అరేబియా సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంపై సీఎం వెంటనే స్పందించారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని రాష్ట్ర సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డిని ఆదేశించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. మక్కా నుంచి మదీనా వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని మీడియాలో వార్తలు వచ్చాయని.. ఈ ఘటనలో హైదరాబాద్ వాసులు కూడా ఉన్నారని తెలిసి తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఘటనలో తెలంగాణకు చెందిన వారు ఎంతమంది ఉన్నారో వెంటనే తెలుసుకోవాలని అధికారులను ఆదేశించారు సీఎం. కేంద్ర విదేశాంగ శాఖ, సౌదీ ఎంబస్సి అధికారులతో మాట్లాడాలని అధికారులకు సూచించారు. అవసరమైతే వెంటనే తగిన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో సీఎస్ రామకృష్ణారావు ఢిల్లీలోని రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్‌ను అప్రమత్తం చేశారు. ఈ ప్రమాదంలో తెలంగాణకు చెందిన వారు ఎంతమంది ఉన్నారనే వివరాలు సేకరించి వెంటనే అందించాలని సీఎస్ రామకృష్ణారావు కోరారు. సౌదీలో జరిగిన బస్సు ప్రమాద బాధిత కుటుంబాలకు తగిన సమాచారాన్ని, సహాయ సహాకారాలు అందించేందుకు సచివాలయంలో కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లు ఏర్పాటు చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సౌదీ అరేబియా ఘటనకు సంబంధించి పూర్తి వివరాల కోసం 91 79979 59754, ?91 99129 19545 ఈ నెంబర్లలో సంప్రదించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

# తెలంగాణ పోలీసుల కృషి అభినందనీయం

## సజ్జన్నార్‌ను కలిసి అభినందించిన నాగార్జున

హైదరాబాద్,నవంబర్17(సమయజ్యోతి):

పైరసీని అరికట్టేందుకు తెలంగాణ పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమని ప్రముఖ సినీనటుడు నాగార్జున అన్నారు. హైదరాబాద్ సీపీ సజ్జనార్‌తో సినీ ప్రముఖుల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. డిజిటల్ అరెస్ట్ గురించి నాగార్జున మాట్లాడుతూ తమ కుటుంబంలోనూ ఒకరిని సుమారు రెండు రోజులుపాటు నిర్బంధించారని తెలిపారు. పోలీసులకు సమాచారం ఇచ్చేలోపు వారు తప్పించుకున్నారన్నారు. తెలంగాణ పోలీసులకు అభినందనలు. ఐబొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మడి రవిని అరెస్ట్ చేసిన తర్వాత చెన్నై నుంచి నా స్నేహితుడు ఫోన్ చేసి ఇక్కడ మేం చేయలేనిది అక్కడ మీరు చేశారన్నాడు. కేవలం రూ.20కోట్ల కోసం నిందితులు ఇదంతా చేయడం లేదు. పైరసీ వెనుక అంతర్జాతీయ ముఠా ఉంది. 50లక్షల మంది సబ్‌స్క్రైబర్ల డేటా వారికి చేరింది. ఇది బిగ్ ట్రాప్. ఉచితంగా సినిమాలు చూపించాలనేది వారి ఉద్దేశం కాదు. దీనిలో రూ.వేల కోట్లు దోచేసే పెద్ద ప్లాన్ ఉంటుంది. సినిమాలు ఫ్రీగా చూస్తున్నామని అనుకోవద్దు.. దాని వెనుక ఉన్న పెద్ద మోసాన్ని గమనించాలని నాగార్జున అన్నారు. తెలంగాణ పోలీసులు సినీ పరిశ్రమకు చెందిన వారి పరిస్థితి మరికొంత మెరుగుపడేలా చేశారని నిర్మాత సురేశ్‌బాబు అన్నారు. పైరసీ సినిమాలు చూడొద్దని.. ఏదీ ఉచితంగా రాదని చెప్పారు. మన డేటా వారి వద్ద ఉండటంతో ఎన్నో నేరాలకు పాల్పడతారన్నారు. ఉచితంగా సినిమా చూడటం వల్ల ఇవన్నీ జరుగుతాయని సురేశ్‌బాబు అన్నారు.

# సైబర్ క్రైమ్ పోలీసుల కృషి అభినందనీయం

## అభినందించిన హోం

## స్పెషల్ సెక్రటరీ ఆనంద్

హైదరాబాద్,నవంబర్17(సమయజ్యోతి):

ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి ని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు. పోలీసులకు దమ్ముంటే తనను పట్టుకోవాలని కొన్ని రోజుల ముందు ఇమ్మడి రవి సవాల్ చేశాడు. ఆయన కదలికలపై నిఘా పెట్టిన పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో ఇమ్మడి రవి అరెస్ట్‌పై తెలంగాణ రాష్ట్ర హోం శాఖ స్పెషల్ సీఎస్ సీవీ ఆనంద్ స్పందించారు. రవి అరెస్ట్‌పై సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా సీవీ ఆనంద్ ట్వీట్ పెట్టారు.దమ్ముంటే పట్టుకోండి అన్నోడిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు పట్టుకున్నారని సీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు అభినందనలు తెలిపారు. ఇమ్మడి రవిని పట్టుకోవడానికి జూన్ నుంచి సైబర్ క్రైమ్ టీమ్ రేయింబవళ్లు కష్టపడిందని ప్రశంసించారు. రవిని తప్పా ఈ పైరసీకి సంబంధించిన వాళ్లందరినీ పట్టుకుందని గుర్తుచేశారు. దమ్ముంటే పట్టుకోండని పోలీసులకు సవాలు విసిరి, బెదిరించిన వ్యక్తిని ఇప్పుడు అరెస్టు చేశారని కొనియాడారు. డీసీపీ కవిత, హైదరాబాద్ సీపీ సజ్జనార్‌లని ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు సీవీ ఆనంద్.

# ప్రమాద మృతుల కుటుంబాలకు 5లక్షల ఎక్స్‌గ్రేషియా

## అజారుద్దీన్ నేతృత్వంలో సౌదీకి ప్రభుత్వ బృందం

## అక్కడే అంత్యక్రియలకు ఏర్పాట్లు

## తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయం

హైదరాబాద్,నవంబర్ 17(సమయజ్యోతి):

సౌదీ అరేబియా బస్సు ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. మృతుల కుటుంబాలకు రూ.5లక్షలు చొప్పున పరిహారం ఇవ్వాలని నిర్ణయించింది. సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశమైంది. బాధితులకు అండగా నిలవాలని ఈ భేటీలో ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, ఎంఐఎం ఎమ్మెల్యేతోపాటు మైనార్టీ విభాగానికి చెందిన ఉన్నతాధికారితో కూడిన ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని సౌదీకి పంపాలనీ కేబినెట్ నిర్ణయించింది. బస్సు ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాలకు మత సంప్రదాయం ప్రకారం అక్కడే అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. బాధిత కుటుంబసభ్యులకు చెందిన ఒక్కో కుటుంబం నుంచి ఇద్దరిని సౌదీ తీసుకెళ్లేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ నిర్ణయం తీసుకుంది. సౌదీలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో 45 మంది మరణించారు. వీరంతా హైదరాబాద్ వాసులని తెలంగాణ హజ్ కమిటీ ఒక ప్రకటన వెల్లడించింది. మృతుల్లో 17 మంది పురుషులు, 18 మంది మహిళలు, 10 మంది చిన్నారులు ఉన్నారని తెలిపింది. హైదరాబాద్‌లోని మొత్తం 4 ట్రావెల్ ఏజెన్సీల ద్వారా నవంబర్ 9వ తేదీన వీరంతా ఉమ్రాకు బయలుదేరి వెళ్లారు. క్కా యాత్ర పూర్తి చేసుకుని వారంతా మదీనాకి వెళ్తున్న సమయంలో ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్‌లోని విద్యానగర్‌కు చెందిన నజీరుద్దీన్ కుటుంబంలోని 18 మంది ఈ ప్రమాదంలో మరణించారు.

# మరో 15 ఏళ్లు కాంగ్రెస్‌దే అధికారం

## జూబ్లీహిల్స్ ఫలితమే నిదర్శనం

## స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

## మిర్యాలగూడలో మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్

మిర్యాలగూడ,నవంబర్17(సమయజ్యోతి):

మరో 15 ఏళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్సే అధికారంలో ఉంటుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో ఇది రుజువైందని చెప్పారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం కాల్వపల్లి వద్ద రింగురోడ్డు పనులకు మరో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం కోమటిరెడ్డి మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఒక పార్టీకి డిపాజిట్ గల్లంతైందని.. మరో పార్టీ కుటుంబ కలహాలతో కొట్టుమిట్టాడుతోందన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. అన్ని సింగిల్ రోడ్లను డబుల్ రోడ్లుగా మారుస్తున్నామన్నారు. స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే వారి ద్వారా అన్నిరంగాల్లో మరింత అభివృద్ధి సాధిస్తామని చెప్పారు. స్థానిక ఎన్నికలపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానిక ఎన్నికల్లో మిర్యాలగూడ ప్రజలు కాంగ్రెస్‌కి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. రూ.180.25 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు మంత్రులు. ఈ కార్యక్రమాల్లో ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడారు.మిర్యాలగూడ నియోజకవర్గంలో ప్రతి సింగిల్ రోడ్డును, డబుల్ రోడ్డుగా చేస్తామని పేర్కొన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో మిర్యాలగూడ కేఎన్ఎం డిగ్రీ కాలేజీని.. ప్రభుత్వ కాలేజీగా మార్చింది తామేనని వివరించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీకి డిపాజిట్ దక్కలేదని విమర్శించారు. బీఆర్ఎస్ నాలుగు ముక్కలైందని ఎద్దేవా చేశారు. ఆ పార్టీలను విమర్శించేందుకు కూడా తమకు నోరు రావట్లేదని దెప్పిపొడిచారు. తెలంగాణలో మరో 15 ఏళ్లు తామే అధికారంలో ఉంటామని ధీమా వ్యక్తం చేశారు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు ఉమ్మడి నల్గొండ జిల్లా కార్యకర్తల కృషి కారణమన్నారు. కార్యకర్తలకు పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని చెప్పారు. పదేళ్లలో జరగని అభివృద్ధిని రెండేళ్లలో చేసి చూపించామన్నారు. అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకెళ్తోందని చెప్పారు. రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి మద్దతు ధర చెల్లించడంతోపాటు 48 నుంచి 72 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామని ఉత్తమ్ తెలిపారు.

# అక్రమంగా నిర్మించిన సంధ్యా కన్వెన్షన్ కూల్చివేత

## హైకోర్టు ఆదేశాలతో

## హైడ్రా చర్యలు

హైదరాబాద్,నవంబర్17(సమయజ్యోతి):

భాగ్యనగరంలో అక్రమ నిర్మాణాలపై హైడ్రా అధికారులు ఉక్కుపాదం మోపారు. అక్రమ నిర్మాణాలపై హైడ్రాకు ఫిర్యాదులు అందడంతో గచ్చిబౌలిలో సోమవారం భారీ కూల్చివేతలు చేపట్టారు. ఎఫ్‌సీఐ లే అవుట్‌లో అక్రమంగా నిర్మించిన సంధ్యా కన్వెన్షన్ భవనాలను నేలమట్టం చేశారు. హైడ్రాలిక్ జాక్ క్రషర్‌తో నిర్మాణాలను కూల్చివేశారు. తమ ప్లాట్లను ఆక్రమించి సంధ్యా శ్రీధర్ రావు రోడ్లు వేశారని తెలంగాణ హైకోర్టును బాధితులు ఆశ్రయించారు . ఈ క్రమంలో సంధ్యా శ్రీధర్ రావు అక్రమాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది హైకోర్టు. న్యాయస్థానం ఆదేశాలతో హైడ్రా అధికారులు చర్యలు చేపట్టారు. అయితే, అక్రమ నిర్మాణాలపై హైడ్రా అధికారులు దూకుడుతో ముందుకెళ్తున్నారు. ఎక్కడైనా అక్రమ నిర్మాణాలు ఉన్నాయని అధికారులకు ఫిర్యాదులు వస్తే శరవేగంగా చర్యలు చేపడుతున్నారు. హైడ్రా అధికారులు తమకు అండగా నిలవడంతో బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# గిగ్ వర్కర్లకు ఇక రక్షణ కవచం

## - వెట్టినుంచి విముక్తితో పాటు ఉద్యోగ భద్రత
## - సంక్షేమం, సామాజిక భద్రత లక్ష్యంగా బిల్లు
## - చర్చించి ఆమోడించిన తెలంగాణ కేబినేట్

**హైదరాబాద్,నవంబర్ 17(సమయజ్యోతి):**

తెలంగాణ గిగ్ వర్కర్స్ బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. సోమవారం సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో మంత్రి మండలి సమావేశం జరిగింది. ఈ భేటీలో 'తెలంగాణ ప్లాట్‌ఫామ్ -ఆధారిత గిగ్ వర్కర్ల రిజిస్ట్రేషన్, సామాజిక భద్రత, సంక్షేమం బిల్లు-2025'పై చర్చించిన అనంతరం బిల్లుకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. గిగ్ వర్కర్ల సంక్షేమం, సామాజిక భద్రత లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ బిల్లును రూపొందించింది. కేబినెట్ ఆమోదం పొందిన ఈ బిల్లు చట్టరూపం దాలిస్తే దేశంలోనే తొలిసారిగా సమగ్ర గిగ్ వర్కర్ల చట్టం తెచ్చిన తొలి రాష్ట్రంగా తెలంగాణ అవతరిస్తుంది. ఇకపై గిగ్ వర్కర్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రామిక వర్గంగా గుర్తిస్తుంది.ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు 3 లక్షల నుంచి 4 లక్షల వరకు గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్లు ఉన్నారు. వీరిలో ఎక్కువ శాతం రవాణా (మొబిలిటీ), డెలివరీ, లాజిస్టిక్స్ రంగాల్లో పనిచేస్తున్నారు. వీరు సాధారణంగా వారానికి 7 రోజుల పాటు రోజుకు 10 నుంచి-12 గంటల చొప్పున వర్క్ చేస్తున్నారు. వీరి ఆదాయంలో ప్లాట్‌ఫామ్‌లు 20 నుంచి 30శాతం వరకు కమిషన్‌గా వసూలు చేస్తున్నాయి. ఈ క్రమంలో వారికి స్థిరమైన ఆదాయం, సామాజిక భద్రత లేకుండాపోవడం ప్రధాన సమస్యగా ఉంది. తాజా బిల్లులో గిగ్ వర్కర్ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ కేంద్రంగా 'తెలంగాణ ప్లాట్‌ఫామ్ -ఆధారిత గిగ్ వర్కర్ల సామాజిక భద్రత, సంక్షేమ బోర్డు' పేరుతో ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయనుంది. ఈ బోర్డు గిగ్ వర్కర్ల రిజిస్ట్రేషన్, సంక్షేమ పథకాల అమలు, నిధుల పర్యవేక్షణ బాధ్యతలు చేపడుతుంది. అగ్రిగేటర్లకు చెల్లించే సొమ్ములో 1-2 శాతం వాటాను గిగ్ వర్కర్ల సంక్షేమ నిధికి మళ్లించనున్నారు. దీనికి తోడు ప్రభుత్వం తరపున సీఎస్‌ఆర్ ఫండ్స్, విరాళాలు, గ్రాంట్లను ఈ నిధికి అందజేస్తుంది. ప్లాట్‌ఫామ్‌ల చెల్లింపులు సక్రమంగా జరుగుతున్నాయా? లేదా? అనేది పర్యవేక్షించేందుకు రియల్-టైమ్ 'వెల్ఫేర్ ఫండ్ ఫీ వెరిఫికేషన్ సిస్టమ్ అందుబాటులోకి తేనున్నారు. స్విగ్గీ, జొమాటో, జెప్టో, ఉబర్, ఓలా వంటి ప్లాట్ ఫామ్‌లు, కార్మికుల మధ్య తలెత్తే వివాదాలను ఇన్‌టైంలో పరిష్కరించేందుకు వీలుగా ప్రభుత్వం ప్రత్యేక గ్రీవెన్స్ రిడ్రెసల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ముసాయిదాలో పొందుపరిచింది. ఇందులో భాగంగా గిగ్ కార్మికుల జీతాల చెల్లింపులో ఆలస్యం, మోసాలు, అకారణంగా అకౌంట్లు సస్పెండ్? చేయడం.. లాంటి సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ రిడ్రెసల్ అధికారులను నియమిస్తారు. 100 మందికి పైగా కార్మికులు ఉండే ప్రతి పెద్ద ఎ÷-లాట్‌ఫామ్‌లో 'అంతర్గత వివాద పరిష్కార కమిటీ'ని తప్పనిసరిగా ఏర్పాటుచేయాల్సి ఉంటుంది. ఈ కమిటీల ద్వారా పరిష్కారం లభించకపోతే, పైస్థాయిలో అప్పిలేట్ అథారిటీకి వెళ్లే అవకాశం ఉంటుంది. ఇందుకోసం బిల్లులో ప్రత్యేక నిబంధనలు పొందుపరిచారు. కార్మికులు లేదా ఎ÷-లాట్‌ఫామ్‌లు గ్రీవెన్స్ అధికారులు ఇచ్చిన నిర్ణయంపై సంతృప్తిచెందకపోతే వారు అప్పిలేట్ అథారిటీని ఆశ్రయించే అవకాశం ఉంది. ఈ అథారిటీ స్వతంత్రంగా విచారణ జరిపి తుది నిర్ణయం తీసుకోనుంది. తద్వారా కార్మికులకు న్యాయపరమైన భరోసా దక్కుతుంది. చట్టం అమల్లోకి వస్తే ఆయా ప్లాట్‌ఫామ్‌లు ఇకపై ఉద్యోగులను అకారణంగా తొలగించలేవు. ఎవరైనా ఉద్యోగిని తొలగించాలంటే కనీసం ఏడు రోజుల ముందు నోటీసు ఇవ్వడం తప్పనిసరి. గతంలో ప్లాట్‌ఫామ్‌లు గిగ్ వర్కర్ల అకౌంట్లను ఒక్కసారిగా నిలిపివేసేవి. దీనివల్ల కార్మికులు ఉన్నఫళంగా రోడ్డునపడేవారు. తాజా బిల్లులో కస్టమర్ భద్రతకు ముప్పు కాని సందర్భాల్లో.. ఏ వర్కర్‌నైనా తొలగించాలంటే కనీసం ఏడు రోజుల ముందుగా నోటీసు ఇవ్వాలనే నిబంధన పెట్టారు. పని కేటాయింపు, తొలగింపు.. తదితర అంశాల్లో వివక్ష లేకుండా ఉండేందుకు, ప్లాట్‌ఫామ్‌లు ఉపయోగిస్తున్న అల్గారిథమ్‌లు పారదర్శకంగా ఉండేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం గిగ్ వర్కర్లకు పని కేటాయింపులు, బోనస్‌లు, రేటింగ్‌లు, అకౌంట్ సస్పెన్షన్‌లు పూర్తిగా సాఫ్ట్‌వేర్ అల్గారిథమ్‌పై ఆధారపడి నడుస్తున్నాయి. వీటిలో వివక్ష, అన్యాయానికి తావులేకుండా బిల్లులో 'అల్గారిథమ్ ట్రాన్సపరెన్సీ'ని తప్పనిసరి చేస్తున్నారు. దీని ద్వారా కార్మికులు తమ పనిపై ప్రభావం చూపే నిర్ణయాలు ఎలా తీసుకుంటున్నారో తెలుసుకునే హక్కు పొందుతారు. గిగ్‌వర్కర్ల బిల్లు రూపకల్పన నుంచి ఆమోదం వరకు ప్రభుత్వం శాస్త్రీయంగా ముందుకు వెళ్తున్నది. ముందుగా రాష్ట్రంలో 1,300 మంది గిగ్ వర్కర్లపై సర్వే నిర్వహించి, వారు ఎదుర్కొంటున్న సమస్యల ఆధారంగా బిల్లులో పలు అంశాలు పొందుపరిచింది. 2024 జనవరి నుంచి 2025 జూన్ వరకు అగ్రిగేటర్లు, గిగ్ వర్కర్ల సంఘాలు, నిపుణులు, న్యాయవేత్తలతో ఆరుసార్లు సంప్రదింపులు చేపట్టి.. పలు మార్పులు చేర్పులు చేసింది. న్యాయశాఖ పరిశీలన అనంతరం ఈ ఏడాది ఏప్రిల్ 14 నుంచి మే 19 వరకు బిల్లుపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. 66 సూచనలు, అభ్యంతరాలు అందగా.. వీటిలో చాలా అంశాలను బిల్లులో పొందుపరిచారు.

## సౌదీ ప్రమాదంలో విద్యానగర్‌లో విషాదం

### ఒకే కుటుంబానికి చెందిన 18మంది మృతి

### కుటుంబీకులకు కిషన్ రెడ్డి, పిసిసి చీఫ్‌ల పరామర్శ

**హైదరాబాద్,నవంబర్ 17(సమయజ్యోతి):**

సౌదీ అరేబియాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌లోని విద్యానగర్‌కు చెందిన నజీరుద్దీన్ కుటుంబంలోని 18 మంది మృతి చెందారు. దీంతో ఈ ప్రాంతంలో తీవ్ర విషాదం అలముకుంది. నజీరుద్దీన్ మృతితో స్థానికులు కన్నీరు పెట్టారు. నసీరుద్దీన్ ఓ విశ్రాంత రైల్వే ఉద్యోగి. తన కుటుంబ సభ్యులతో కలిసి మక్కా యాత్రకు వెళ్లారు. అంతలోనే ఈ ఘోర ప్రమాదం వారి కుటుంబాన్ని కబళించింది. విషయం తెలుసుకున్న నసీరుద్దీన్ బంధువులు, స్నేహితులు అతడి నివాసం వద్దకు చేరుకున్నారు. ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి. బాధిత కుటుంబ బంధువులను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పరామర్శించారు. కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఎలాంటి అవసరం ఉన్నా తనను సంప్రదించాలని భరోసా ఇచ్చారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్.. నసీరుద్దీన్ ఇంటికి వెళ్లి ఆయన బంధువులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇప్పటికే ఆ దిశగా చర్యలు మొదలు పెట్టినట్లు చెప్పారు. మరోవైపు నసీరుద్దీన్ ఇంటి వద్ద రోదనలు మిన్నంటాయి. ఒకే కుటుంబంలో 18 మంది ప్రాణాలు కోల్పోవడాన్ని నమ్మలేకపోతున్నామంటూ ఆయన బంధువులు, స్నేహితులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు 18 మంది అంత్యక్రియలను సౌదీలోనే నిర్వహించనున్నట్లు నసీరుద్దీన్ బంధువులు పేర్కొన్నారు. మరోవైపు ఇదే ప్రమాదంలో.. హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పురాకు చెందిన ఐదుగురు మృతి చెందారు. మృతుల కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ పరామర్శించారు. సౌదీలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో 45 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. వీళ్లంతా హైదరాబాద్ వాసులేనని తెలంగాణ హజ్ కమిటీ ఓ ప్రకటన విడుదల చేసింది. మృతి చెందిన వారిలో 17 మంది పురుషులు, 18 మంది మహిళలు, 10 మంది చిన్నారులు ఉన్నట్లు పేర్కొంది. మొత్తం నాలుగు ట్రావెల్ ఏజెన్సీల ద్వారా ఈనెల 9న హైదరాబాద్ నుంచి వీరంతా ఉమ్రాకు బయల్దేరారు. విజయవంతంగా మక్కా యాత్ర పూర్తిచేసుకుని మదీనాకు వెళ్తున్న సమయంలో రోడ్డు ప్రమాదం జరిగింది. మదీనాకు 25 కి.మీ దూరంలో బస్సు-డీజిల్ ట్యాంకర్ ఢీకొన్నాయి.



## ల్యాబ్ టెక్నీషియన్ పోస్ట్ ఫలితాలు విడుదల

### విడుదల చేసిన

### మంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్,నవంబర్ 17(సమయజ్యోతి):**

వివిధ విభాగాల్లో 1,284 ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ - ఎఎ పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షా ఫలితాలను తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసింది. సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఈ పోస్టులకు ఎంపికైన వారి జాబితాను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ విడుదల చేశారు. మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు తన అధికారిక వెబ్‌సైట్‌లో ఈ అభ్యర్థుల జాబితాను అందుబాటులో ఉంచింది. ఈ ఉద్యోగాలకు పరీక్ష రాసిన అభ్యర్థులు ఫైనల్ మెరిట్ లిస్ట్‌ను ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవచ్చు. తెలంగాణ వైద్యారోగ్య శాఖలో 1,284 పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ జారీ కాగా.. 24,045 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ పోస్టులకు సంబంధించి పరీక్షను 2024, నవంబర్ 10వ తేదీన నిర్వహించారు. మొత్తం 23,323 మంది ఈ పరీక్షకు హాజరయ్యారు. మెరిట్ లిస్ట్ సిద్ధం చేసి.. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసిన ప్రభుత్వం.. తాజాగ్గా ÷నైల్ మెరిట్ లిస్ట్(ఉద్యోగానికి ఎంపికైన వారి జాబితా)ను విడుదల చేసింది. కొత్తగా ఎంపికైన అభ్యర్థులను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బోధనాస్పత్రులు, జిల్లా, ఏరియా ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నియమించనున్నారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టుల బంగారం బిస్కెట్ల పట్టివేత

### ఇస్త్రీ పెట్టెలో దాచి తెస్తుండగా

### గుర్తించిన అధికారులు

**హైదరాబాద్,నవంబర్ 17(సమయజ్యోతి):**

విమానాశ్రయంలో ఓ ప్రయాణీకుడిని అనుమానించి తనిఖీ చేయగా బంగారం బిస్కట్లు బయటపడ్డాయి. బయటకు వస్తున్న అతడిపై అనుమానం వచ్చిన ఎయిర్ పోర్ట్ సిబ్బంది.. అతడి లగేజీ చెక్ చేశారు.. ఏమి దొరకలేదు.. మళ్లీ అనుమానంతో మరో సారి గట్టిగానే తనిఖీలు చేపట్టారు.. దీంతో అసలు విషయం బయటపడింది. ఇస్త్రీ పెట్టెలో లక్షల విలువైన బంగారాన్ని చూసిన ఎయిర్ పోర్ట్ అధికారులు నోరు వెళ్లబెట్టారు. ఇస్త్రీ పెట్టెలో ఏకంగా రూ. 1.55 కోట్ల విలువైన బంగారం దాచడంతో ..అక్కడున్న వాళ్లంతా అవాక్కయ్యారు. ఈ ఘటన శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో జరిగింది. వైఎస్‌ఆర్ కడప జిల్లా పొద్దుటూర్‌కు చెందిన ఓ వ్యాపారి ఇటీవల షార్జాకు వెళ్లాడని అధికారులు వెల్లడించారు. అయితే అతడు షార్జా నుంచి 1200 గ్రాముల బరువున్న 11 బంగారం బిస్కెట్లను తీసుకొచ్చాడు. ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారుల చెకింగ్స్ నుంచి తప్పించుకోగలిగాడు. అయినప్పటికి గ్రీన్ ఛానల్ నుంచి బయటకు వెళ్లిపోతున్న టైంలో తమకు అడ్డంగా దొరికిపోయాడని అధికారులు చెప్పుకొచ్చారు. దొరికిన బంగారాన్ని స్వాధీనం చేసుకుని.. నిందితుడితో పాటు.. మరో వ్యక్తిని డీఆర్ఐ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ బంగారం ఏపీలోని ప్రొద్దుటూరుకు చెందిన మరో వ్యక్తి కోసం తీసుకువచ్చినట్లు అధికారులు వెల్లడించారు. అనంతరం నిందితుడిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

## 19న పుట్టపర్తికి ప్రధాని మోడీ రాక

**అమరావతి,నవంబర్17(సమయజ్యోతి):**

పుట్టపర్తి సత్యసాయిబాబా జయంతి వేడుకలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 19న పుట్టపర్తిలో ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. భక్తులకు ఏర్పాట్లు, రవాణా సౌకర్యాల కోసం ముగ్గురు ఐఏఎస్ అధికారులను నియమించింది. గోపాలకృష్ణ, గోవిందరావు, కల్యాణ్ చక్రవర్తికి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించింది. అంతేకాకుండా సమీప జిల్లాలకు చెందిన జేసీ, 9 మంది డిప్యూటీ కలెక్టర్లకు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

## లారీని ఓవర్ టేక్ చేయబోయి మృతి

**గుంటూరు,నవంబర్ 17(సమయజ్యోతి):**

గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కురగల్లు వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ద్విచక్రవాహనదారుడు అదుపుతప్పి కిందపడిపోయాడు. లారీ అతడి మీద నుంచి వెళ్లడంతో.. అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఘటనపై ఆరా తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి.

## వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి కృషి

**నిజామాబాద్,నవంబర్ 17(సమయజ్యోతి):**

సీనియర్ సిటిజన్స్ కేసుల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టామని సబ్ కలెక్టర్ తెలిపారు. 60 ఏళ్లకు పైబడిన వయోధికులకు ఏమైనా సమస్యలు ఉంటే కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌లో సంప్రదించాలని కోరారు. ఉచిత న్యాయ సలహాలకు సైతం తోడ్పాటు అందిస్తామన్నారు. సీనియర్ సిటిజన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాన్సువాడ పురపాలక కార్యాలయంలోని కమ్యూనిటీ మీడియేషన్ కేంద్రంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ వద్దకు వచ్చిన సీనియర్ సిటిజన్స్ కేసులపై సమీక్ష నిర్వహించారు. 2025 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు సీనియర్ సిటిజన్స్‌కు సంబంధించిన 11 కేసులు పరిష్కరించినట్లు చెప్పారు. సీనియర్ సిటిజన్స్ కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని,

## ఎసిబికి చిక్కిన డిప్యూటీ తాసిల్దార్

**భద్రాద్రి కొత్తగూడెం,నవంబర్ 17(సమయజ్యోతి):**

ఎసిబికి మరో లంచావతారం చిక్కాడు. లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. లంచం తీసుకుంటూ డిప్యూటీ తహసీల్దార్ ఏసీబీ వలకు చిక్కాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులోని తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ డీఎస్పీ రమేశ్ అధ్వర్యంలో దాడులు నిర్వహించారు. కార్యాలయంలో డీలర్ల నుంచి రూ. 30వేలు లంచం తీసుకుంటూ డిప్యూటీ తహసీల్దార్ పాష, సహాయకుడు విజయ్.. ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు.

## చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడి ఘటన

### జంతర్‌మంతర్ వద్ద

### దళిత సంఘాల ధర్నా

**న్యూఢిల్లీ,నవంబర్ 17(సమయజ్యోతి):**

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ పై జరిగిన దాడిని నిరసిస్తూ ఢిల్లీ జంతర్ మంతర్‌లో పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. సీజేఐ గవాయ్‌పై బూటు దాడిని నిరసిస్తూ మందకృష్ణ.. ఆధ్వర్యంలో ధర్నాకు దిగారు. ఈ ధర్నాకు మద్దతు తెలుపుతూ దళిత సంఘాల నేతలు, కార్యకర్తలు భారీగా ఢిల్లీకి చేరుకుని ఆందోళనకు దిగారు. దేశంలోని 30 కోట్ల మంది దళితులపై దాడిగా తాము భావిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. భారత రాజ్యాంగానికి విలువ ఇవ్వకుండా విశ్వాసాలు, ధర్మాల ముసుగులో ఎవరైతే ఎస్సీలపై దాడులకు పాల్పడుతున్నారో, అవమానిస్తున్నారో వారిని దళిత సంఘం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ..'ధర్మం, విశ్వాసాల ముసుగులో దళితులపై దాడి చేస్తున్న వారికి గుణపాఠం నేర్పుతాం అన్నారు. అమరావతిలో గవాయ్ మాట్లాడుతూ.. రాజ్యాంగం వచ్చిన తర్వాతే తనలాంటి దళితుడు చీఫ్ జస్టిస్ అయ్యారని చెప్పారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారానే ఇవ్వన్ని సాధ్యమయ్యాయి. రాజ్యాంగాన్ని బలహీనం చేసే కుట్రలు ఈ దేశంలో జరుగుతున్నాయి. న్యాయ వ్యవస్థ స్వతంత్రతను దెబ్బతీసే కుట్రలు చేస్తున్నారు. అంతేకాకుండా 30కోట్ల మంది దళితులను అవమానించడం, చిన్నచూపు చూడడం, కించపరిచేలా ఈ దేశంలో సంఘటనలు జరుగుతున్నాయి. చట్టాల ముందు అందరూ సమానమై ఉంటే చీఫ్ జస్టిస్‌పై దాడి జరిగితే చర్యలు ఎందుకు తీసుకోలేదు. చట్టాలు వారికి వర్తించవా?. దాడి చేసిన వ్యక్తిపై ఎందుకు కేసు పెట్టలేదని మందకృష్ణ ప్రశ్నించారు. జార్ఖండ్ హైకోర్టులో జడ్జిపై ఒక న్యాయవాది వ్యాఖ్యలు చేస్తే కేసు పెట్టారు. తెలంగాణలో ఓ రౌడీషీటర్ ఎన్‌కౌంటర్ అయితే దానిపై మానవ హక్కుల కమిషన్ స్పందించింది. ఆధర్మం ఈ ధర్మం పేరిట మమ్మల్ని ఊరికి దూరంగా నెట్టివేశారు. మాకు చదువు, గౌరవం లేకుండా చేసేందుకు పాత వ్యవస్థను తిరిగి తీసుకొచ్చే విధంగా పరిస్థితి ఉంది. అద్దెకు ఉండేందుకు దళితులకు ఇల్లు ఇవ్వమని కరీంనగర్‌లో కొందరు బోర్డు పెట్టారు. దేశంలో ఇంకా అంటరానితనం కొనసాగుతోంది. సీజేఐ జస్టిస్ గవాయ్‌పై దాడి చేసిన వారిపై కచ్చితంగా చర్యలు తీసుకోవాల్సిందే' అని డిమాండ్ చేశారు.



# సౌదీ ఘటనపై జై శంకర్ దిగ్భ్రాంతి

**న్యూఢిల్లీ,నవంబర్17(సమయజ్యోతి):**

సౌదీ అరేబియాలోని మదీనాలో భారతీయ పౌరులకు జరిగిన ప్రమాదంపై కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ట్వీట్ పెట్టారు జై శంకర్. రియాద్‌లోని భారత రాయబార కార్యాలయం, జెడ్డాలోని కాన్సులేట్ ఈ ప్రమాదంలో ప్రభావితమైన భారతీయ పౌరులు, కుటుంబాలకు పూర్తి మద్దతు ఇస్తున్నాయని తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని జై శంకర్ ప్రార్థించారు.

# ఢిల్లీ పేలుడు ఘటనలో కీలక పరిణామం

## ఉమర్‌కు సహకరించిన అమీర్ రషీద్

## ఎన్ఐఎ కస్టడీకి అప్పగించిన పాటియాల కోర్టు

**న్యూఢిల్లీ,నవంబర్ 17(సమయజ్యోతి):**

దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో ఇటీవల జరిగిన భారీ పేలుడు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. పేలుడుకు పాల్పడిన ఉమర్‌కు సహకరించిన నిందితుడు అమీర్ రషీద్ అలీని కట్టుదిట్టమైన భద్రత మధ్య పాటియాలా హౌస్ కోర్టు కాంప్లెక్స్‌లోని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు ముందు సోమవారం నాడు హాజరుపరిచారు. ఈ మేరకు 10 రోజుల ఎన్ఐఏ కస్టడీకి కోర్టు ఆదేశించింది. ఆ వెంటనే రషీద్‌ను ఎన్ఐఏ కార్యాలయానికి అధికారులు తరలించారు. అమీర్ రషీద్ అలీని కోర్టుకు హాజరుపరిచే సమయంలో మీడియాను అనుమతించలేదు. కోర్టు కాంప్లెక్స్ చుట్టూ ఢిల్లీ పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది మోహరించారు. అల్లర్ల వ్యతిరేక టీమ్‌నూ సిద్ధం చేశారు. నవంబర్ 10న జరిగిన ఢిల్లీ పేలుడు ఘటనలో 10 మంది మృతిచెందగా, 13మంది గాయపడ్డారు. ఐఈడీ అమర్చి పేల్చిన ఐ20 కారు అమీర్ పేరుతో రిజిస్టర్ కావడంతో ఎన్ఐఏ అతన్ని అదుపులోకి తీసుకుంది. సూసైడ్ బాంబర్ ఉమర్ నబీతో కలిసి ఈ దాడికి అమీర్ రషీద్ కుట్రపన్నినట్టు ఎన్ఐఏ వెల్లడించింది. అమీర్ జమ్మూకశ్మీర్‌లోని పంపోర్‌కు చెందిన వ్యక్తి కాగా, ఉమర్ ఫరీదాబాద్‌లోని అల్-ఫలాహ్ యూనివర్శిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. తదుపరి విచారణలో భాగంగా ఉమర్ ఉపయోగించిన మరో కారునూ ఎన్ఐఏ స్వాధీనం చేసుకుంది. ఇంతవరకూ గాయపడిన బాధితులతో సహా 73మంది సాక్ష్యులను ఎన్ఐఏ విచారించింది. మరోవైపు, ఫరీదాబాద్ టెర్రర్ మాడ్యూల్ కేసులో ప్రమేయం, మోసం, ఫోర్జరీకి పాల్పడిన ఆరోపణలపై అల్-ఫలాహ్ యూనివర్శిటీ చైర్మన్‌కు ఢిల్లీ పోలీసులు రెండు సమన్లు జారీ చేశారు. యూజీసీ, ఎన్ఏఏసీ లేవనెత్తిన ఆందోళనలపై రెండు ఎఫ్ఐఆర్‌లనూ నమోదు చేశారు. యూనివర్శిటీ గుర్తింపు క్లెయిమ్స్‌పై జరిపిన సమీక్షలో పెద్దఎత్తున అవకతవకలు జరిగినట్టూ గుర్తించారు.

# సౌదీ రోడ్డు ప్రమాదం

## ప్రధాని మోడీ తీవ్ర దిగ్భ్రాంతి

**న్యూఢిల్లీ,నవంబర్ 17(సమయజ్యోతి):**

మక్కా యాత్రకు వెళ్లిన పలువురు భారతీయ యాత్రికులు మదీనాలో రోడ్డు ప్రమాదానికి గురై పెద్ద సంఖ్యలో యాత్రికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'మదీనా రోడ్డు ప్రమాదంలో భారతీయులు మృత్యువాత పడటం బాధాకరం. ఈ ప్రమాదంలో తమ ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబసభ్యులకు నా ప్రగాఢసానుభూతి. గాయపడ్డ వారు అత్యంత త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. రియాద్‌లో ఇండియన్ ఎంబసీ, జెడ్డాలోని కాన్సులేట్ సాయం అందిస్తున్నాయి. భారత అధికారులు సౌదీ అధికారులతో ఈ ప్రమాదం గురించి ఎప్పటికప్పుడు చర్చిస్తూ ఉన్నారు' అని అన్నారు. కాగా, సోమవారం తెల్లవారు జామున భారతీయ యాత్రికులు మక్కాలో ప్రార్థనలు ముగించుకుని బస్సులో మదీనా వెళుతూ ఉన్నారు. వారు ప్రయాణిస్తున్న బస్సు 1.30 గంటల ప్రాంతంలో డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. దీంతో బస్సులో మంటలు చెలరేగాయి. పెద్ద సంఖ్యలో యాత్రికులు సజీవ దహనం అయ్యారు. మరికొంత మంది తీవ్రంగా గాయపడ్డారు.

# పదిమంది ఎమ్మెల్యేల అనర్హతపై విచారణ

## స్పీకర్ తీరును తప్పుపట్టిన సుప్రీం

## నాలుగు వారాల్లో నిర్ణయం ప్రకటించాలని ఆదేశం

**న్యూఢిల్లీ,నవంబర్17(సమయజ్యోతి):**

తెలంగాణ స్పీకర్ తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎమ్మెల్యేల అనర్హతపై మీరు నిర్ణయం తీసుకుంటారా? మేము తీసుకోవాలా ? అని సుప్రీంకోర్టు తెలంగాణ స్పీకర్‌ను ప్రశ్నించింది. ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారంలో కోర్టుధిక్కర పిటిషన్‌పై తెలంగాణ స్పీకర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోక పోవడంపై కేటీఆర్ కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం విచారణ జరిగింది. కోర్టుధిక్కారంపై నాలుగు వారాల్లోగా జవాబు చెప్పాలని స్పీకర్‌కి దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్. గవాయి ధర్మాసనం విచారణ జరిపింది. మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోకపోవడం కోర్టు ధిక్కారమే.. రోజువారీగా విచారణ జరిపి నిర్ణయం తీసుకోవాలని జస్టిస్ బీఆర్ గవాయి స్పష్టం చేశారు. నాలుగు వారాల్లోగా విచారణ పూర్తి చేస్తామని స్పీకర్ తరఫున న్యాయవాదులు అభిషేక్ సింగ్, ముకుల్ రోహత్గి వెల్లడించారు. తెలంగాణలో ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరిగింది. ఈ అంశంపై సర్వోన్నత న్యాయస్థానం స్పీకర్‌కు మరో 4 వారాల గడువు ఇచ్చింది. ఈలోపు నిర్ణయం తీసుకోవాలని సూచించింది. కేసు విచారణను కూడా 4 వారాలకు వాయిదా వేసింది. తెలంగాణలో పదిమంది ఎమ్మెల్యేల అనర్హత అంశానికి సంబంధించి దాఖలైన మూడు వేర్వేరు పిటిషన్లు సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చాయి. ఆ ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా భారత రాష్ట్ర సమితి దాఖలు చేసిన పిటిషన్లపై మూడునెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని జులై 31న జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. అయితే విభిన్న కారణాలవల్ల ఆలోపు నిర్ణయం తీసుకోవడం సాధ్యం కానందున స్పీకర్‌కు మరో రెండునెలలు గడువు ఇవ్వాలని కోరుతూ తెలంగాణ శాసనసభ కార్యదర్శి దాఖలు చేసిన మిసిలేనియస్ అప్లికేషన్ సీజేఐ ధర్మాసనం ముందు 14వ నంబరులో లిస్ట్ అయింది. ఈక్రమంలో ఆయా పిటిషన్లపై సోమవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం స్పీకర్‌కు మరో 4 వారాల గడువు ఇచ్చింది.

# ఆపరేషన్ సింధూర్ పాఠాలు నేర్పింది

## ఇది కేవలం ట్రైలర్ మాత్రమే - పాక్ మళ్లీ తెగిస్తే ఇక అంతే సంగతులు

## చాణక్య రక్షణ సదస్సులో జనరల్ ద్వివేది

**న్యూఢిల్లీ,నవంబర్ 17(సమయజ్యోతి):**

పాకిస్థాన్ ఉగ్రస్థావరాలపై జరిపిన మిలటరీ చర్య 'ఆపరేషన్ సిందూర్' నుంచి తాము పాఠాలు నేర్చుకున్నామని భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది అన్నారు. గతేడాది చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ఒక ట్రైలర్ మాత్రమేనని, పొరుగుదేశం మళ్లీ దారి తప్పితే గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. సోమవారం నాడిక్కడ జరిగిన 'చాణక్య రక్షణ సదస్సు'లో ఆయన మాట్లాడుతూ, 88 గంటలపాటు సాగించిన 'ఆపరేషన్ సిందూర్' ఒక ట్రైలర్ మాత్రమేనని అన్నారు. 'భవిష్యత్తులో ఎలాంటి సవాళ్లు ఎదురైనా తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉన్నాం. పాక్ తిరిగి దారి తప్పితే ఎలా బాధ్యతగా వ్యవహరించాలో గుణపాఠం నేర్పిస్తాం' అని జనరల్ ద్వివేది అన్నారు. ఎప్పుడు ఆపరేషన్ చేపట్టినా దాని నుంచి కొన్ని విషయాలు నేర్చుకోవడం జరుగుతుందని, త్రివిధ దళాల మధ్య సమన్వయం, సరఫరాలు సక్రమంగా అందేలా చూసుకోవడం, ప్రతి దశలోనూ ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకోవడం వంటివి చాలా కీలకమైనవిగా 'ఆపరేషన్ సిందూర్' నుంచి గ్రహించినట్టు చెప్పారు. అతి తక్కువ సమయం లోనే నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని, ప్రతి దశలోనూ సకాలంలో నిర్ణయాలు తీసుకోవడం అనివార్యమని చెప్పారు. బలగాల మధ్య సమన్వయం చాలా అవసరమని, అందులోనూ యుద్ధాలు ఇవాళ బహుళ మాధ్యమాల్లో జరుగుతున్నాయని అన్నారు. భూమి, ఆకాశం, సైబర్ రంగం, సమాచార యుద్ధం... వెరసి సమగ్ర యుద్ధం అవుతోందన్నారు. ఆర్మీ మాత్రమే యుద్ధం సాగించలేదని, ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా యుద్ధం సాగించాల్సి ఉంటుందని చెప్పారు. ఇవాళ యుద్ధం అంటూ వస్తే ఎన్ని గంటలు జరుగుతుందో చెప్పలేమని, ఆపరేషన్ సిందూర్ 88 గంటలపాటు సాగించామని, వచ్చేసారి నాలుగు నెలలైనా కావచ్చు, నాలుగేళ్లూ పట్టవచ్చని అన్నారు. ఇలాంటప్పుడు యుద్ధానికి సరిపడినన్ని ఆయుధాలు మన వద్ద ఉన్నాయా? అనేది చూసుకోవాలని, లేనిపక్షంలో అందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రఘటన అనంతరం భారత్ తీసుకువచ్చిన 'న్యూ నార్మల్' విధానంపై మాట్లాడుతూ, ఒకే సమయంలో చర్చలు, ఉగ్రవాదం కొనసాగలేవని చాలా స్పష్టంగా ఈ విధానంలో చెప్పడం జరిగిందన్నారు. ఒక దేశం ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తుంటే, అది ఇండియాకు ఆందోళన కలిగించే విషయమని, ప్రగతిని ఇండియా కోరుకుంటోందని, అందుకు అవరోధం కలిగించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. శాంతియుత ప్రక్రియకు భారత్ సహకరిస్తుందని, అప్పటివరకూ ఉగ్రవాదాన్ని, ఉగ్రవాదాన్ని స్పాన్సర్ చేస్తున్న వారికి ఒకే రీతిన గుణపాఠం చెబుతుందని అన్నారు. జమ్మూకశ్మీర్‌లో భద్రతా పరిస్థితిపై మాట్లాడుతూ, 370వ అధికరణ రద్దు తర్వాత ఉగ్రవాద ఘటనలు తగ్గాయని చెప్పారు.

# బీహార్‌లో బిజెపి ఓట్ చోరీ సుస్పష్టం

## ఓట్లు వచ్చినా సీట్లు తగ్గిన మహాకూటమి

## ఓట్లు తగ్గినా సీట్లు బిజెపికి పెరిగాయి

## గాంధీభవన్ ముందు యూత్ కాంగ్రెస్ నిరసన

## పిసిపి చీఫ్ మహేశ్, మంత్రి పొన్నం విమర్శలు

**హైదరాబాద్,నవంబర్ 17(సమయజ్యోతి):**

బీహార్‌లో దొడ్డి దారిన ఎన్డీయే కూటమి విజయం సాధించిందని టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ ఆరోపించారు.. ఓట్ చోరీ నీ నిరసిస్తూ గాంధీ భవన్ ముందు యూత్ కాంగ్రెస్ నేతల ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఎన్నికలు జరగాలన్నారు. యువజన కాంగ్రెస్ చేపట్టిన ఈ కార్యక్రమం ప్రజల్ని చైతన్య వంతం చేసే విధముగా ఉందని కొనియాడారు. ఓట్ చోరీపై ప్రజలను చైతన్యవంతం చేస్తూ రాహుల్ గాంధీ ఎనలేని పోరాటం చేస్తున్నారన్నారు. ఓటు విలువ తెలియక ఉండటం శోచనీయమన్నారు. బీహార్ ఎన్నికల్లో సామాన్యులకు తెలియని విషయాలు ఎన్నో ఉన్నాయన్నారు. ఓటు శాతం తక్కువగా వచ్చి ఎన్డీయే సీట్లు గెలవడం వెనక ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. బీహార్‌లో ఓట్ చోరీతో ఎన్డీయే కూటమికి సీట్లు వచ్చాయని ఆరోపించారు. ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా బీహార్ లో ఎన్డీయే కూటమికి సీట్లు గెలుచుకుందన్నారు. దేశ భవిష్యత్ కి విఘాతం కలిగించే విధంగా ఓట్ చోరీ ఉందన్నారు. ఓట్ శాతం మహాఘట్ బంధన్ కి ఎక్కువ వస్తే.. ఎన్డీయే కూటమికి సీట్లు పెరిగాయని మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. సెక్యులర్ ఓట్లను తొలగించారు.. ఓట్ చోరీ తో రాజ్యాంగానికి తూట్లు.. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా తీరు తెన్నులు శోచనీయం.. అధికార బిజెపికి అనుకూలంగా ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా పని చేస్తుంది. దేశం బాగుపడాలంటే ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాల్సిన అవశ్యకత ఉంది.. అధికారం పరమావధిగా మోడీ అమిత్ షా ఓట్ చోరీకి పాల్పడుతున్నారు.. బీహార్ ఎన్డీయే కూటమి గెలుపు అప్రజాస్వామికం.. ఓట్ చోరీ గురించి 8 ఏళ్ల క్రితమే పోరాడాం.. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా బీజేపీకి ఫ్రంట్ ఆర్గనైజర్‌గా పనిచేస్తుంది.. రేపటి నుంచి తెలంగాణలో ఓట్ చోరీ సంతకాల సేకరణ ముమ్మరంగా జరుగుతుంది.. తెలంగాణలో సర్ పేరిట ఓట్లు తొలగించే ప్రమాదం పొంచి ఉందని టీపీసీసీ ఛీఫ్ వ్యాఖ్యానించారు. భాజపా అధికారంలోకి రావడానికి అనేక రకాలుగా ఓట్లు తొలగించి చోరీకి పాల్పడుతోందని తెలంగాణ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా ఓటు చోరీపై కాంగ్రెస్ పార్టీ నిరసనలు తెలపనున్నట్లు చెప్పారు. ఓటు చోరీకి వ్యతిరేకంగా గాంధీభవన్‌లో తెలంగాణ యువజన కాంగ్రెస్ మహా నిరసన కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నంతో పాటు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, పలువురు సీనియర్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ యూత్ కాంగ్రెస్ సైనికులుగా మారి ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి శక్తివంతంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. దేశవ్యాప్తంగా ఓటుచోరీపై నిరసనలు ఉద్ధృతం చేయాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ఇంటింటికి తీసుకెళ్లాలని చెప్పారు. అలాగే, సౌదీ బస్సు ప్రమాదంలో మృతి చెందిన యాత్రికులకు యూత్ కాంగ్రెస్ నివాళులు అర్పించింది.



# సీఐటీయూ నంద్యాల జిల్లా 3 వ మహాసభలు

## కార్పొరేట్లకు అనుకూలంగా బిజెపి ప్రభుత్వాలు

## మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ విమర్శలు

**నంద్యాల,నవంబర్ 17(సమయజ్యోతి):**

కార్పొరేట్లకు బిజెపి కూటమి ప్రభుత్వాలు అనుకూలమని కార్మిక వర్గం చొరవతో రాష్ట్రంలో ప్రత్యామ్నాయ విధానాన్నీ ఏర్పాటు చేయాలని సీఐటీయూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ పిలుపునిచ్చారు. సీఐటీయూ నంద్యాల జిల్లా 3 వ మహాసభలు బేతంచెర్ల లో ప్రారంభమయ్యాయి. మహాసభలు ప్రారంభం సందర్భంగా సిఐటియు సీనియర్ నాయకులు ఎల్లయ్య జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ప్రతినిధుల సభలో మాజీ ఎమ్మెల్యే, సిఐటియు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎం ఏ గఫూర్ మాట్లాడుతూ ఉత్పత్తితో కార్మికుల వేతనాలు ముడి పెట్టాలనే చంద్రబాబు ఆలోచన దుర్మార్గమైందని, ఉన్న పరిశ్రమ మొత్తం ఖర్చుల్లో వేతనాలు ఎంత శతమో ముఖ్యమంత్రి చంద్రబాబు తెలుసుకుంటే ఉక్కు పరిశ్రమ నష్టాలకు కార్మికుల పాత్ర ఉందా లేదా అనేది తెలుస్తుందని ఎం ఏ గఫూర్ అన్నారు. విశాఖ ఉక్కును కాపాడటమంటే కార్మికులను తీసి వేయడం కాదని విశాఖ ఉక్కుకు కేంద్రప్రభుత్వం నుండి గనులు కేటాయింపులు చేస్తే ఆ పరిశ్రమకు సహాయం చేసినవాడిగా చంద్రబాబు నాయుడు చరిత్రల్లో మిగిలిపోతారని గఫూర్ అన్నారు. ఆ పరిశ్రమను సైల్ లో విలీనం చేస్తే దాని మనుగడ కు గ్యారంటీ ఉంటుందన్నారు. విశాఖ ఉక్కు పట్ల చిత్త శుద్ధి ఉంటే చంద్రబాబు కేంద ప్రభుత్వం పైన ఒత్తిడి తెచ్చి సమస్యను పరిష్కారం చేస్తే సహాయం చేసినవాడవుతారన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు గత 25 సంవత్సరాలుగా కనీస వేతనాలు సవరణ చేయలేదని, దీనిపై సీఎం చంద్రబాబుకు ఎలాంటి శ్రద్ధ లేదన్నారు. భవన నిర్మాణ కార్మికుల సెస్సును వారి సంక్షేమనికి కాకుండా రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు మళ్లించడం కార్మికులపై ప్రేమంటే ఇదేనా అని ప్రశ్నించారు. ఇటీవల సిఐఐ సదస్సు ద్వారా లక్షల కోట్లు పెట్టుబడులు సాధించామని గొప్పలు చెప్పుకోవడం కాదని అపరి శ్రమల్లో పని చేసే కార్మికుల సంక్షేమం పట్ల శ్రద్ధ తీసుకోవాలని, ఆ స్పృహ చంద్రబాబు కు లేదని గఫూర్ విమర్శించారు. కేందప్రభుత్వం కార్పొరేట్ అజెండాతో పెట్టుబడి దారులకు లాభాలు చేకూర్చుతూ కార్మికులకు మొండి చెయ్యి చూపించే అజెండా పాలనా సాగిస్తున్నారని ఆరోపించారు. లేబర్ కోడ్ ల పేరుతో కార్మికుల హక్కులను హరించిన మోడీ ప్రభుత్వానికి చంద్రబాబు వత్తాసు పలుకుతున్నాడన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించడానికి కార్మిక చైతన్యంతో పోరాడినప్పుడే కార్మికులకు న్యాయం జరుగుతుందని ఆ దిశగా క్షేత్రస్థాయిలో కార్మికులను ఐక్యం చేయడంలో సీఐటీయూ ప్రధాన భూమిక పోషించాలని ఎం ఏ గఫూర్ పిలుపునిచ్చారు.



# 19న అన్నదాత సుఖీభవ కింద నిధులు జమ

## కడప జిల్లా కమలాపురంలో చంద్రబాబు అందచేత

## అధికారులతో సమీక్షించిన మంత్రి అచ్చన్నాయుడు

**అమరావతి,నవంబర్17(సమయజ్యోతి):**

ఈనెల 19న రెండోవిడత అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని నిర్ణయించింది. అదేరోజు కేంద్రం పిఎం కిసాన్ పథకం కింద రెండు వేలు విడుదల చేయనుంది. దీంతో రాష్ట్రం కూడా ఐదువేలు తమవంతుగా విడుదల చేయనుంది. ఈ నెల 19న 'అన్నదాత సుఖీభవ' పథకం అమలుకు ప్రభుత్వం సన్నద్ధమవుతున్న విషయం తెలిసిందే. అదే రోజు పీఎం కిసాన్ పథకం కింద నిధులను కేంద్రం విడుదల చేయనుంది.ఈ నెల 19న వైయస్సార్ కడప జిల్లా కమలాపురం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, అధికారులు, ప్రజాప్రతినిధుల తో కలిసి రైతుల ఖాతాల్లో నిధులను జమచేయ నున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి అచ్చన్నాయుడు తెలిపారు. అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకం రెండో విడత అమలుపై వ్యవసాయ శాఖ అధికారులతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం సమీక్ష నిర్వహించారు. టెలీ కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్, అన్ని జిల్లాల వ్యవసాయ శాఖ జేడీలకు మంత్రి దిశానిర్దేశర చేశారు. అలాగే.. అర్హులైన రైతులు చనిపోయిన పక్షంలో వారి వారసులకు డెత్ మ్యూటేషన్ చేసి ఈ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఎన్‌పీసీఏలో ఇన్ యాక్టివ్‌గా ఉన్న ఖాతాలను యాక్టివేట్ చేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అన్నదాత సుఖీభవ పథకం అర్హత ఉన్నవారు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే విధానాన్ని సులభతరం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రెండో విడత 46,62,904 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ విడతలో రాష్ట్రం వాటా రూ.5 వేలు, కేంద్రం వాటా రూ.2 వేలు మొత్తం రూ .7 వేలు అన్నదాత సుఖీభవ నిధులు రైతుల ఖాతాల్లోకి జమకానున్నాయి. అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకం కింద రూ.3077.77 కోట్లు రైతుల ఖాతాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జమ చేయనున్నాయి.

# నేడు టిటిడి ఆర్జిత సేవా టిక్కెట్లు విడుదల

## ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటేనే లభ్యం

**తిరుమల,నవంబర్17(సమయజ్యోతి):**

కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవారి ఆర్జిత సేవ టికెట్లను తిరుమల తిరుపతి దేవస్థానం మంగళవారం విడుదల చేయనుంది. ఈ నెల 18న ఉదయం 10 గంటలకు ఆర్జిత సేవలైన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవల ఫిబ్రవరి కోటా టికెట్లను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచనుంది. ఆసక్తి కలిగిన భక్తులు వీటిని బుక్ చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. ఆర్జిత సేవా టికెట్లను ఎలక్ట్రానిక్ లక్కీడిప్ ద్వారా జారీ చేస్తారు. లక్కీడిప్ రిజిస్ట్రేన్‌కు ఈనెల 20 ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవచ్చు. టికెట్లు పొందిన భక్తులు నవంబర్ 20 నుంచి 22 మధ్యాహ్నం 12 గంటలలోపు నగదు చెల్లించాల్సి ఉంటుంది. ఇక కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవ, శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవం టికెట్లను ఈ నెల 21న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటా విడుదల మధ్యాహ్నం 3 గంటలకు ఉంటుంది.అదేవిధంగా అంగప్రదక్షిణ టోకెన్ల కోటాను 24న ఉదయం 10 గంటలకు, శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శనం టికెట్ల కోటాను 11 గంటలకు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్లను నవంబర్ 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. ప్రత్యేక ప్రవేశదర్శనం రూ.300 టికెట్ల కోటాను నవంబర్ 25న ఉదయం 10 గంటలకు టీటీడీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. తిరుమల, తిరుపతిల్లో అద్దె గదుల బుకింగ్ కోటా మధ్యాహ్నం 3 గంటలకు జారీ అవుతుంది. భక్తుల వెబ్‌సైట్‌లోనే ఆర్జిత సేవలు, సేవా టికెట్లను బుక్ చేసుకోవాలని టీటీడీ వెల్లడించింది.

# సౌదీ ప్రమాద ఘటనపై చంద్రబాబు దిగ్భ్రాంతి

## సంతాపం వ్యక్తం చేసిన పవన్ కళ్యాణ్

**అమరావతి,నవంబర్17(సమయజ్యోతి):**

సౌదీ అరేబియాలో జరిగిన బస్సు ప్రమాదంపై ఏపీ సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. ఉమ్రా యాత్రకు వెళ్లిన వారు మరణించడం బాధాకరమన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. సౌదీ అరేబియాలో జరిగిన ప్రమాదంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో పలువురు యాత్రికులు మరణించడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ సంతాపం వ్యక్తం చేశారు. మృతులకు నివాళులర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సౌదీ అరేబియాలో విషాద ఘటన చోటుచేసుకుంది. మదీనాకు సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 45 మంది హైదరాబాదీలు మృతిచెందారు. యాత్రికులతో వెళ్తోన్న బస్సు.. డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో ఈ దుర్ఘటన జరిగింది.

# పోలీసులకు సవాల్ విసిరే స్థాయికి పైరసీ ముఠాలు

## హైదరాబాద్ పోలీస్ కమిషనర్

## సజ్జన్నార్ ఆపరేషన్ సక్సెస్

## అభినందనలు తెలిపిన డిప్యూటి

## సిఎం పవన్ కళ్యాణ్

**అమరావతి,నవంబర్17(సమయజ్యోతి):**

పోలీసులకు సైతం సవాల్ విసిరే స్థాయికి పైరసీ ముఠాలు వచ్చిన తరుణంలో హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసుబృందం, హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్ చేపట్టిన ఆపరేషన్ విజయవంతమవడంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సంతోషం వ్యక్తంచేశారు. ఐబొమ్మ నిర్వాహకుడి అరెస్ట్ నేపథ్యంలో తాజాగా సినీ ప్రముఖులు హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్‌తో భేటీ అయ్యారు. వారంతా పోలీసుశాఖకు ధన్యవాదాలు తెలిపారు. ఈ క్రమంలో పవన్‌కల్యాణ్ ఎక్స్ వేదికగా స్పందించారు. డబ్బుల రూపంలోనే కాదు, సృజనాత్మకతనూ పెట్టుబడిగా పెట్టి నిర్మించే సినిమాలు విడుదలైన రోజే ఆన్‌లైన్‌లోకి వచ్చేస్తున్నాయి. దీనివల్ల చిత్ర పరిశ్రమ తీవ్రంగా నష్టపోతోంది. సినిమా విడుదలే ఒక మహాయజ్ఞంగా మారిపోయిన తరుణంలో పైరసీ ముఠాలను కట్టడి చేయడం దర్శకనిర్మాతలకు సాధ్యం కావడం లేదు. పైరసీలో కీలకంగా ఉన్న ఐబొమ్మ, బప్పమ్ వెబ్‌సైట్ల నిర్వాహకుడిని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేసి, వాటిని మూయించివేయడం స్వాగతించదగ్గ పరిణామం. పోలీసులకు సైతం సవాల్ విసిరే స్థాయికి పైరసీ ముఠాలు వచ్చిన తరుణంలో హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసుబృందం చేసిన ఆపరేషన్ విజయ వంతమైంది. ఈ ఆపరేషన్‌లో భాగమైన పోలీసులకు, సిటీ కమిషనర్ వి.సి.సజ్జనార్‌కి అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. బెట్టింగ్ మాఫియా, పోంజీ స్కీమ్స్ లాంటివాటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి, వాటివల్ల ప్రజలు ఏవిధంగా ఆర్థికంగా చితికిపోతున్నారో చైతన్యపరుస్తున్నారు. పోంజీ స్కీమ్స్ మూలంగా ప్రజలు ఆర్థికంగా ఏవిధంగా మోసానికి గురై నష్టపోతున్నారో ఆయన ఓ సందర్భంలో వివరించారు. అలాగే బెట్టింగ్ యాప్స్‌ను నియంత్రించేందుకు సజ్జనార్ చేపట్టిన కార్యక్రమం అన్ని రాష్ట్రాల్లోన్రూ కదలిక తీసుకువచ్చింది. ఆయన నేతృత్వంలో చేపట్టే చర్యలు కచ్చితంగా తెలుగు సినిమాకే కాదు యావత్ భారతీయ చిత్ర పరిశ్రమకు మేలు చేస్తాయని పవన్‌కల్యాణ్ ప్రశంసించారు. పైరసీతో సినీరంగానికి చాలా నష్టం జరిగిందని, దీన్ని కట్టడి చేయడంలో భాగంగా ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవిని అరెస్టు చేసినట్లు పోలీస్ కమిషనర్ సజ్జనార్ మీడియాకు తెలిపారు. అతడిపై ఐటీ యాక్ట్, కాపీ రైట్ యాక్ట్ కింద మరో 4 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

# సినీ కార్మికుల కష్టాన్ని దోచుకుంటున్న పైరసీకారులు

## ఐబొమ్మ రవి అరెస్ట్ తో అప్రమత్తం కావాలి

## పైరసీ ద్వారా వ్యక్తిగత సమాచారం కూడా చోరీ

## కమిషన్‌ను కలిసి అభినందించిన చిరంజీవి తదితరులు

**హైదరాబాద్,నవంబర్17(సమయజ్యోతి):**

సినీ ఇండస్ట్రీ మీద చాలామంది ఆధారపడి ఉన్నారని వాళ్ల కష్టాన్ని దౌర్జన్యంగా దోచుకుంటుంటే బాధగా ఉంటుందని చిరంజీవి అన్నారు. ఐబొమ్మ నిర్వాహకుడి అరెస్ట్ నేపథ్యంలో తాజాగా సినీ ప్రముఖులు హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్‌తో భేటీ అయ్యారు. ఈ మీటింగ్ అనంతరం చిరంజీవి మాట్లాడారు. అంతకుముందు సౌదీ ప్రమాదంలో మృతులకు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఈ పైరసీ నుంచి ఎలా తప్పించుకోవాలని ఆలోచిస్తూనే ఉన్నాం. ఇండస్ట్రీ మీద పరోక్షంగా, ప్రత్యక్షంగా లక్షల మంది ఆధారపడి ఉన్నారు. లైట్‌బాయ్ దగ్గర నుంచి పెద్దపెద్ద డైరెక్టర్ల వరకూ ఇండస్ట్రీపై ఆధారపడి ఉన్నారు. ఇంతమంది కష్టాన్ని ఒకడు దౌర్జన్యంగా దోచుకోవడం.. తిరిగి పోలీసులకే సవాలు విసరడాన్ని తట్టుకోలేకపోయాం. ఇలాంటి సమయంలో గత సీపీ సీవీ ఆనంద్ అనంతరం సజ్జనార్ చాలా కృషి చేసి నిందితుడిని పట్టుకున్నారు. ఈ కేసులో పనిచేసిన ప్రతిఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు. ప్రజలు కూడా సినిమా తమదిగా భావించాలి, పైరసీ చూడొద్దు. ఈ ఏడాది కూడా చాలా సినిమాలు పైరసీ చేశారు. దీనివల్ల ఎంతో నష్టం జరిగింది. త్వరలో రాజమౌళి గొప్ప సినిమా తీయనున్నారు. అప్పుడు మన ఖ్యాతి ఖండాంతరాలు విస్తరిస్తుంది. ఆ సమయంలోను పైరసీ పెనుసవాలుగా ఉంటుంది. ఇండస్ట్రీ బాధను అర్థం చేసుకున్నందుకు పోలీసులను అభినందిస్తున్నట్లు చిరంజీవి అన్నారు. పోలీసులకు ధన్యవాదాలు. ఇది సినిమాలో సూపర్ హిట్ సన్నివేశంలా ఉంది. విలన్ ఛాలెంజ్ చేస్తే రెండు నెలల తర్వాత హీరో అతడిని కటకటాల వెనక వేసినట్లు ఉంది. భస్మాసురుడి హస్తంలా తన తలమీద తనే చేయిపెట్టుకున్నాడు. పోలీసులతో ఆటలొద్దు. ఈ సందర్భంగా ఒక్కటే చెప్పాలనుకుంటున్నా.. ఏదీ ఉచితంగా రాదు. ఒకవేళ అలా వస్తే దాని వెనక పెద్ద ప్రమాదం పొంచి ఉంటుంది. అది చావు వరకూ తీసుకెళ్తుంది. 'సినిమాలేగా ఏముంది ఫ్రీగా చూస్తున్నాం' అని అందరూ అనుకుంటున్నారు. పైరసీ చేసే వాళ్లేం సంఘసేవ చేయడం లేదు. పెద్దపెద్ద సర్వర్లు ఉపయోగించి పైరసీ చేస్తున్నారు. దానికి డబ్బు ఎక్కడ నుంచి వస్తుంది? మేము వాళ్లకు డబ్బులు ఇవ్వడం లేదు.. మా సినిమాలను పైరసీ చేసి సంపాదిస్తున్నారు. అంటే మీరు ఇస్తున్నారు. మీ వ్యక్తిగత డేటాను అమ్మడం వల్ల ఇస్తున్నారు. ఈ పర్సనల్ డేటా అంటే చాలా మందికి తెలియకపోవచ్చు. మీ పేరు, ఫోన్ నంబర్, ఆధార్ నంబర్, ఈ–మెయిల్ ఐడీ ఉంటే చాలు మీరు సైబర్ బారిన పడతారు. ఈ డేటాను క్రిమినల్స్‌కు అమ్ముతున్నారు. మీరు నంబరే కదా అని ఎంటర్ చేస్తున్నారు. దాని మూలంగా ఎన్నో అనర్థాలు జరుగుతున్నాయి. డబ్బులు పోవడమే కాదు.. ప్రాణాలు పోయే వరకూ వెళ్తోంది. ఈ పైరసీ వల్ల మాకంటే మీరే ఎక్కువ నష్టపోతున్నారు. అర్థం చేసుకోండి. ఇలాంటి పైరసీ వెబ్‌సైట్లలో ఉచితంగా సినిమాలు చూసి ఇబ్బందుల్లో పడకండని రాజమౌళి సినీ అభిమానులకు సూచించారు.

# విశాఖ ఉక్కును ప్రైవేటీకరించడం లేదు

## ఎపి ప్రభుత్వం కీలక ప్రకటన విడుదల

**అమరావతి,నవంబర్17(సమయజ్యోతి):**

విశాఖ ఉక్కు పరిశ్రమపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఈ సంస్థను ప్రైవేటైజేషన్ చేయడం లేదని.. ప్రగతి వైపు ప్రస్థానం సాగిస్తుందని స్పష్టం చేసింది. ఎన్డీయే ప్రభుత్వ సహకారంతో వైజాగ్ స్టీల్ ప్లాంట్ బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 17 నెలల్లో ఉక్కు పరిశ్రమకు రూ.15 వేల కోట్ల సాయం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించినట్లు తెలిపింది. ఇక ఓవరాల్ కెపాసిటీ యుటిలైజేషన్‌ను 17 నెలల్లో 48 నుంచి 79 శాతానికి పెంచినట్లు సోదాహరణగా వివరించింది. దేశంలో మరే పబ్లిక్ సెక్టార్ కంపెనీకీ ఇవ్వని స్థాయిలో ప్రభుత్వాలు ఈ ఆర్థిక సాయం అందించినట్లు ప్రకటించింది. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ యాజమాన్యం ఇటీవల ఒక సర్క్యులర్ జారీ చేసింది. ఇది కార్మికుల్లో ఆందోళనకు కారణమైనట్లు తెలుస్తోంది. ఉత్పత్తికి అనుగుణంగానే జీతాలు చెల్లిస్తామని ఆ సర్క్యులర్‌లో యాజమాన్యం పేర్కొన్నట్లు కార్మిక సంఘాలు చెబుతున్నాయి. దీని వల్ల నష్టపోతామని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. దాంతో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈరోజు (సోమవారం) ఉక్కు కార్యాలయం ముట్టడికి కార్మిక సంఘాలు పిలుపు నిచ్చాయి. స్టీల్ ఎ÷–లాంట్‌ను ప్రైవేటీకరణ చేసేది లేదని సీఎం చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు. తాజాగా విశాఖ ఉక్కు యాజమాన్యం తీసుకొచ్చిన ఆదేశాలతో ప్రస్తుతం ఈ వివాదం రేగింది. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో తమందరికీ యాజమాన్యం పూర్తి జీతాలు అందజేసిందని కార్మిక సంఘాలు చెబుతున్నాయి. నవంబర్ నుంచి మాత్రం అందుకు భిన్నంగా జీతాలు చెల్లింపు ఉంటుందని యాజమాన్యం చెబుతోందని కార్మిక సంఘాలు అంటున్నాయి. ఉత్పత్తికి అనుగుణంగానే జీతాల చెల్లింపులు ఉంటాయని సంస్థ జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేయడంపై వారంతా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నిర్ణీత లక్ష్యానికి అనుగుణంగా 100 శాతం ఉత్పత్తి జరిగితేనే 100 శాతం జీతాలు ఇస్తామని యాజమాన్యం ఉత్తర్వుల్లో పేర్కొందని చెబుతున్నారు. దాని వల్ల తాము నష్టపోవాల్సి వస్తుందని వాపోతున్నారు కార్మికులు. ముడి పదార్థాలు సరిగ్గా అందుబాటులో లేవని.. తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. దీని వల్ల లక్షిత ఉత్పత్తి సాధించడం సాధ్యం కావడం లేదని చెబుతున్నారు. ముడి సరకు అందుబాటులో ఉండి.. సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ఉంటే.. ఉత్పత్తి సాధ్యమవుతుందని కార్మిక సంఘాలు స్పష్టం చేస్తున్నాయి. అలాంటి వేళ.. ప్రభుత్వం విశాఖ ఉక్కుపై కీలక ప్రకటన చేసినట్లు తెలుస్తోంది.

# సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఉచిత ఉపకరణాలు

## ప్రత్యేక అవసరాల పిల్లలకు పంపిణీ

## సమగ్ర శిక్ష ఏపీసీ ఎం.రజనీకుమారి

**విజయవాడ,నవంబర్ 17(సమయజ్యోతి):**

ఎన్‌టీఆర్ జిల్లాలో ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులకు అయిదు ప్రాంతాల్లో ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరాలు నిర్వహించనున్నట్లు సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎం.రజనీకుమారి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్లలోపు ఉండి, సదరం సర్టిఫికెట్ ఉన్న, పాఠశాలలో నమోదైన విద్యార్థులు అర్హులని తెలిపారు. పూర్తి వివరాల కోసం తమ మండల భవిత కేంద్రాల్లోని ఐఈఆర్‌పీలను సంప్రదించవచ్చన్నారు. విజయవాడ అర్బన్‌కు సంబంధించి ఈ నెల 18న ఎంకే బేగ్ హైస్కూల్లో శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 19న మైలవరం లక్కిరెడ్డి హనిమిరెడ్డి హైస్కూల్లో, ఈ నెల 20న తిరువూరు నియోజకవర్గంలోని కంభంపాడు జెడ్‌పీహెచ్‌ఎస్‌లో శిబిరాలు ఉంటాయన్నారు. ఇదేవిధంగా ఈ నెల 21న నందిగామ జెడ్‌పీహెచ్‌ఎస్, నవంబర్ 22న జగ్గయ్యపేట నియోజకవర్గంలోని చిల్లకల్లు జెడ్‌పీహెచ్‌లో శిబిరాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఆయా నియోజకవర్గాల పరిధిలోని వారు శిబిరాలను సద్వినియోగం చేసుకొని అలిమ్కో ద్వారా ఉచితంగా ఉపకరణాలు పొందేందుకు తగిన ధ్రువీకరణపత్రాలతో పేర్లు నమోదు చేయించుకోవాలని రజనీకుమారి తెలిపారు.

# హత్యలు చేసి డోర్ డెలివరీ చేసిన వైసిపి

## గత ప్రభుత్వంపై మంత్రి సత్యకుమార్ విమర్శలు



**విజయవాడ,నవంబర్ 17(సమయజ్యోతి):**

జగన్ హయాంలో హత్యలు చేసి డోర్ డెలివరీ చేశారని సంచలన ఏపీ వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యలు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎస్సీ, ఎస్టీలకు పెద్దపీట వేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలని పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. సోమవారం విజయవాడలో మంత్రి సత్యకుమార్ యాదవ్ పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.రానున్న రోజుల్లో స్వర్ణాంధ్రప్రదేశ్‌ని వికసిత్ భారత్‌గా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ఈనేపథ్యంలోనే రూ.87 కోట్లని కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. 740 ఏకలవ్య మోడల్ స్కూల్స్ తీసుకువచ్చి గిరిజన విద్యార్థుల విద్యని అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. సోళ్ల బుజ్జిరెడ్డికి ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా పదవీ ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. అవగాహన కలిగిన అనుభవం ఉన్న వాళ్లని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎంపిక చేశారని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

# ఎమ్మెల్యే భార్యకు డిజిటల్ అరెస్ట్ వేధింపులు

## ఏడుగురిని అరెస్ట్ చేసిన కడప పోలీసులు

**కడప,నవంబర్ 17(సమయజ్యోతి):**

డిజిటల్ అరెస్టు పేరుతో పలువురిని సైబర్ క్రిమినల్స్ ఇటీవల మోసం చేస్తున్నారు. సైబర్ నేరస్తుల బారిన పడి బాధితులు పెద్దమొత్తంలో నష్టపోతున్నారు. తాజాగా తెలుగుదేశం పార్టీ మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ భార్యను సైతం డిజిటల్ అరెస్ట్ చేశారు. ఈ మేరకు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు పుట్టా సుధాకర్ యాదవ్ . ఎమ్మెల్యే ఫిర్యాదు మేరకు ఏడుగురిని అరెస్ట్ చేశారు కడప జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులు. డిజిటల్ అరెస్ట్‌కు పాల్పడిన నిందితుల్లో ఢిల్లీకు చెందిన ఐడీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. తమ నుంచి సైబర్ నేరస్తులు రూ. 1.7 కోట్లు మోసం చేశారని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు.

# మైఖేల్ వాన్ నోటి దురుసు



భారత్ అంటే ఎప్పుడూ అక్కసు వెళ్లగక్కే ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్ మరోసారి తన నోటికి పని చెప్పాడు. సౌతాఫ్రికాతో తొలి టెస్ట్‌లో టీమిండియాకు ఎదురైన పరాజయంపై తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించాడు. అనుకూలంగా ఉండే పిచ్‌లను తయారు చేసుకొని ప్రత్యర్థులను ఓడించాలని భావిస్తే ఇలాంటి పరాజయాలే ఎదురువుతాయని శాపనార్థాలు పెట్టాడు. టీమిండియాకు తగిన శాస్తి జరిగిందని ట్వీట్ చేశాడు.'ఇలాంటి చెత్త పిచ్‌ను తయారు చేసినందుకు వరల్డ్ ఛాంపియన్స్ చేతిలో మీరు ఓడిపోవాల్సిందే.'అని మైఖేల్ వాన్ ట్వీట్ చేశాడు. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా కోల్‌కతా వేదికగా ఆదివారం ముగిసిన తొలి మ్యాచ్‌లో బ్యాటింగ్ వైఫల్యంతో టీమిండియా 30 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. 124 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించలేకపోయింది. పూర్తిగా స్పిన్‌కు అనుకూలంగా ఉండే వికెట్‌ను తయారు చేయించుకున్న టీమిండియా నలుగురి స్పిన్నర్లతో బరిలోకి దిగిన సౌతాఫ్రికాను ఓడించాలనుకుంది. అందుకు తగ్గట్లుగానే తొలి ఇన్నింగ్స్‌లో 30 పరుగుల స్వల్ప ఆధిక్యాన్ని అందుకొని తొలి రెండు రోజుల ఆటలో పూర్తి ఆధిపత్యం చెలాయించింది.మ్యాచ్ ప్రారంభానికి నాలుగు రోజుల ముందు నుంచి పిచ్‌పై వాటరింగ్ చేయకపోవడంతో బ్యాటింగ్‌కు ప్రతికూలంగా మారింది. పిచ్‌పై పగుళ్లు ఏర్పడి తొలి రోజు నుంచే బంతి టర్న్ అవ్వడంతో పాటు అనూహ్యంగా బౌన్స్ అయ్యింది. దాంతో పరుగులు రాబట్టేందుకు బ్యాటర్లు తెగ ఇబ్బంది పడ్డారు. అయితే తమ గోతిలో తామే పడ్డట్లు టీమిండియా ఈ స్పిన్ ఉచ్చును తమ మెడకే బిగించుకొని మూల్యం చెల్లించుకుంది. నాలుగో ఇన్నింగ్స్ సమయంలో పిచ్ మరింత ప్రమాదకరంగా మారడంతో భారత బ్యాటర్లు 124 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని చేధించలేకపోయారు.మరోవైపు ఈ పిచ్‌పై వచ్చిన విమర్శలను గంభీర్ తప్పుబట్టాడు. ఈ పిచ్ మరీ అంత ప్రమాదకరంగా లేదని, ఓపికగా బ్యాటింగ్ చేస్తే పరుగులు రాబట్టవచ్చని చెప్పాడు. ఈ పరాజయంతో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ) పాయింట్స్ టేబుల్‌లో టీమిండియా నాలుగో స్థానానికి పడిపోయింది. గతంలో స్పిన్ బౌలింగ్ ఆడలేకనే న్యూజిలాండ్ చేతిలో 3-0తో క్లీన్ స్వీప్ అయిన భారత్.. మరోసారి స్పిన్ ఉచ్చులోనే పడి మూల్యం చెల్లించుకుంది. భారత క్రికెట్ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా తొలిసారి క్లీన్ స్వీప్ అయ్యింది.

# గువాహటి టెస్ట్‌కు టీమిండియా కసరత్తు

కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో సౌతాఫ్రికా చేతిలో తొలి టెస్ట్ మ్యాచ్ ఓడిపోయిన భారత క్రికెట్ జట్టు, ఇప్పుడు రెండో టెస్ట్ కోసం తీసుకుంటున్న నిర్ణయం నిజంగా ఆశ్చర్యకరం. ఈ నిర్ణయం వల్ల గువాహటిలో జరగబోయే చివరి టెస్ట్‌లో కూడా టీమిండియా ఓడిపోయే ప్రమాదం ఉందని క్రికెట్ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నివేదికల ప్రకారం భారత జట్టు సాధారణంగా మ్యాచ్ ముగిసిన వెంటనే తదుపరి వేదికకు వెళ్తుంది. కానీ ఈసారి కోల్‌కతాలో ఓడిపోయిన తర్వాత కూడా టీమిండియా అక్కడే ఉండిపోయింది. మంగళవారం రోజు ఈడెన్ గార్డెన్స్‌లోనే ప్రాక్టీస్ చేయాలని జట్టు నిర్ణయించుకుంది. జట్టు కోల్‌కతాలో ప్రాక్టీస్ చేయాలని నిర్ణయించడం చూస్తుంటే, గువాహటిలో కూడా కోల్‌కతా పిచ్‌లాంటిదే తయారు చేయాలని మేనేజ్‌మెంట్ ప్లాన్ చేస్తున్నట్లు అనుమానాలు వస్తున్నాయి. కోల్‌కతాలో స్పిన్‌కు అనుకూలించిన పిచ్‌పై భారత బ్యాట్స్‌మెన్ ఘోరంగా విఫలమయ్యారు. అయినా సరే, గువాహటిలో కూడా స్పిన్ ఫ్రెండ్లీ పిచ్‌నే తయారు చేయాలని టీమిండియా మొగ్గు చూపుతుండటం ఆందోళన కలిగిస్తోంది. గువాహటిలో భారత్-సౌతాఫ్రికా మధ్య రెండో, చివరి టెస్ట్ మ్యాచ్ నవంబర్ 22 నుంచి ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌లో కూడా స్పిన్‌కు అనుకూలించే వికెట్‌ను తయారు చేస్తే, భారత బ్యాట్స్‌మెన్‌కు మళ్లీ కష్టాలు తప్పకపోవచ్చు. గతంలో న్యూజిలాండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో భారత్ 0-3 తేడాతో ఓడిపోయింది. వెస్టిండీస్‌పై గెలిచినా, వారికి నాణ్యమైన స్పిన్నర్లు లేరు. కానీ ఇప్పుడు సౌతాఫ్రికా జట్టులోని స్పిన్నర్లు భారత బ్యాట్స్‌మెన్‌ను బాగా ఇబ్బంది పెడుతున్నారు. ఇలాంటి సమయంలో కూడా పిచ్ స్వభావాన్ని మార్చకుండా స్పిన్ పిచ్‌పైనే ఆధారపడాలని అనుకోవడం క్లీన్ స్వీప్ ప్రమాదాన్ని కొనితెచ్చుకున్నట్లేనని విమర్శలు వినిపిస్తున్నాయి.టీమిండియాకు మరో ముఖ్యమైన ఆందోళన ఏమిటంటే రెగ్యులర్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రెండో టెస్ట్‌కు అందుబాటులో ఉండకపోవడం. తొలి టెస్ట్ సమయంలో ఆయన మెడకు గాయం కావడంతో ఐసీయూలో కూడా చికిత్స తీసుకున్నారు. దీంతో గువాహటి టెస్ట్‌లో గిల్ ఆడటం కష్టమే అని తెలుస్తోంది. ఒకవేళ గిల్ ఆడకపోతే అతని స్థానంలో యువ ఆటగాళ్లు సాయి సుదర్శన్ లేదా దేవదత్ పడిక్కల్‌లో ఒకరికి తుది జట్టులో అవకాశం దక్కే ఛాన్స్ ఉంది. కెప్టెన్ లేకపోవడం, పైగా పిచ్ విషయంలో రిస్క్ తీసుకోవడం.. ఇవన్నీ కలిపి గువాహటి టెస్ట్ ఫలితాన్ని ఎలా ప్రభావితం చేస్తాయో చూడాలి.



## భారత్ ఛేదించలేకపోయిన స్వల్ప టార్గెట్స్

నగరంలోని ఈడెన్ గార్డెన్స్‌లో భారత్ వర్సెస్ సౌత్ ఆఫ్రికా మొదటి టెస్ట్ మ్యాచ్‌లో ఆతిథ్య జట్టుకు ఓటమి తప్పలేదు. టీమిండియా విజయం సాధించడానికి కేవలం 124 పరుగులు మాత్రమే కావాలి. కానీ స్వల్ప లక్ష్యాన్ని భారత్ ఛేదించలేకపోవడాన్ని అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. సున్నా స్కోరు వద్ద యశస్వి జైస్వాల్, 1 పరుగుల వద్ద కెఎల్ రాహుల్ అవుట్ అయ్యారు. కేవలం ఒక్క పరుగుకే ఓపెనర్లకు కోల్పోయిన భారత్ నాల్గవ వికెట్ 38 స్కోరు వద్ద పడింది. దాంతో ఆశలు కోల్పోయారు. చిన్న టార్గెట్ కూడా కొండంతలా అనిపించింది. భారత్ మీద అత్యల్ప స్కోరును డిఫెండ్ చేసుకున్న జట్టు వెస్టిండీస్. టెస్ట్ క్రికెట్‌లో అత్యల్ప పరుగులను కాపాడుకుంటూ గెలిచిన జట్టు ఆస్ట్రేలియా, వారు ఇంగ్లాండ్‌ను 77 పరుగులకు ఆలౌట్ చేశారు. ఈ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ గెలవడానికి కేవలం 85 పరుగులు చేయాల్సి ఉంది, అయితే ఈ మ్యాచ్ చాలా సంవత్సరాల క్రితం 1882లో జరిగింది. భారత్‌పై అత్యల్ప స్కోరును కాపాడుకుంటూ గెలిచిన జట్టు వెస్టిండీస్. 1997లో కరీబియన్ జట్టు భారత్‌ను 81 పరుగులకు ఆలౌట్ చేసింది. ఈ మ్యాచ్‌లో లక్ష్యం 120 పరుగులు కాగా, ఇండియా ఈ మ్యాచ్‌లో 38 పరుగుల తేడాతో ఓడిపోయింది. మార్చి 27-31, 1997న జరిగిన ఆ మ్యాచ్‌లో సచిన్ టెండూల్కర్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 4 పరుగులు మాత్రమే చేశాడు.

# హార్దిక్ రీ-ఎంట్రీ ఇవ్వనున్నడా?



భారత్ వర్సెస్ సౌతాఫ్రికా మధ్య వన్డే సిరీస్ మొదలవ్వడానికి ఇంకో రెండు వారాల కన్నా తక్కువ సమయమే మిగిలి ఉంది. ఈ నేపథ్యంలో బీసీసీఐ త్వరలోనే వన్డే, టీ20 జట్లను ప్రకటించే అవకాశం ఉంది. ఈ సిరీస్ ద్వారా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ చాలా కాలం తర్వాత సొంత గడ్డపై వన్డేలు ఆడబోతుండటంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ఆస్ట్రేలియా టూర్‌లో గాయపడిన శ్రేయస్ అయ్యర్ ఈ సిరీస్‌కు అందుబాటులో ఉండకపోవచ్చు. ఆయన స్థానంలో ఎవరు వస్తారు, అలాగే స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, వికెట్ కీపర్ రిషబ్ పంత్ తిరిగి జట్టులోకి వస్తారా అనే అంశాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.చాలా రోజుల తర్వాత హార్దిక్ పాండ్యా, రిషబ్ పంత్ వంటి కీలక ఆటగాళ్లు జట్టులోకి తిరిగి వచ్చే అవకాశం ఉంది. గాయం కారణంగా ఆస్ట్రేలియా పర్యటనకు దూరమైన హార్దిక్ పాండ్యా ఇప్పుడు పూర్తిగా కోలుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. కాబట్టి సౌతాఫ్రికా సిరీస్‌లో వన్డే, టీ20 ఫార్మాట్‌లలో ఆయన తిరిగి జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. ఇంగ్లాండ్ టూర్‌లో గాయపడి, టెస్ట్ క్రికెట్‌లోకి రీ-ఎంట్రీ ఇచ్చిన రిషబ్ పంత్.. వన్డే జట్టులో కూడా చోటు దక్కించుకోవచ్చు. భారత వన్డే జట్టులో ఇన్నింగ్స్‌ను రోహిత్ శర్మ, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ప్రారంభిస్తారు. గిల్ సౌతాఫ్రికా టెస్టుకు గాయపడ్డా, వన్డే సిరీస్‌కు అందుబాటులో ఉండే అవకాశం ఉంది. విరాట్ కోహ్లీ మూడో స్థానంలో ఆడతారు. నాలుగో స్థానంలో ఆడే శ్రేయస్ అయ్యర్ గాయం కారణంగా దూరమవ్వడంతో ఆయన స్థానంలో ఎవరు వస్తారనేది ఆసక్తికరం. నాలుగో స్థానానికి వికెట్ కీపర్ రిషబ్ పంత్ మంచి ఎంపికగా మారే అవకాశం ఉంది.జస్ప్రీత్ బుమ్రా సౌతాఫ్రికా టెస్ట్ సిరీస్‌లో ఆడుతున్నందున, ఆయన వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ కోసం వన్డే సిరీస్‌కు విశ్రాంతి తీసుకుని టీ20 సిరీస్‌లో తిరిగి వచ్చే అవకాశం ఉంది. భారత్, సౌతాఫ్రికా జట్ల మధ్య జరగనున్న వన్డే సిరీస్ నవంబర్ 30న ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌లోని మొదటి వన్డే నవంబర్ 30న మధ్యాహ్నం 1:30 గంటలకు రాంచీలో జరగనుంది. ఆ తర్వాత రెండో వన్డే మ్యాచ్ డిసెంబర్ 3న అదే సమయానికి అంటే మధ్యాహ్నం 1:30 గంటలకు రాయ్‌పూర్ వేదికగా జరుగుతుంది. ఇక సిరీస్‌లో చివరిదైన మూడో వన్డే డిసెంబర్ 6న మధ్యాహ్నం 1:30 గంటలకు విశాఖపట్నంలో జరగనుంది. మూడు మ్యాచ్‌లూ మధ్యాహ్నం 1:30 గంటలకే మొదలవుతాయి.

# స్పిన్నర్ అమిత్ శుక్లా విధ్వంసం

రంజీ ట్రోఫీలో హర్యానా జట్టు అమిత్ శుక్లా అనే డేంజరస్ ప్లేయర్‌ను ఎదుర్కోలేక చతికిల పడింది. అవును, ఈ ఎడమచేతి వాటం బౌలర్ అద్భుతంగా బౌలింగ్ చేయడంతో మొత్తం హర్యానా జట్టు 111 పరుగులకే ఆలౌట్ అయింది. అమిత్ శుక్లా మొదటి ఇన్నింగ్స్‌లో కేవలం 27 పరుగులకు 8 వికెట్లు పడగొట్టాడు. ముఖ్యమైన విషయం ఏమిటంటే ఈ ఆటగాడు తన ఐదు వికెట్లను కేవలం ఐదు ఓవర్లలోనే పడగొట్టాడు. ఈ ఐదు ఓవర్లలో అతను ఒక్క పరుగు కూడా ఇవ్వకపోవడం గమనార్హం. అమిత్ శుక్లా ఈ డేంజరస్ బౌలింగ్ కారణంగా, సర్వీసెస్ హర్యానాపై 94 పరుగుల ఆధిక్యాన్ని పొందింది. జట్టు కేవలం 205 పరుగులకే పరిమితమైంది.అమిత్ శుక్లా రెండో బంతి నుంచే హర్యానాను ఇబ్బందుల్లోకి నెట్టాడు. మొదట ఓపెనర్ యువరాజ్ సింగ్‌ను 1 పరుగుకే అవుట్ చేశాడు. ఆ తర్వాత మయాంక్ శాండిల్య, యశ్వర్ధన్ దలాల్, ధీరు సింగ్, నిఖిల్ కశ్యప్‌లను అవుట్ చేశాడు. అమిత్ శుక్లా తన మొదటి 5 మెయిడెన్ ఓవర్లు వేసి ఐదు వికెట్లు తీసుకున్నాడు. ఆ తర్వాత శుక్లా తన ఐదు వికెట్ల పరుగును పూర్తి చేసిన తర్వాత మరో మూడు వికెట్లు పడగొట్టాడు, కపిల్ హుడా, పార్థ్ శివ్, అన్షుల్ కాంబోజ్‌లను అవుట్ చేసి హర్యానాను 111 పరుగులకే ఆలౌట్ చేశాడు. అమిత్ శుక్లా 14 సంవత్సరాలు క్రికెట్ బంతిని ముట్టుకోలేదు. ఆ తర్వాత, అతను లక్నోలోని ఇండియన్ ఆర్మీ మైదానంలో ప్రాక్టీస్ చేయడం ప్రారంభించాడు. అమిత్ శుక్లా తండ్రి, స్వయంగా ఆర్మీ సైనికుడు, తన కొడుకు క్రికెటర్ కెరీర్‌ను రూపొందించడంలో కీలక పాత్ర పోషించాడు. అమిత్ శుక్లాకు 18 సంవత్సరాల వయసులో, అతనికి మోడలింగ్ ఆఫర్ వచ్చింది. కానీ అతను క్రికెట్‌ను ఎంచుకున్నాడు. అమిత్ శుక్లా కెరీర్ గురించి చెప్పాలంటే, అతని వయసు కేవలం 22 సంవత్సరాలు. 7 ఫస్ట్-క్లాస్ మ్యాచ్‌లలో 32 వికెట్లు పడగొట్టాడు. అతను 6 లిస్ట్ ఏ మ్యాచ్‌లలో 6 వికెట్లు తీసుకున్నాడు. ఇంకా, అతను బ్యాటింగ్ కూడా చేయగలడు. అమిత్ శుక్లా ఇదే ప్రదర్శన కొనసాగిస్తే, అతను ఐపీఎల్‌లో కూడా తన ప్రదర్శనను చూసే అవకాశం త్వరలోనే రావొచ్చని తెలుస్తోంది.



## మహమ్మద్ షమీని జట్టులోకి తీసుకోవాలి

### మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ కీలక సలహా

సౌతాఫ్రికాతో తొలి టెస్ట్‌లో టీమిండియా ఓటమి నేపథ్యంలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ కీలక సలహా ఇచ్చాడు. టీమిండియా మాజీ స్పిన్నర్ మహమ్మద్ షమీని జట్టులోకి తీసుకోవాలని సూచించాడు. స్పిన్ పిచ్‌లను పక్కనపెట్టి సమతూకమైన వికెట్లపై ఆడాలని తెలిపాడు. స్పిన్నర్లతో కలిసి షమీ జట్టుకు విజయాలు అందిస్తాడని చెప్పాడు.రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా కోల్‌కతా వేదికగా ఆదివారం ముగిసిన తొలి టెస్ట్‌లో టీమిండియా 30 పరుగుల తేడాతో విజయం సాధించింది. 124 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఈ మ్యాచ్‌కు పూర్తిగా స్పిన్‌కు అనుకూలంగా ఉన్న వికెట్‌ను గంభీర్ తయారు చేయించగా భారత బ్యాటర్లు తడబడ్డారు. గింగిరాలు తిరిగిన బంతిని ఆడలేక ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్నారు.తాజాగా ఈ పరాజయం స్పందించిన గంగూలీ.. టీమిండియా తమ ప్రణాళికలను మార్చుకోవాలని సూచించాడు. 'గౌతమ్ గంభీర్ అంటే నాకు చాలా ఇష్టం. 2011 వన్డే ప్రపంచకప్‌తో పాటు 2007 టీ20 ప్రపంచకప్‌లో మెరుగైన ప్రదర్శన చేశాడు. టీమిండియా హెడ్ కోచ్‌గా అతను ఇంకొన్నాళ్లు కొనసాగుతాడు. అయితే గంభీర్ టెస్ట్ మ్యాచ్‌ల కోసం మంచి పిచ్‌లు ఎంచుకోవాలి. టెస్ట్ జట్టులోకి మహమ్మద్ షమీని తీసుకోవాలి. భారత పేసర్లు జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్, మహమ్మద్ షమీలపై గంభీర్ నమ్మకం ఉంచాలి. స్పిన్నర్లు, పేసర్లు కలిసి మ్యాచ్‌లు గెలిపిస్తారు. సమతూకమైన వికెట్లపై ఆడాలి. గంభీర్ ఈ విధంగా ఆలోచిస్తాడని ఆశిస్తున్నా. భారత బ్యాటర్లు 350-400 పరుగులు చేయకపోతే మ్యాచ్‌లు గెలవలేరు. ఇంగ్లండ్ పర్యటనలో భారత బ్యాటర్లు రాణించడంతోనే రెండు మ్యాచ్ గెలిచారు. గంభీర్ మంచి పిచ్‌లను ఎంచుకొని ఆటగాళ్లపై నమ్మకం ఉంచాలి. అంతేకాకుండా టెస్ట్‌లను ఐదు రోజుల్లో గెలవాలి కానీ మూడు రోజుల్లో కాదు'అని గంగూలీ చెప్పుకొచ్చాడు. 2023లో ఆఖరి మ్యాచ్ ఆడిన మహమ్మద్ షమీ.. ఫిట్‌నెస్ సమస్యలతో జట్టుకు దూరమయ్యాడు. ఆ తర్వాత ఫిట్‌నెస్ సాధించినా ఇంగ్లండ్ పర్యటనతో పాటు వెస్టిండీస్, సౌతాఫ్రికాతో టెస్ట్‌ల సిరీస్‌లకు షమీని సెలెక్టర్లు ఎంపిక చేయలేదు. ఫిట్‌నెస్ సమస్యలు ఉండటంతోనే షమీని పరిగణలోకి తీసుకోలేదని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ అన్నాడు. కానీ షమీ రంజీ ట్రోఫీలో 4 మ్యాచ్‌లు ఆడి 17 వికెట్లు పడగొట్టాడు.



## ఐపీఎల్ కెప్టెన్సీ వద్దంటున్నా

### స్టార్ క్రికెటర్ కేఎల్ రాహుల్

భారత వికెట్ కీపర్-బ్యాటర్ కేఎల్ రాహుల్ ఐపీఎల్ కెప్టెన్సీపై ఆటగాళ్లు ఎదుర్కొనే ఒత్తిడి గురించి ఇటీవల సంచలన విషయాలను వెల్లడించారు.అంతర్జాతీయ క్రికెట్‌తో పోలిస్తే ఐపీఎల్‌లో కెప్టెన్సీ ఒత్తిడి చాలా ఎక్కువగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. 33 ఏళ్ల కేఎల్ రాహుల్ గతంలో లక్నో సూపర్ జెయింట్స్ జట్టుకు సారథ్యం వహించిన సమయంలో వివాదాస్పదంగా మారారు. ముఖ్యంగా 2024 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై భారీ ఓటమి తర్వాత ఫ్రాంచైజీ యజమాని సంజీవ్ గోయెంకాతో మైదానంలోనే వాదనకు దిగిన ఘటన తీవ్ర చర్చనీయాంశమైంది. 2024 సీజన్ తర్వాత రాహుల్ లక్నో నుంచి వైదొలగడం గమనార్హం.'హ్యూమన్స్ ఆఫ్ బాంబే' కోసం జతిన్ సప్రూతో మాట్లాడుతూ.. ఐపీఎల్ కెప్టెన్లు నిరంతరం విపరీతమైన ఒత్తిడిలో ఉంటారని కేఎల్ రాహుల్ వెల్లడించారు. క్రీడా నేపథ్యం లేని యజమానుల స్థాయిలోనూ నిర్ణయాలను వివరించాల్సి రావడం చాలా కష్టమని ఆయన అన్నారు."ఐపీఎల్‌లో కెప్టెన్‌గా నాకు కష్టంగా అనిపించింది ఏంటంటే... మీటింగ్స్, రివ్యూలు చాలా ఎక్కువ అవసరం అవుతాయి, అంతేకాకుండా యజమానుల స్థాయిలో కూడా నిర్ణయాలకు వివరణ ఇవ్వాల్సి రావడం." గురించి కేఎల్ రాహుల్ మాట్లాడారు. "ఐపీఎల్ ముగిసే సమయానికి 10 నెలల అంతర్జాతీయ క్రికెట్ ఆడిన తర్వాత కంటే కూడా నేను మానసికంగా, శారీరకంగా ఎక్కువగా అలసిపోయాను అని గ్రహించాను," అని రాహుల్ పేర్కొన్నారు.ఐపీఎల్‌లో తరచుగా ఎదురయ్యే ప్రశ్నల గురించి కేఎల్ రాహుల్ వివరిస్తూ క్రీడా నేపథ్యం లేని వ్యక్తులకు వివరించడం కష్టమని తెలిపారు."కోచ్‌లు, కెప్టెన్లను నిరంతరం చాలా ప్రశ్నలు అడుగుతారు. ఒక దశ దాటాక అది విచారణలా అనిపిస్తుంది- 'ఎందుకు ఈ మార్పు చేశారు? అతన్ని ఎందుకు ఆడిస్తున్నారు? మన బౌలర్లు ఎందుకు స్పిన్ చేయించలేకపోతున్నారు? ప్రత్యర్థి 200 పరుగులు చేస్తే మనం 120 కూడా ఎందుకు చేయలేకపోయాం?' లాంటి ప్రశ్నలు వస్తాయి." అని అన్నారు.అంతర్జాతీయ క్రికెట్‌లో ఇలాంటి ఒత్తిడి ఉండదని కేఎల్ రాహుల్ వివరించారు. ఎందుకంటే అక్కడ కోచ్‌లు, సెలెక్టర్లకు ఆట సూక్ష్మ నైపుణ్యాలు తెలుసన్నారు. "సంవత్సరం పొడవునా మమ్మల్ని ఈ ప్రశ్నలు అడగరు, ఎందుకంటే కోచ్‌లకు ఏమి జరుగుతుందో తెలుసు. మీరు కేవలం కోచ్‌లకు,సెలెక్టర్లకు మాత్రమే జవాబు చెప్పాలి. వారంతా క్రికెట్ ఆడిన వారే, ఆటను అర్థం చేసుకుంటారు" అని రాహుల్ అన్నారు. కేఎల్ రాహుల్ చివరిగా ఒక ముఖ్యమైన విషయాన్ని చెప్పారు: "మీరు ఎన్ని పనులు చేసినా, ఎన్ని బాక్సులను టిక్ చేసినా, క్రీడల్లో ఏదీ విజయాన్ని హామీ ఇవ్వదు. క్రీడా నేపథ్యం లేని వ్యక్తులకు ఇది వివరించడం కష్టం." అని కేఎల్ రాహుల్ స్పష్టం చేశారు.కేఎల్ రాహుల్ లక్నో జట్టు మూడు సీజన్లు కెప్టెన్‌గా వ్యవహరించిన తర్వాత 2025 మెగా వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ (%ఇజ%) రూ. 14 కోట్లకు కొనుగోలు చేసింది. అయితే అక్కడ అతను కెప్టెన్సీ తీసుకోలేదు. అద్భుతమైన సీజన్ తర్వాత 2026 ఐపీఎల్ వేలానికి ముందు ఢిల్లీ క్యాపిటల్స్ అతన్ని రిటైన్ చేసుకుంది.

# డిసెబర్ 25న దండోరా

విలక్షణ నటులు శివాజీ, నవదీప్, నందు, బిందు మాధవి కాంబోలో తెరకెక్కిన చిత్రం 'దండోరా' . రవి కృష్ణ, మణిక, అనూష, రాధ్య ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. అన్నికార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం డిసెంబర్ 25న థియేటర్లకు వచ్చేందుకు రెడీ అయింది. ఈ నేపథ్యంలో మేకర్స్ తాజాగా సోమవారం ఉదయం ఈ చిత్రం టీజర్ రిలీజ్ చేశారు. టీజర్ చూస్తుంటే ఫక్తు తెలంగాణ మాండలికంలో వ్యంగ్యంగా తెరకెక్కించిన చిత్రంగా తెలుస్తోండగా, ముఖ్యంగా నాలుగు పుస్తకాలు చదివి లోకమంతా తెలిసినోడి లెక్క మాట్లాడకు... నీకు తెలియని లోకం ఇంకోటి ఉంది అంటూ సాగే డైలాగులు, సన్నివేశాలు ఆకట్టుకునేలా ఉన్నాయి. మీరూ ఓ లుక్కేయండి. గతంలో నేషనల్ అవార్డ్ దక్కించుకున్న చిత్రం 'కలర్ ఫోటో',ఆపై నవ్వులు పూయించిన 'బెదురులంక 2012' చిత్రాలను నిర్మించిన లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మాత రవీంద్ర బెనర్జీ ముప్పానేని ఈ 'దండోరా' చిత్రాన్ని నిర్మించారు. మురళీ కాంత్ దర్శకత్వం వహించాడు. మార్క్ కె. రాబిన్ సంగీతం అందించాడు.



# శివ వైబ్స్ క్రియేట్ చేస్తున్న నాగ్

అక్కినేని నాగార్జున నటించిన ఐకానిక్ మూవీ శివ ఇటీవలే గ్రాండ్‌గా రీరిలీజ్ అయిన విషయం తెలిసిందే. రీరిలీజ్‌లో సూపర్ రెస్పాన్స్ రాబట్టుకుంది శివ. ఇక మరోసారి శివ సినిమా నాటి వైబ్స్ క్రియేట్ చేస్తున్నాడు నాగార్జున. చైన్ బ్రాస్‌లెట్‌ను అరచేతిలో మడిచి పట్టుకున్న నాగార్జున బ్లాక్ డ్రెస్‌కు మ్యాచ్ అయ్యే గాగుల్స్‌తో స్టైలిష్‌గా రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై కూర్చొని కెమెరాకు ఫోజులిచ్చాడు. అయినప్పటికీ అతడి చరిష్మా శాశ్వతమైనది.. సొగసైనది..మరపురానిది..' అనే క్యాప్షన్‌తో పోస్ట్ చేసిన తాజా స్టిల్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఆరు పదుల వయస్సు దాటినా కుర్ర హీరోలకు ఏ మాత్రం తగ్గేదేలే అంటూ తాజా స్టిల్స్‌తో చెప్పకనే చెప్పేస్తున్నాడు నాగార్జున.ఈ ఏడాది కుబేర, కూలీ సినిమాలతో సూపర్ హిట్స్ అందుకున్నాడు టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగార్జున. నాగార్జున ప్రస్తుతం కెరీర్‌లో ల్యాండ్ మార్క్ సినిమాగా నిలిచిపోయే 100వ ప్రాజెక్ట్‌పై వర్క్ చేస్తున్నాడు. ఈ చిత్రాన్ని తమిళ దర్శకుడు రా కార్తీక్ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ మూవీని నాగార్జున 2026 మే నెలలో సమ్మర్ కానుకగా అభిమానుల ముందుకు తీసుకురావాలని ఎ÷-లాన్ చేస్తున్నట్టు ఇప్పటికే వార్తలు రాగా.. నాగార్జున టీం నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.



# గోవాలో 20న అంతర్జాతీయ చలనచిత్రోత్సవం




## ఆరంభ వేడుకల్లో బాలయ్యకు సన్మానం

ఒకప్పుడు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగే అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో తెలుగు వారికి సరైన ప్రాధాన్యత లభిస్తుండేది కాదు. కానీ ఇప్పుడు కాలం మారింది. యావత్ భారత సినీ రంగం తెలుగు వారివైపు ఆసక్తిగా చూస్తున్నాయి. తెలుగు సినిమాలే ఇవాళ జాతీయ స్థాయిలో దిశా నిర్దేశర చేస్తున్నాయి. అంతర్జాతీయ యవనికపై భారతీయ సినిమా సత్తాను చాటుతోంది కూడా తెలుగు సినిమాలే! ఈ నేపథ్యంలో తెలుగు సినిమా రంగానికి చెందిన కథానాయకులకు, దర్శకులకు అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో తగిన గుర్తింపు లభిస్తోంది. ఆ మధ్య మెగాస్టార్ చిరంజీవిని ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ వేదికపై ఘనంగా సత్కరించారు. ఇప్పుడు నందమూరి బాలకృష్ణను సత్కరించబోతున్నారు. నవంబర్ 20న గోవా లో 56వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం ప్రారంభం కానుంది. ఈ ఆరంభ వేడుకల్లోనే బాలకృష్ణను ఘనంగా సత్కరించబోతున్నారు. ఐదు దశాబ్దాల పాటు నందమూరి బాలకృష్ణ తెలుగు సినిమా రంగంలో హీరోగా రాణిస్తున్నారు. నందమూరి తారక రామారావు నట వారసుడిగా తెలుగు సినిమా రంగంలోకి అడుగుపెట్టిన బాలకృష్ణ మడమ తిప్పకుండా యాభై సంవత్సరాలు ముందుకు సాగుతున్నారు. ఎన్నో బ్లాక్ బస్టర్స్ ను తన ఖాతాలో వేసుకున్నారు. తెలుగు సినిమా రంగానికి ఆయన చేసిన సేవల కారణంగా ఈ సత్కారం జరుగబోతోంది. కేంద్ర ప్రభుత్వ అత్యున్నత గౌరవాల్లో ఒకటైన పద్మభూషణ్ పురస్కారాన్ని సైతం బాలకృష్ణ ఇటీవల అందుకున్నారు. కేవలం నటుడిగానే కాకుండా బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి చైర్మన్‌గా క్యాన్సర్ చికిత్స, పరిశోధన రంగంలో బాలకృష్ణ విశేష సేవలను అందిస్తున్నారు. అదేవిధంగా, మూడు సార్లు హిందూపురం ఎమ్మెల్యేగా ప్రజాసేవలో పదేళ్లకు పైగా కీలక పాత్ర పోషిస్తున్నారాయన.

# వచ్చే ఏడాది పెళ్లి పీటలు ఎక్కబోతున్నా

## తిరుమలలో నటుడు సాయిదుర్గతేజ్ వెల్లడి



మెగా మేనల్లుడు సాయి దుర్గ తేజ్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సోమవారం ఉదయం విఐపీ బ్రేక్‌లో ఆయన స్వామిని సేవించుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ వచ్చే ఏడాది తన పెళ్లి జరుగుతుందని క్లారిటీ ఇచ్చారు. ఎన్నో రోజులుగా పెళ్లిపై వస్తున్న రూమర్‌లకు చెక్ పెట్టారు తేజ్.'చక్కని సినిమాలు, మంచి జీవితం ఇచ్చిన భగవంతుడికి కృతజ్ఞతలు తెలిపేందుకు తిరుమల వచ్చాను. కొత్త సంవత్సరం వస్తున్న తరుణంలో శ్రీవారి ఆశీస్సులు కావాలని దర్శించుకున్నాను. వచ్చే ఏడాదిలో నేను నటించిన 'సంబరాల ఏటిగట్టు' విడుదలవుతుంది. ప్రేక్షకులు, అభిమానులు ఆదరిస్తారని ఆశిస్తున్నా' అన్నారు. పెళ్లిపై వస్తున్న రూమర్లపై ఓ జర్నలిస్ట్ ప్రశ్నించగా.. 'వచ్చే ఏడాదిలోనే నా పెళ్లి ఉంటుంది' అని సమాధానమిచ్చారు తేజ్. 'సంబరాల ఏటిగట్టు' చిత్రాన్ని రోహిత్ కె.పి. తెరకెక్కిస్తున్నారు. ఐశ్వర్య లక్ష్మి కథానాయిక. 'తన జీవితంలో చాలా ముఖ్యమైన సినిమా ఇదని, అందరి అంచనాల్ని అందుకునేలా కష్టపడుతున్నానని సాయితేజ్ ఇటీవల ఓ వేదికపై తెలిపారు.



# తన ఫోటోలతో ఫేక్ సోషల్ అకౌంట్లు

## సైబర్ మోసాలపై నటి అదితి రావు హైదరీ ఆందోళన

నటి అదితి రావు హైదరీ సోషల్ మీడియాలో తన పేరుతో జరుగుతున్న మోసాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం పలు దేశీయ, పాన్ ఇండియా ప్రాజెక్టులతో బిజీగా ఉన్న అదితి, పెళ్లి తర్వాత కూడా తన క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదని నిరూపిస్తూనే ఉంది. తరచూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఆమె, తాజాగా వాట్సాప్‌లో తన ఫోటోలను ఉపయోగిస్తూ ఫేక్ అకౌంట్లు సృష్టిస్తున్నారని వెల్లడించారు. అదితి షేర్ చేసిన స్క్రీన్‌షాట్‌లో, ఒక వ్యక్తి ఆమె పేరు, ఫోటోలను ఉపయోగిస్తూ ఫోటోగ్రాఫర్లకు ఫోటోషూట్ల పేరుతో మెసేజులు పంపుతున్నట్లు కనిపించింది. ఈ విషయం తెలిసిన వెంటనే ఇన్‌స్టాగ్రామ్‌లో క్లారిటీ ఇస్తూ అభిమానులను అప్రమత్తం చేశారు.ఈ రోజు కొంతమంది నాకు చెప్పిన విషయాన్ని మీతో పంచుకుంటున్నాను. వాట్సాప్‌లో నా ఫోటోలను ఉపయోగిస్తూ ఎవరో 'ఫోటోషూట్' కోసం మెసేజులు పంపుతున్నారు. అవి నేను పంపినవి కావు. నేను ఎప్పుడూ నా పర్సనల్ నంబర్‌ను వర్క్ కోసం ఉపయోగించను. నా అధికారిక పనులు అన్నీ నా టీమ్ ద్వారానే జరుగుతాయి. అలాంటి మెసేజులు వస్తే వెంటనే నా జీసరఇనీనిని।ఇబి టీమ్‌కి తెలియజేయండి. నాకు ఎప్పుడూ అండగా నిలిచే అభిమానులకు ధన్యవాదాలు, అని అదితి పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇటీవల పలువురు సెలబ్రిటీలు సోషల్ మీడియా ఫేక్

# హీరోగా ఎంట్రీ ఇస్తున్న రమేశ్ బాబు తనయుడు

ఘట్టమనేని కుటుంబం నుంచి మూడో తరం హీరో ఎంట్రీకి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సూపర్ స్టార్ మహేష్ బాబు సోదరుడు దివంగత రమేష్ బాబు తనయుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయం అవుతున్న విషయం తెలిసిందే. 'ఆర్ఎక్స్ 100', 'మంగళవారం' వంటి సినిమాలకు దర్శకత్వం వహించిన అజయ్ భూపతి ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతుండగా, సినిమా నుంచి మరో ఆసక్తికర అప్డేట్ బయటకు వచ్చింది.ఈ చిత్రంలో హీరోయిన్‌గా బాలీవుడ్ స్టార్ హీరోయిన్ రవీనా టాండన్ కుమార్తె రషా తడానీ అధికారికంగా కన్ఫర్మ్ అయ్యింది. ఇది ఆమెకు తొలి తెలుగు చిత్రం. ఈ సందర్భంగా టీం ప్రత్యేక పోస్టర్ విడుదల చేస్తూ రషాకు గ్రాండ్ వెల్‌కమ్ చెప్పింది. కొద్ది రోజులుగా ఆమె నటిస్తుందంటూ ప్రచారం జరుగుతుండగా, సోమవారం విడుదలైన పోస్టర్‌తో దీనికి అధికారిక క్లారిటీ వచ్చింది. 'ంః4' పేరుతో ప్రచారం జరుగుతున్న ఈ ప్రాజెక్ట్ నవంబర్ నెలలోనే రెగ్యులర్ షూటింగ్‌కు వెళ్లనుంది. బాలీవుడ్‌లో రషా అరంగేట్రం చేసియగా, అప్పుడు 'ఆజాద్' సినిమాలో ఒకే ఒక్క స్పెషల్ సాంగ్‌తోనే ఆమె ఓవర్‌నైట్ స్టార్ అయింది. ఎనర్జిటిక్ డ్యాన్స్ మూవ్‌మెంట్‌లు, స్క్రీన్ ప్రెజెన్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. ఇప్పుడు అదే జోష్‌తో తెలుగు ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.జయకృష్ణ ఘట్టమనేనిని న్యూ ఏజ్ లవ్ స్టోరీతో ఇండస్ట్రీకి పరిచయం చేస్తున్నారు. తిరుపతి ? చిత్తూరు నేపథ్యంతో ఈ చిత్రం తెరకెక్కనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల రిలీజ్ చేసిన కాన్సెప్ట్ పోస్టర్ కూడా ఈ విషయాన్నే స్పష్టం చేసింది. ఈ చిత్రం తెలుగు సినిమాల్లో కొత్త ట్రెండ్‌ను సెట్ చేసేలా ఉంటుందని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. టాలీవుడ్ టాప్ ప్రొడ్యూసర్ అశ్వినీదత్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. 'రాజకుమారుడు'తో మహేష్ బాబును హీరోగా పరిచయం చేసిన అశ్వినీదత్, ఇప్పుడు ఘట్టమనేని ఫ్యామిలీ నుంచి మూడో తరం హీరోను కూడా పరిచయం చేయడం విశేషం. చందమామ కథలు బ్యానర్‌పై పి. కిరణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.ఈ చిత్రానికి 'శ్రీనివాస మంగాపురం' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు సమాచారం. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన రానుందని మూవీ వర్గాలు చెబుతున్నాయి.

EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685